www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 26 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ చైత్ర బహుళ ద్వాదశి

17-23 ఏప్రిల్ 2023

వెల : ₹15/-

# ప్రశ్నపత్రంలో యుద్ధతంత్రం...



బండి సంజయ్ అరెస్టుతో రాష్ట్ర ప్రభుత్వం మీద
నరేంద్ర మోదీ విరుచుకుపడతారనీ, అదే తమకు వరమవుతుందనీ
బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వం ఆశ పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.


75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




# మోదీ తీరే వేరయా...

ప్రధాని నరేంద్ర మోదీ శైలే వేరుగా ఉంటుంది. అందుకు తాజా ఉదాహరణ తెప్పకాడులోని ఏనుగుల సంరక్షణా కేంద్రాన్ని ఆయన ఇటీవల సందర్శించడమే. 'ఎలిఫెంట్ విష్పరర్స్' పేరుతో నిర్మించిన (నిర్మాత గునీత్ మోంగా, దర్శకురాలు కార్తికి గొన్సాల్వెస్) డాక్యుమెంటరీలో కనిపించి భారతదేశానికి ప్రతిష్టాత్మక ఆస్కార్ పురస్కారం తెచ్చిన భార్యాభర్తలు బొమ్మన్, బిల్లీ ఈ కేంద్రంలోనే ఉంటారు. ఇది తమిళనాడులో ఉన్నది. ఈ నెల 8న ఆయన తమిళనాడు పర్యటనలో భాగంగా ఆ ఏనుగల రక్షణ కేంద్రానికి కూడా వెళ్లి ఆ దంపతులను అభినందించి, అక్కడి ఏనుగుల మధ్య కొద్దిసేపు గడిపారు. ఈ చిన్న డాక్యుమెంటరీ ఆ దంపతుల నిజ జీవితం ఆధారంగానే నిర్మించారు. వీరే ఒక గున్న ఏనుగును దత్తత తీసుకుని పెంచారు. దాని పేరు రఘు. ఈ అద్భుత దంపతులను కలుసుకోవడం మంచి అనుభవమని ఆయన ట్వీట్ చేశారు కూడా. ఆయనే కొన్ని ఫొటోలు కూడా తీశారు. ఇలాంటి సాధారణ వ్యక్తుల అసాధారణ సేవలను గుర్తించడం నిజంగానే గొప్ప విషయం. ఏమో, వచ్చే పద్మ పురస్కారాల జాబితాలో వీరి పేర్లు ఉండవచ్చునేమో!








ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక
మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

**రండి.. జాతీయభావాల వేదిక**
**జాగృతి చందాదారులుగా చేరుదాం! చేర్పిద్దాం!!**

## పాఠకుల విన్నపం మేరకు

**జాగృతి చందా పెంపు ముందు ప్రకటించినట్లు 2023 ఏప్రిల్ 1 నుండి కాకుండా 2023 జూన్ 1 నుండి అమలులోకి వస్తుంది. కనుక ఏప్రిల్, మే మాసాలలో జాగృతి చందా కట్టేవారికి పాత రేట్లే (1 సం. రూ. 650/-, 5 సం.ల రూ. 3000/-) వర్తిస్తాయి.**

ఇట్లు:
కుర్రా దుర్గారెడ్డి,
అసోసియేట్ ఎడిటర్

**జూన్ 1 నుండి..**

| ఒక సంవత్సర చందా | విడి ప్రతి | ఐదు సంవత్సరాల చందా |
|---|---|---|
| రూ.850/- | రూ.20/- | రూ.4000/- |

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyd- 27. Ph : 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

కొన్ని నియమ నిబంధనలు అప్పటికే కాదు... ఎప్పటికీ అవసరం. ఆరోగ్య విషయంలో అవి మరీ ముఖ్యం. దేశవ్యాప్తంగా కరోనా ప్రమాద ఘంటికలు మరోసారి మోగుతుండగా వైరస్ అనుభవం అదే చాటి చెబుతోంది. వాతా వరణంలో మార్పులు, మానవ నిర్లక్ష్యం వంటివి ఈ కేసుల పెరుగుదలకు ఊతం ఇస్తున్నాయి. వారం వ్యవధిలో కరోనా కేసులు పదుల నుంచి వేలకు చేరుకున్నట్లు, పదుల సంఖ్యలో మరణాలు నమోదవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ తాజాగా రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్యశాఖ మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కరోనా లక్షణాలు సోకిన వారికి చికిత్స అందించే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో సదుపాయాలపై ఈ నెల 10, 11 తేదీలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్, వ్యాక్సినేషన్, అప్రాప్రియేట్ బిహేవియర్.. అనే ఐదంచెల వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేంద్రం సూచించింది. కరోనా, వేరియంట్ల నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై 8, 9 తేదీలలో ఆయా రాష్ట్రాలు జిల్లా అధికార యంత్రాంగాలతో సమావేశాలు నిర్వహించాయి.

ఈ వైరస్ లక్షణాలు మారుతూ, రకరకాల వేరియంట్‌లు పుట్టు కొస్తున్నాయి. బీక్యూ-1, ఎక్స్‌బీబీ-1.5, బీఏ-2.75, సీహెచ్ 1.1, ఎక్స్‌బీబీ, ఎక్స్‌బీబీ-1.16, ఎక్స్‌బీఎఫ్... వేరియంట్లు వ్యాధి విస్తరణకు కారణమని నిపుణులు భావిస్తున్నారు. వీటివల్ల ఇప్పటికిప్పుడు ప్రాణాంతక పరిస్థితులు లేవని తెలుస్తున్నా, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిరంతరం అధ్యయనం, నిఘా కొనసాగిస్తోంది.

రెండేళ్ల క్రితం కొవిడ్ విజృంభణ సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూపిన సమన్వయాన్నే ఇప్పుడూ ప్రదర్శించవలసి ఉంది. కానీ దేశంలోని 23 రాష్ట్రాలలో కరోనా పరీక్షల సంఖ్య జాతీయ సగటు కంటే తక్కువగా

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ చైత్ర బహుళ ద్వాదశి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**ప్రశ్నపత్రంలో యుద్ధతంత్రం..**
6లో

జాతీయం
**ఎవరి కుట్ర ఇది?**

14లో


ధారావాహిక నవల
**వరాహమిహిర**
- పాలంకి సత్య
20లో

# జాగృతి

## సంపాదకీయం

# కరోనా ముప్పుపై అప్రమత్తం

ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. మరోవంక, కొవిడ్ నిబంధనల ఎత్తివేతతో ప్రజలలో స్వేచ్ఛా సంచారం, కాస్తంత నిర్లక్ష్య ధోరణి పెరగగా, కరోనా ముప్పు దాటిపోలేదని పెరుగుతున్న కేసులను బట్టి తెలుస్తోంది. సుమారు రెండేళ్ల పాటు అమలులో ఉన్న కొవిడ్ నిబంధనలను ప్రభుత్వం దశల వారీగా సడలిస్తూ వచ్చింది. దీంతో పండుగలు, పబ్బాలు, శుభాశుభ కార్యక్రమాలలో జనం పెద్ద సంఖ్యలో కలసి మెలసి తిరగడం మామూలై పోయింది. స్వీయరక్షణ కోసం నిబంధనల ఆచరణ, భౌతికదూరం పాటించాలన్న స్పృహ కొరవడుతోంది. మాస్క్ ధారణ తగ్గిపోయింది. నిత్య వ్యవహారాలు, బతుకు తెరువు కోసం బయటికి రావడానికి వీలుగా ప్రభుత్వం కోవిడ్ నిబంధనలు సడలించినా కనీస జాగ్రత్తలు పాటించడం, శానిటైజేషన్ లాంటి చర్యలను అలవాటుగా మార్చుకోవలసి ఉంది.

ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి దేశవ్యాప్తంగా కరోనా క్రియాశీలక కేసుల సంఖ్య సుమారు 33 వేలకు చేరింది. పాతిక మంది దాకా వైరస్‌తో పోరాడుతూ మృతి చెందారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నెల 7వ తేదీన 6,050 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే పరిణామం. ఆరున్నర నెలల తరువాత ఇంత పెద్ద సంఖ్యలో కేసులు నమోదు కావడంతో కొన్ని రాష్ట్రాలు అప్రమత్తమవుతున్నాయి. అందులో భాగంగా, కేరళలో గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఆ రాష్ట్ర ప్రభుత్వం మాస్క్ ధారణను తప్పనిసరి చేసింది. పుదుచ్చేరి ప్రభుత్వం మరొక అడుగు ముందుకు వేసి ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రజలంతా విధిగా మాస్క్‌లు ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రికాషనరీ డోసుల విషయంలో తెలంగాణ ముందంజలో ఉందని, వ్యాక్సినేషన్ విషయంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటోంది.

కొవిడ్ పట్ల అప్రమత్తత ఆవశ్యకత గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి వేదికపైనా ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఆయన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రసారభారతి మాధ్యమాల ద్వారా దేశ ప్రజలతో వివిధ అంశాలపై తమ 'మనసులోని మాట' (మన్ కీ బాత్) పంచుకునే కార్యక్రమంలో కరోనా మహమ్మారి జడలు విప్పిన నాటి నుంచి ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూనే ఉన్నారు. ఇదే అంశంపై ప్రత్యేక ప్రసంగాల ద్వారా జనులను జాగృత పరుస్తున్నారు.

కరోనా తీవ్రత సమయంలో ప్రభుత్వం నిర్బంధంగా అమలు చేయించిన నియమాలను కొనసాగించడం ద్వారా కనిపించని శత్రువు కరోనా మహమ్మారిని నుంచి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా తొలిదశలో (2020 ప్రథమార్థంలో) నరేంద్రమోదీ సరైన సమయంలో లాక్‌డౌన్ విధించి ప్రాణాలు కాపాడారని జాతీయ, అంతర్జాతీయ సమాజాలలోని అత్యధికశాతం ఆలోచనపరులు అభిప్రాయపడ్డారు. దేశం వివిధ రంగాలలో కాలుచేయి కూడదీసుకుంటూ గాడిలో పడిన ప్రస్తుత తరుణంలో అలాంటి పరిస్థితి రాకుండా చూడవలసిన బాధ్యత ప్రజావళిదే. 'గోటితో పోయేదానికి గొడ్డలిదాకా ఎందుకు' అన్నట్లు లాక్‌డౌన్ లాంటి పరిస్థితులు తలెత్తకుండా, ఎవరికి వారే తగు జాగ్రత్తలు, స్వీయ నియంత్రణ, రోగ నిరోధక శక్తి పెంపొందించే ఆహార స్వీకరణ లాంటివి పాటిస్తే కొంత వరకు సత్ఫలితాలు సిద్ధించవచ్చు. కరోనా కట్టడిలో ప్రభుత్వ బాధ్యత కంటే ప్రజల పాత్ర కీలకమన్న సంగతి మరోసారి గుర్తెరగాలి. ★

 | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**గురుసాక్షాత్**

– డాక్టర్ కేజీ వేణు




ఇదేనా సుపరిపాలన? (వేదిక) – 16
అమెరికాలో ట్రంప్ 'మార్కు' రాజకీయాలు (అంతర్జాతీయం) – 24
పావన గంగకు పుష్కర శోభ (ప్రత్యేక వ్యాసం) – 26
గాయనీమణి.. శిక్షక రమణి 'అంజని' (మహిళ) – 28
చీకటియుగం మీద కొత్త వెలుగు (ఓరుగల్లు సాహితీ ఉత్సవం) – 33
ఐపీఎల్–16లో అరుదైన రికార్డులు! (క్రీడ) – 43
బాలజాగృతి – 46
అనుబంధాలు, ఆత్మీయతలకే పెద్దపీట! (సినిమా) – 50

ఆ రెండు ఘట్టాలకు నడుమ వ్యవధి కేవలం నాలుగు రోజులే. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను ఏప్రిల్ 4వ తేదీ అర్ధరాత్రి ఒక ఉగ్రవాది అన్నట్టు హంగామాతో అరెస్టు చేశారు. ఏప్రిల్ 8వ తేదీన ఉదయమే ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వచ్చారు. బండి సంజయ్ అరెస్టు, తీరుతెన్నులు, స్పష్టంగా తెలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కక్షపూరిత వైఖరి, పోలీసుల వీరంగం ప్రధాని ప్రసంగం మీద ప్రభావం చూపక తప్పని పరిస్థితిని బీఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించింది. ఒక విధంగా బీఆర్ఎస్ మీద, ఆ పార్టీకి సర్వం తానే అయిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పరివారం మీద బీజేపీ నేతగా ప్రధాని మోదీ యుద్ధం ప్రకటించే ఘడియను వారే ముందుకు తెచ్చినట్టయింది. చిత్రంగా ఈ కాస్త వ్యవధిలోనే లీకేజీ కేసు నీరుగారిపోవడం మొదలయింది. పదోతరగతి హిందీ పరీక్ష ప్రశ్నపత్రం బయటికి రావడానికి బండి సంజయ్ కారణమని ప్రభుత్వం, పోలీసులు ఆరోపించారు. అయితే తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలంటూ సంజయ్ అడిగినా పోలీసుల నుంచి జవాబు లేదు.



# ప్రశ్నపత్రంలో

సంజయ్ పేపర్ లీక్‌కు కారకుడు కాబట్టి, అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యగా ఈ అరెస్టు జరిగిందని ఆర్థికమంత్రి హరీశ్‌రావు విలేకరులకు చెప్పారు. బీఆర్ఎస్ మరొక ప్రముఖుడు, ముఖ్యమంత్రి కుమారుడు, ఐటీ శాఖను కూడా నిర్వహిస్తున్న కేటీ రామారావు కూడా లీక్ వెనుక బండి సంజయ్ హస్తం ఉందని ఆగమేఘాల మీద ఆరోపించారు. సంజయ్‌తో పాటు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కూడా బాధ్యుడిని చేశారు కేటీఆర్. ఇంతకీ మంత్రులు చెప్పినట్టు ఒక ప్రశ్నపత్రం లీక్ అయితే అది శాంతిభద్రతల సమస్య అవుతుందా? అందుకు దారి తీస్తుందా? లేక పర్యటనకు ముందు బీజేపీ ప్రముఖులను అరెస్టు చేయడం ద్వారా ప్రధానిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసే ఉద్దేశమా? ఈటల రాజేందర్, రఘునందన రావు, బీజేపీ బహిష్కృత నేత రాజాసింగ్, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు, న్యాయవాది రామచందర్ రావులు కూడా పోలీసు జులుం ఎదుర్కొనవలసి వచ్చింది. లీక్ వివాదంలో బండి సంజయ్‌ని ఏ1 గా పోలీసులు నమోదు చేశారు. 14 రోజుల రిమాండ్ కూడా కోర్టు ప్రకటించింది. కానీ క్షణాలలో అంతా మారిపోయింది. షరతులతోనే కావచ్చు, సంజయ్‌కి బెయిల్ ఇవ్వక తప్పలేదు.



ఇంతకీ ఏ పరీక్షార్థి ప్రశ్నపత్రం బయటకు వచ్చిందని ఆరోపణ ఉన్నదో, అతడికి హైకోర్టు ఊరట నిచ్చింది. అతడిని మిగిలిన పరీక్షలకు అనుమతించాలని కోర్టు ఆదేశించడం కొసమెరుపు. ఒక వ్యక్తి బయటనుంచి పరీక్షాకేంద్రంలోకి ఎలా వచ్చాడు? ఆ విద్యార్థి ప్రశ్నపత్రాన్ని తీసుకుని ఎలా ఫోన్‌లో ఫొటో తీశాడు? ఈ ప్రశ్నలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

బండి సంజయ్ అరెస్టుతో రాష్ట్ర ప్రభుత్వం మీద నరేంద్ర మోదీ విరుచుకుపడతారనీ, అదే తమకు వరమవుతుందనీ బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వం ఆశ పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది. ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ వెల్లడించిన సంగతి నుంచి ప్రధాని దృష్టిని మళ్లించడానికి సంజయ్ ఉదంతాన్ని సృష్టించారని అనిపిస్తుంది. తనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే విపక్షాల అభ్యర్థులందరి ఎన్నికల ఖర్చు తానే భరిస్తానని కేసీఆర్ చెప్పారని రాజ్‌దీప్ వెల్లడించడం విశేషం. ఇదేమీ సాధారణ విషయం కాదు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీలో కేటీఆర్ రాజీనామా చేయాలని బీజేపీ, కాంగ్రెస్, ఇంకా బీఆర్ఎస్ వ్యతిరేక శిబిరం గట్టిగా కోరుతున్న సంగతి తెలిసిందే. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీ మీద దర్యాప్తు కూడా చివరి దశలోనే ఉంది. కాంగ్రెస్ చొరవతో ఈడీ కూడా రంగంలోకి దిగింది. మరీ



# యుద్ధ తంత్రం...

సుజాత గోపగోని

ముఖ్యంగా ఈ అంశం మీద రాష్ట్ర గవర్నర్ స్పందించడం బీఆర్ఎస్‌కు చెమటలు పట్టించే వ్యవహారమే. అంతకు ముందు ఎమ్మెల్సీ కవితను ఈడీ ప్రశ్నించడం కూడా బీఆర్ఎస్ మీద వ్యతిరేకతను పెంచింది. వీటన్నిటినీ ప్రజానీకం మరచిపోయేటట్టు చేయడానికి జరిగిందే సంజయ్ అరెస్ట్. ఇప్పుడు ప్రధాని నేరుగా తెలంగాణ ప్రజలను ఉద్దేశించి కుటుంబ, అవినీతి పాలనకు చరమగీతం పాడాలా? వద్దా? అని ప్రశ్నించారు. ఇందుకు బీజేపీ శ్రేణుల నుంచి ఎలాంటి సమాధానం వస్తుందో తెలియనిది కాదు.

తాజా వివాదంలో బీఆర్ఎస్ మంత్రుల తీరు మరీ హాస్యాస్పదంగా ఉంది. ప్రశ్నపత్రం లీకేజీ వెనుక ప్రధాని మోదీ అధ్వర్యంలో నడుస్తున్న నమో గ్రూపు హస్తం ఉందని ఒకరు, రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగమని మంత్రులంతా బృందగానం చేశారు. మంత్రులే రోడ్డెక్కి ఒక ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేయడం మరొక విశేషం. నిజానికి తెలంగాణలో ప్రస్తుతం ప్రశ్నపత్రాల లీకేజీ హవా నడుస్తున్నది. పోటీ పరీక్షల నుంచి పదో తరగతి ప్రశ్నపత్రం వరకు ఇందులో ఉన్నాయి. పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కంటే చాలా ముందు నుంచే రాష్ట్రం లీకేజీలతో అట్టుడుకుతున్నది. కానీ పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీక్ తరువాత, బండి సంజయ్ 'అడ్డంగా దొరికిన' తరువాత లీకేజీలు ఆగిపోయాయని ఆర్థికమంత్రి హరీశ్‌రావు చెప్పడం వింతే. అంటే అన్ని లీకులకు సంజయ్‌నే బాధ్యుడిని చేయాలని తాము అనుకుంటున్న విషయాన్ని పరోక్షంగానే అయినా ఆయన బయటపెట్టుకున్నారు. పైగా సంజయ్ చర్యలకు బీజేపీ అధిష్ఠానం మద్దతు కూడా ఉండొచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. అధికారం చేతిలో ఉండగా ఆ అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆటంక పరుస్తున్నవారు ఎవరు? ఇదంతా ప్రజలు చూస్తున్నారు. వారికి వచ్చిన ప్రశ్న– బీజేపీ ఇన్ని కుట్రలు యథేచ్ఛగా సాగిస్తున్నదని తెలిసి ఉంటే రాష్ట్ర పోలీస్ శాఖ, నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయి? హోంమంత్రి ఏం చేస్తున్నట్టు? ప్రశ్నపత్రం లీకేజీతో పాటు బీజేపీ వారు ఇంకా ఎన్ని కుట్రలు చేశారో వాటిని కూడా బయటకు తీస్తామని గంగుల కమలాకర్ హెచ్చరించడం ఒక ప్రహసనం కంటే తక్కువేమీ కాదు.

ప్రశ్నపత్రం లీకేజీ తీరు, సంజయ్ అరెస్టుకు దారి తీసిన పరిస్థితులను వివరించిన వరంగల్ పోలీస్ కమిషనర్ తీరు, ఖాకీదుస్తులు వేసుకున్న మరొక రాష్ట్ర మంత్రినే తలపించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ప్రభుత్వాన్ని అసమర్థంగా చూపడానికీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులను

గందరగోళ పరచడానికి ప్రయత్నించారని వ్యాఖ్యానించడం చూస్తే అదొక రాజకీయనేత మాట్లాడినట్టే ఉంది. రాష్ట్రంలో డీజీపీ అంజనీకుమార్ తన చట్టాన్ని అమలు చేయడం సరికాదనీ, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని బీజేపీ ఎమ్మెల్యే రఘునందనరావు అందుకే తీవ్రంగా వ్యాఖ్యానించవలసి వచ్చింది. న్యాయమూర్తి ఎదుట హాజరు పరచడానికి సంజయ్‌ను హనుమకొండకు తీసుకు వస్తున్నప్పుడు బీఆర్ఎస్ కార్యకర్తలు కాన్వాయ్‌పై దాడి చేయడం మరొక తీవ్రమైన అంశం. ఇది చూస్తే రఘునందనరావు రాష్ట్రంలో బిహార్ రాజ్యం తీసుకురావద్దని వ్యాఖ్యానించారు. సంజయ్‌ని తీసుకువస్తున్న పోలీసు వాహనం మీద బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడి చేయడం గురించి రాష్ట్ర ప్రభుత్వం ఏం చెబుతుంది? అరాచకాన్ని సృష్టించేందుకు ప్రయత్నించినదీ, వ్యవస్థలను అవమానించినదీ ఎవరు? ఇక సంజయ్ అరెస్టును నిరసిస్తూ రాష్ట్రంలో నిరసన తెలిపిన వారు కూడా పోలీసు జులుం ఎదుర్కొనవలసి వచ్చింది. దీనికి పతాక సన్నివేశం– వరంగల్ పోలీస్ కమిషనర్ అవినీతి చిట్టా తాము వెలికి తీస్తున్నామని, ఆయన మీద పరువు నష్టం దావా వేస్తానని బండి సంజయ్ ప్రకటించారు.

ప్రశ్నపత్రాల లీకేజీలు తెలంగాణలో కలకలం సృష్టించాయి. పెరిగిన టెక్నాలజీ, అందరికీ అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ప్రతి అంశాన్నీ వెంటాడుతున్నాయి. ప్రభుత్వాలు అత్యంత కాన్ఫిడెన్షియల్‌గా ఉంచాల్సిన అధికార రహస్యాలు కూడా బయటకు వచ్చిన సందర్భాలున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీ కూడా ఆ కోవలోకే వచ్చి చేరింది. మొన్నటికి మొన్న ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకయ్యింది. ఆ తర్వాత పాఠశాల విద్యకు ప్రామాణికంగా నిలిచే పదో తరగతి పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు బయటకొచ్చాయి. తొలిరోజు, రెండోరోజు వరుసగా లీకయ్యాయి. అయితే, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన అంశంలో అధికారుల్లోనే భిన్న వాదనలు, విభిన్న ప్రస్తావనలు, వేర్వేరు ప్రకటనలు వచ్చాయి. ప్రశ్నపత్రం లీకేజీ అని, కాదు.. కాదు.. మాస్‌కాపీయింగ్ కిందకు వస్తుందనీ చర్చ జరిగింది. అధికారుల ప్రకటనలు వీటికి తోడయ్యాయి. మొత్తానికి అధికార యంత్రాంగం, ప్రభుత్వం ప్రమేయం లేదని.. వైఫల్యం అసలే కాదన్న కోణాన్ని రిజిస్టర్ చేయడంలో సఫలమయ్యామన్న సంతృప్తి అధికార వర్గాల్లో కనిపించింది. చివరకు ఈ ఎపిసోడ్ మొత్తం రాజకీయ మలుపు తీసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చను లేవనెత్తింది.

ఎస్సెస్సీ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుతో పాటు వాళ్ల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలకు

> ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభమైన రోజే ప్రశ్నపత్రం లీకయ్యింది. ఆ వ్యవహారంలో నలుగురిపై పాఠశాల విద్యాశాఖ అదేరోజు సాయంత్రానికి కఠిన నిర్ణయం తీసుకుంది. మరుసటిరోజు హిందీ పేపర్ లీకయ్యింది. ఈ పరిణామం అందరినీ ఆలోచింప జేసింది. సంఘటన, పూర్వాపరాలు పరిశీలిస్తే ఓ మైనర్ బాలుడు ప్రశ్నపత్రాన్ని లీక్ చేశాడన్నది పోలీసులు చెప్పిన మాట. అంటే.. తొలి నిందితుడు అతనే అయి ఉండాలి. పేపర్‌ను బయట సర్క్యులేట్ చేసిన వాళ్లు తదుపరి నిందితుల జాబితాలోకి చేరాలి. ఈ అంశం బహిర్గతమైన రోజు పోలీసుల ఆలోచన అలాగే ఉంది.

సంబంధించినవి. ఏ అంతరాయం కలిగినా, ఏ పొరపాటు దొర్లినా, ఏ విధమైన తప్పు జరిగినా విద్యార్థులను, తల్లిదండ్రులను మానసికంగా ప్రభావితం చేస్తాయి. కానీ దీనిని రాజకీయ కోణంలో చూస్తుండటం ప్రస్తావించదగిన అంశం. విద్యార్థులు జాతి సంపద. వాళ్లకు సంబంధించిన అంశాలు, సమస్యలు, సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కోవడం, వాటిని పరిష్కరించడంలో సహకారం అందించడం అన్ని రాజకీయ పార్టీల విధి. కానీ, ఈ అంశం చుట్టూ భ్రమించిన పరిణామాల మేరకు ప్రశ్నపత్రాల లీకేజీ అంశం ఫక్తు రాజకీయ అంశంగా మారింది. దీనిని అధికార పార్టీ ప్రత్యర్థులను వేధించే అస్త్రంగా మార్చుకుంది. బండి సంజయ్ అరెస్ట్, ముందు వెనుక జరిగిన పరిణామాలను బట్టి ఇలాంటి అభిప్రాయానికి రాక తప్పదు.

ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభమైన రోజే ప్రశ్నపత్రం లీకయ్యింది. ఆ వ్యవహారంలో నలుగురిపై పాఠశాల విద్యాశాఖ అదేరోజు సాయంత్రానికి కఠిన నిర్ణయం తీసుకుంది. మరుసటిరోజు హిందీ పేపర్ లీకయ్యింది. ఈ పరిణామం అందరినీ ఆలోచింప జేసింది. సంఘటన, పూర్వాపరాలు పరిశీలిస్తే ఓ మైనర్ బాలుడు ప్రశ్నపత్రాన్ని లీక్ చేశాడన్నది పోలీసులు చెప్పిన మాట. అంటే.. తొలి నిందితుడు అతనే అయి ఉండాలి. పేపర్‌ను బయట సర్క్యులేట్ చేసిన వాళ్లు తదుపరి నిందితుల జాబితాలోకి చేరాలి. ఈ అంశం బహిర్గతమైన రోజు పోలీసుల ఆలోచన అలాగే ఉంది. మీడియాకు సమాచారం ఇచ్చిన సమయంలోనూ ఇవే వివరాలు ఉన్నాయి. కానీ, మరుసటిరోజుకే అంతా మారిపోయింది. నిందితుల జాబితా కకావికలం అయ్యింది. ఈ కేసులోకి రాజకీయ వైషమ్యం వచ్చి చేరింది. ప్రశ్నపత్రం లీక్ అయిన గంట సేపటి తర్వాత వాట్సప్‌లో దానిని అందుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మొదటి నిందితుడిగా మారాడు. మారాడు అనేకంటే వత్తిళ్లతో మార్చేశారు అనడం సబబు.

హన్మకొండ జిల్లా కమలాపూర్ జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో హిందీ పేపర్ లీక్ అయ్యింది. అక్కడి ఓ కూలీ కుమారుడైన 16 ఏళ్ల బాలుడు పాఠశాల భవనాన్ని ఆనుకొని ఉన్న చెట్టు ఎక్కి మొదటి అంతస్తు కిటికీ వద్దకు వచ్చి, పరీక్ష రాస్తున్న విద్యార్థి నుంచి బలవంతంగా హిందీ పేపర్ లాక్కొని వాట్సప్‌లో పోస్టు చేశాడనేది ప్రధాన అభియోగం. పోలీసులు చెప్పిన వివరాలను విశ్లేషిస్తే.. ప్లాన్ ప్రకారం నిందితుల్లో ఒకరైన గుండెబోయిన మహేశ్ స్వయంగా మైనర్ బాలుడితో ప్రశ్నపత్రం ఫొటో తీయించాడు. కానీ, ఆ బాలుడు.. ఆ ఫొటోను మహేశ్‌కు పంపకుండా శివగణేశ్ అనే డ్రైవర్‌కు పంపాడు. శివగణేశ్ ఎస్సెస్సీ 2019-20 అనే వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయగా, ఆ గ్రూపులోని పోతనబోయిన వర్షిత్ అలియాస్ చందు దానిని మహేశ్‌కు పంపాడు. తర్వాత మహేశ్ ఆ ఫొటోను జర్నలిస్టు బూరం ప్రశాంత్‌కు ఫార్వర్డ్ చేశాడు. ప్రశాంత్ నుంచి అది మీడియా ప్రతినిధులకు, బండి సంజయ్‌కి షేర్ అయింది. పరీక్ష 9.30లకు మొదలు

# అర్ధరాత్రి అరెస్ట్



ఈ కేసులో తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఏ-1 నిందితునిగా వరంగల్ పోలీసులు తమ రిమాండ్ రిపోర్ట్‌లో చూపించారు. ఆయనను హన్మకొండ అదాలత్ కోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అర్ధరాత్రి కరీంనగర్‌లోని ఆయన ఇంట్లోనే సంజయ్‌ను అరెస్ట్ చేయడం దగ్గర నుంచి హైడ్రామా చోటు చేసుకుంది.

పేపర్ లీక్ అయిన వరంగల్ జిల్లా కమలాపూర్ ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఐపీసీ 420-4(ఏ), తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసింగ్), ఐటీ యాక్ట్‌ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో బండి సంజయ్‌ను పోలీసులు ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. వరుస లీకులు సంచలనం రేకెత్తిస్తున్న తరుణంలో ఆ అరెస్ట్ కలకలం రేపింది. పేపర్ల లీక్‌పై మరుసటి రోజు ప్రెస్‌మీట్ నిర్వహించాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో పోలీసులు అర్ధరాత్రి కరీంనగర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలని బండి సంజయ్ కోరగా.. ఏ ఇష్యూ లేకపోయినా అదుపులోకి తీసుకునే అధికారం ఉందంటూ పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. తొలుత యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విషయం తెలిసి బీజేపీ శ్రేణులు బొమ్మల రామారం పోలీస్‌స్టేషన్ వైపు తరలివచ్చారు. ఇది గ్రహించిన పోలీసులు బండి సంజయ్‌ని రోజంతా పలు ప్రాంతాల్లో తిప్పారు. బొమ్మల రామారం నుంచి బండి సంజయ్‌ను పోలీసులు మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చారు. సంజయ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎఫ్ఐఆర్‌లో కీలక అంశాలు పొందు పరిచారు. రాష్ట్రంలో జరుగుతున్న పేపర్ లీకేజీల వెనుక బండి సంజయ్ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్‌తో కొంతకాలంగా ఉన్న బీజేపీ నేత.. వాట్సాప్‌లో సమాచారం వైరల్ చేసేందుకు ప్రయత్నించారని పోలీసులు చెప్పారు. ఆ తర్వాత బండి సంజయ్‌ని జఫర్‌గఢ్ దగ్గర పోలీస్ కస్టడీలో ఉంచారు. అక్కడినుంచి మడికొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తీసుకెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత హన్మకొండ జిల్లా

కాగా, మైనర్ బాలుడు పావుగంట తర్వాత అంటే 9.45 లకు ఫోటో తీశాడు. పోలీసులు చెబుతున్నట్టు ముందస్తు ప్లాన్ ప్రకారమే కుట్ర జరిగితే, ఫోటో తీసిన మైనర్ బాలుడు దానిని పంపితే గుండెబోయిన మహేశ్‌కు పంపాలి. లేదంటే డైరెక్టుగా బూరం ప్రశాంత్‌కు పంపాలి. కానీ శివగణేశ్‌కు ఎందుకు పంపాడు? ఆ శివగణేశ్ వాట్సాప్ గ్రూపులో ఎందుకు షేర్ చేశాడు? అనేది అంతుబట్టని విషయం. ఇక, మరో అంశం గమనిస్తే.. మైనర్ బాలుడు 9.45లకు ప్రశ్నపత్రం ఫోటో తీస్తే.. బూరం ప్రశాంత్ దానిని 10.41లకు బండి సంజయ్‌తో పాటు ఈటల రాజేందర్‌కు షేర్ చేశాడు. అలాగే, 10.46 లకు మీడియా వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశాడు. ముందస్తు కుట్ర నిజమే అయితే, మైనర్ బాలుడు ఫోటో తీసిన గంట తర్వాత వరకు ప్రశాంత్ ఎందుకు స్పందించ లేదో పోలీసులు స్పష్టత ఇవ్వలేదు. అంతిమంగా ఇదంతా ముందస్తు కుట్ర ప్రకారమే జరిగిందన్న వాదన తెరపైకి రావడం వెనుక, అది కూడా బండి సంజయ్ మొబైల్‌కు ఈ పేపర్ వాట్సప్‌లో వెళ్లిందని తెలిశాక ఈ వాదనను నొక్కి వక్కాణించడం రాజకీయ ఆసక్తికి నిదర్శనంగా నిలుస్తోంది.

వాస్తవానికి పరీక్షల నిర్వహణలో వ్యవస్థీకృత లోపాలకు అద్దం పడుతోంది ఈ సంఘటన. కమలాపూర్‌లో జరిగిన సంఘటననే చూసుకుంటే..



రఘునందన్ అరెస్టు

ఇక్కడ చెట్టు ఎక్కి మరీ ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న కిటికీ వద్దకు వచ్చిన బాలుడి కంటే, అలా రావడానికి పరిస్థితులు కల్పించిన అధికారులదే బాధ్యత. కిటికీ వద్ద అంత జరిగినా ఆ హాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఇన్విజిలేటర్ గమనించలేదు. పరీక్ష ప్రారంభమైన తొలి అరగంట పాటు ఇన్విజిలేటర్లు పేపర్ వర్క్‌లో నిమగ్నమై ఉంటారు. ఈ సమయంలోనే ఆ బాలుడు ప్రశ్నపత్రం ఫోటో తీసుకొని వెళ్లాడని చెబుతున్నారు. తమ ప్రమేయం లేకున్నా ఈ సంఘటనలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్

# నుంచి...

కోర్టు వెనుక గేటు నుంచి లోపలకు తీసుకెళ్లారు. పోలీసు వలయంలో హన్మకొండ కోర్టు ఉంది. హన్మకొండ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ అనిత రాపోల్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

అదే రోజు సాయంత్రం ఐదు గంటల తర్వాత కేసు దర్యాప్తు వివరాలను వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ మీడియాకు వివరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని, ప్రజలను అయోమయంలో పడేసి పరీక్షల నిర్వహణ వ్యవస్థపై అపనమ్మకం కలిగించాలని బండి సంజయ్ కుట్ర పన్నారని చెప్పారు. పరీక్ష పేపర్ల లీక్‌కు ముందు రోజు ఏ-2 నిందితుడు బూరం ప్రశాంత్.. బండి సంజయ్‌తో చాలా సార్లు వాట్సప్ చాట్, కాల్స్ చేశారని, లభించిన ఆధారాల ఆధారంగా బండి సంజయ్ డైరెక్షన్‌లోనే పేపర్ లీక్ జరిగిందని భావిస్తున్నామన్నారు. ఇదంతా ఒక గేమ్ ప్లాన్‌లా సాగిందన్న సీపీ.. దీని వెనుక కుట్ర ఉందన్నారు. ఏ-2 నిందితుడు బూరం ప్రశాంత్.. బండి సంజయ్‌కు సోషల్ మీడియా అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్నాడని తమ విచారణలో తేలిందన్నారు. వారిద్దరి మధ్య నడిచిన వాట్సప్ చాట్‌ల ప్రకారం కుట్ర పూరితంగానే పేపర్ బయటకు వచ్చేలా చేసినట్లు తేలిందని, అందుకే బండి సంజయ్‌ను ఏ-1 నిందితునిగా చేర్చామని రంగనాథ్ చెప్పారు. సంజయ్ అరెస్ట్ విషయాన్ని లోక్ సభ స్పీకర్ కార్యాలయానికి తెలియజేశామని వివరించారు. సంజయ్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని సోషల్ మీడియాలో ఆరోపణలు వస్తున్నాయని, అయితే చట్ట ప్రకారమే అరెస్ట్ చేశామని రంగనాథ్ మీడియా సమావేశంలో తెలిపారు.

సంజయ్‌ది వ్యూహాత్మక నేరపూరిత కుట్ర అని, రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించాలనే ఓ ముందస్తు ప్రణాళికతో సంజయ్ నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని పోలీసులు తమ రిమాండ్ రిపోర్టులో పేరొన్నారు. వరంగల్ న్యాయస్థానంలో పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్ ప్రకారం... ఐపీసీ 120(బి), 420, 447, 505(1)బీ, మాల్ ప్రాక్టీసెస్ యాక్ట్ 4 4(ఏ), ఐటీ యాక్ట్‌ల కింద మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసారు. వీరిలో ఒకరు మైనర్ బాలుడు. నలుగురిని అరెస్ట్ చేశారు. కమలాపూర్ పరీక్ష కేంద్రం నుంచి పేపర్‌ను ఫోన్‌లో ఫోటో తీసి, ఆ తర్వాత సోషల్ మీడియాలో వైరల్ చేయడం ద్వారా తెలంగాణలో గందరగోళ పరిస్థితులు, శాంతిభద్రతల సమస్య సృష్టించాలనే, ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్ర దీని వెనుక దాగి ఉందని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు ఆరోపించారు. పేపర్‌ను ఫోటో తీసుకున్నాక ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బండి సంజయ్ సహా పలువురు బీజేపీ నాయకులకు, జర్నలిస్టులకు ఫార్వర్డ్ చేసారని రిపోర్ట్‌లో తెలిపారు.


సంజయ్ అరెస్ట్‌పై బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ వద్ద బీజేపీ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావ్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాజా సింగ్‌లను అరెస్ట్ చేశారు. పార్లమెంట్ ఆవరణలో బీజేపీ ఎంపీలు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కొంతకాలంగా తెలంగాణలో లీకేజీలు, ప్యాకేజీల వ్యవహారం నడుస్తోందని, ఈ వ్యవహారాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బండి సంజయ్‌ను అరెస్ట్ చేశారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సంజయ్ అరెస్ట్‌పై పార్లమెంట్ హక్కుల కమిటీకి ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపూరావు ఫిర్యాదు చేశారు. ★

సస్పెండయ్యారు. ఇన్విజిలేటర్ ఉద్యోగం నుంచే డిస్మిస్ అయ్యారు. ఎస్సెస్సీ పరీక్షలు మొదటి నుంచీ అనేక లోటుపాట్ల మధ్యనే జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద సరిపడా పోలీసు సిబ్బంది ఉండరు. సీసీ కెమెరాలు ఉండవు. తప్పిదాలపై తక్షణ చర్యలు ఉండవు. వీటిని సరిదిద్దకుండా అప్పటికప్పుడు ఏదైనా జరిగితే దానినే హైలైట్ చేస్తూ నిర్ణయాలు తీసుకోవడం, చర్యలకు ఉపక్రమించడం పొరపాటే అవుతుందని చెప్పొచ్చు. మైనర్ బాలుడు కిటికీ వద్దకు వచ్చి ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసుకొని వాట్సాప్‌లో పోస్టు చేయడానికి కారణం ఏమిటనేది ఇంతవరకు ఎవరూ తేల్చలేదు. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందని అధికార పార్టీ నేతలు, పోలీసులు చెబుతుండగా ప్రైవేటు విద్యాసంస్థల కొమ్ముకాసే దళారుల ప్లాన్ మిస్‌ఫైర్ అయిందని ఇతర వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు.. తనను చంపుతానని బెదిరించి ప్రశ్న పత్రం లాక్కున్నాడని బాధిత విద్యార్థి దండబోయిన హరీశ్ చెబుతున్న కథనం కూడా నమ్మశక్యంగా లేదు. నిజంగానే చంపుతానని బెదిరించి ఉంటే సంఘటన జరిగిన తర్వాతనైనా తరగతి గదిలోనే ఉన్న ఇన్విజిలేటర్‌కు ఎందుకు చెప్పలేదో అర్థం కావడం లేదు. పేపర్ లీకేజీ విషయాన్ని పూర్తి రాజకీయం చేయడంలో అధికార బీఆర్ఎస్ సక్సెస్ అయ్యిందన్న చర్చ బయట జోరుగా జరుగుతోంది. అంతిమంగా అవి విద్యార్థులను గందరగోళంలోకి నెట్టాయి. అసలు విషయం– టెన్త్ పరీక్షలు అంటేనే ఓ ప్రహసనం అయిపోయాయి. చాలా కేంద్రాల్లో 20 మార్కుల బిట్ ప్రశ్నలకు కొందరు ఇన్విజిలేటర్లే సమాధానాలు చెప్పేస్తుంటారని, వీళ్లంతా దళారులని, ప్రైవేటు విద్యాసంస్థలకు శాశ్వత ప్రతినిధులుగా ఉంటూ వాటితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటారని, ఇందుకు ముడుపులు పుచ్చుకుంటారని ఆరోపణలు ఉన్నాయి.



పోలీసులతో ఈటల వాగ్యుద్ధం

ఇక, బండి సంజయ్‌పై కుట్ర కేసు అంశానికి వస్తే.. హైకోర్టు పలు సందేహాలు వెలిబుచ్చింది. లీకేజీ కేసులో అరెస్ట్ అయిన సంజయ్ రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలైన సమయంలో కరీంనగర్ నుంచి వరంగల్‌కు బండి సంజయ్‌ను తీసుకెళ్లేందుకు 300 కిలోమీటర్లు తిప్పారని ఆయన తరపు న్యాయవాది రామచందర్‌రావు కోర్టుకు తెలిపారు.




బండి సంజయ్‌పై ఉన్న ఆరోపణలు ఏంటని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పేపర్ బయటకు వచ్చాక వాట్సాప్‌లో సర్క్యులేట్ చేశాడే తప్ప, లీకేజీలో ఆయన ప్రమేయం ఎక్కడుందని ప్రశ్నించింది. క్వశ్చన్ పేపర్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చిన తర్వాత అది లీకేజ్ ఎలా అవుతుందని ప్రశ్నించింది. పేపర్ బయటకు వచ్చాక ప్రతిపక్ష నేతగా ఈ అంశాన్ని ఎలా అయినా వాడుకోవచ్చని వ్యాఖ్యానించింది. ఈ పరిణామం బండి సంజయ్‌ని కావాలనే నిందితుల జాబితాలో ఏ–వన్‌గా చేర్చారని అర్థమవుతోంది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే తెలంగాణలో అధికార పార్టీ సైకలాజికల్ రాజకీయాలు చేస్తున్నట్లు స్ఫురిస్తోంది. ఈ పరిస్థితులే విద్యార్థులు, యువకులను మానసికంగా ఆందోళనలకు గురి చేస్తున్నాయి.

టెన్త్‌పేపర్ లీకేజీ కుట్రపూరితంగా జరిగిందని బీఆర్ఎస్ కూడా ఆరోపిస్తోంది. అయితే, పోలీసులు బండి సంజయ్‌పై కుట్ర కేసు నమోదు చేయడం వెనుక బీఆర్ఎస్ పార్టీ కుట్ర ఉందని ఈ పార్టీ నేతలు చెబుతున్నారు. కుట్ర పన్ని మరీ.. టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసులో, ఎస్సెస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బండి సంజయ్‌ని ఇరికిస్తున్నారని అంటున్నారు. దీంతో జాతీయ నాయకత్వం సైతం రంగంలోకి దిగింది. ఎన్నికల వేళ బీఆర్ఎస్ చేస్తున్న కవ్వింపు చర్యలను ఎలా ఎదుర్కోవాలి.. అధికార పార్టీపై ఎలా ప్రతీకారం తీర్చుకోవాలి అన్న ఆలోచనలో కమలనాథులు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో తెలంగాణ ముఖ్యమంత్రి కూతురు కవిత పీకల్లోతు వరకు కూరుకుపోయింది. ఇప్పటికే మూడుసార్లు ఈడీ విచారణ ఎదుర్కొంది. ఈడీ అడిగిన ఫోన్లలో కొన్ని అప్పగించింది. ఈ ఫోన్లను ఓపెన్ చేసిన ఈడీ కీలక

# అవినీతిపరులని శిక్షించాలా, వద్దా?



సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 8న ప్రధాని మోదీ ప్రారంభిస్తున్నప్పటి చిత్రం

ప్రధాని నరేంద్రమోదీ ఏప్రిల్ 8న హైదరాబాద్ పర్యటించారు. ఈ సందర్భంగా పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ పాలనపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఎక్కడా కేసీఆర్ పేరెత్తకుండా, బీఆర్ఎస్ పార్టీ ప్రస్తావన లేకుండానే మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, సభకు హాజరైన జనంతోనే అవినీతిపరులను వదిలేద్దామా? అని అడిగి మరీ వదిలేయొద్దని చెప్పించారు.

గతంలో మోదీ ఎప్పుడు రాష్ట్రానికి వచ్చినా అదే రోజు లేదంటే మరుసటిరోజు ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శలు చేసే కేసీఆర్ ఈసారి మాత్రం నిశ్శబ్దంగా ఉన్నారు. ఒక్క మాట కూడా మాట్లాడ లేదు. కనీసం ప్రెస్‌నోట్ కూడా విడుదల చేయలేదు. కేవలం మంత్రులతో విమర్శలు చేయించి సరిపెట్టు కున్నారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లోనే కాదు, సొంత పార్టీ నాయకులనూ విస్మయానికి గురిచేస్తోంది. మోదీ విమర్శలపై కేసీఆర్ ఎదురుదాడి ఏమైందని చర్చించుకుంటున్నారు. ఈ పరిణామం కేసీఆర్ సహజత్వానికి భిన్నంగా ఉందంటున్నారు. మరి.. ఈ మౌనం వెనుక మతలబు ఏమిటో? అని రాజకీయ నిపుణులు గుసగుసలాడు కుంటున్నారు. అయితే, బీజేపీ మాత్రం మోదీ మాట్లాడిన మాటలన్నీ నిజం కాబట్టే కేసీఆర్ నుంచి స్పందన లేదని చెప్పుకుంటోంది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి.. రాష్ట్రంలోని కేసీఆర్ సర్కార్‌కు మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారిన తర్వాత కేసీఆర్ అస్సలు ఆగలేదు. ప్రెస్‌మీట్ పెట్టినా.. బహిరంగ సభలు పెట్టిన మోదీ సర్కార్‌ను కడిగిపారేసేవారు. అయితే తెలంగాణలో గత కొన్ని రోజులుగా పెను ప్రకంపనలు రేపే ఘటనలు జరిగాయి. ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత ఆరోపణలు ఎదుర్కోవడం, ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరుకావడం ఇదంతా గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పెద్ద రచ్చే అయ్యింది. ఇక తెలంగాణలో జరిగిన టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారం.. దీనిపై ప్రతిపక్షాల ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకిం చాయి. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో మంత్రి కేటీఆర్‌కు సంబంధం ఉందని ఆరోపించిన వారందరికీ నోటీసులు ఇవ్వడం, ఆఖరికి పరువు నష్టం దావా వేయడం కూడా పెద్ద సంచలనమే. అంతేకాదు ఇంకో అడుగు ముందుకేసి టెన్త్ పేపర్ లీకేజీలో పాత్ర ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం రచ్చ రచ్చే అయ్యింది. స్వరాష్ట్రంలో ఇంత జరిగినా, సర్కార్‌పై పెద్ద మచ్చ పడినా ఇంతవరకూ కేసీఆర్ అస్సలు స్పందించనే లేదు. ఇవన్నీ అటుంచితే.. కేసీఆర్ అడ్డాకే వచ్చిన మోదీ పరోక్షంగా ఆయనపై ధ్వజమెత్తారు. అవినీతిపరులు జైలుకేనంటూ సంకేతాలు కూడా ఇచ్చేశారు.

ప్రధాని హైదరాబాద్‌లో అడుగుపెట్టింది మొదలు తిరుగుపయనం దాకా ప్రతిచోటా బీజేపీ రాష్ట్ర పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించిందనే చెప్పాలి. కేసీఆర్ అసలు తత్వాన్ని ప్రజల ముందుంచాలని ఆ పార్టీ శ్రేణులు తీవ్రంగా ప్రయత్నించాయి. అదెలాగంటే.. మోదీని స్వాగతించడానికి సీఎం కేసీఆర్ రారని తెలిసినప్పటికీ.. ఆయన వస్తారని శాలువా తీసుకురావడం, సీఎంను సన్మానించాలని అనుకోవడం.. ఇవన్నీ ఒక ఎత్తయితే పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన సభలో మోదీ సీటు పక్కనే కేసీఆర్ కోసం ప్రత్యేకంగా కుర్చీ వేయడం.. ఇవన్నీ జనాల్లోకి తీసుకెళ్లి కేంద్రం అంటే పడకపోవచ్చు కానీ, కనీసం అభివృద్ధి పనులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావట్లేదనే భావన ప్రజల్లో కలిగించడంలో బీజేపీ సఫలమైందనే చెప్పాలి.

---

సమాచారం రాబట్టింది. ఈ క్రమంలో కవిత అరెస్ట్ ఖాయం అన్న వార్తలు వస్తున్నాయి. దీంతో బీజేపీపై ప్రతీకారం తీర్చుకునే క్రమంలో గులాబీ బాస్ కేసీఆర్ కుట్రకు తెరతీశారని బీజేపీ నాయకులు భావిస్తు న్నారు. ఇందులో భాగంగానే బండి సంజయ్‌తోపాటు జాతీయ నాయకులను కూడా ఇందులోకి లాగే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో కల్వకుంట్ల కుటుంబంపైనే ఎక్కువగా విమర్శలు వస్తున్నాయి. ఇందులో మంత్రి కేటీఆర్ ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కవిత పాత్రపై కూడా అనుమానాలు వస్తున్నాయి. గతంలో సింగరేణి ఉద్యోగాల భర్తీ విషయంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఒకే సెంటర్‌లో 23 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఇందులో బీఆర్ఎస్ నాయకురాలు కవితపైనే ఆరోపణలు వచ్చాయి. ఇక టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారం మొత్తం కేటీఆర్ చుట్టూ తిరుగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులు బండి సంజయ్, రేవంత్‌రెడ్డి, బీఎస్పీ చీఫ్ ప్రవీణ్‌కుమార్ లీకేజీలో కేటీఆర్ పాత్రను ప్రజల ముందు పెడుతున్నారు. విపక్షాల ఆరోపణలకు బలం చేకూర్చేలా ఈ విచారణను త్వరగా పూర్తి చేయించేలా కేటీఆర్ వ్యవహరిస్తున్నారు. విపక్ష నేతలకు నోటీసులు ఇచ్చేలా సిట్‌పై వత్తిడి చేస్తున్నారు. దీంతో అనుమానాలు బలపడుతున్నాయి. మొత్తంగా ఈ వ్యవహారంలో కల్వకుంట్ల కుటుంబం వైపే అన్ని వేళ్లూ చూపిస్తున్నాయి. దీనిని మరిపించేందుకు బీజేపీని బద్నాం చేసేందుకు, తెలంగాణలో ఆ పార్టీని బలహీన పర్చేందుకు బీఆర్ఎస్ ఎత్తుగడ వేసిందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం తరహాలో ఈ కేసులోకి బీజేపీ జాతీయ నాయకులను సైతం ఇరికించేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఛేదించడంతోపాటు ఆ పార్టీని దెబ్బకొట్టేలా బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీ లిక్కర్ స్కాంతోపాటు టీఎస్‌పీఎస్సీ లీకేజీ పై ఈడీని రంగంలోకి దించాలని చూస్తోంది. అవసరమైతే టెన్త్ పేపర్ వ్యవహారంలో కూడా జోక్యం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ



న్యాయవాది రామచంద్రరావును (మాజీ ఎంఎల్సీ) అడ్డగించిన పోలీసులు


అనుకున్నట్లు జరిగితే.. బీజేపీ కొట్టే దెబ్బకు ఇక బీఆర్ఎస్ కోలుకునే అవకాశం ఉండదని ఆ పార్టీ నాయకులే అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు.. సంజయ్‌కి మరుసటిరోజు న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. జడ్జి ఆదేశాల మేరకు ఆ మరుసటిరోజు కరీంనగర్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. అయితే, జైలునుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా సంజయ్ ఏమాత్రం తగ్గలేదు. జైలు ముందే సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. బండి సంజయ్ అరెస్ట్ తర్వాత బీజేపీ హైకమాండ్ చేసిన ప్రకటనలు.. స్పందించిన విధానం చూస్తే.. ఈ అంశంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని అనుకోవచ్చు. నిజానికి ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉప్పు, నిప్పులా పరిస్థితి ఉంది. ఇంకా చెప్పాలంటే బీఆర్ఎస్ పార్టీ జుట్టు బీజేపీ చేతుల్లో ఉంది. అయినా బీఆర్ఎస్ రిస్క్ తీసుకుంది. బండి సంజయ్ విషయంలో దూకుడుగా వ్యవహరించింది. అది బీజేపీని రెచ్చగొట్టడమా? లేకపోతే వ్యూహాత్మక తప్పిదమా? అన్నది ముందు ముందు తెలుస్తుంది.

కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రస్తుతం ఢిల్లీ లిక్కర్ స్కాంపై దర్యాప్తు చేస్తున్నాయి. కొద్ది రోజులుగా సైలెంట్ అయ్యారు కానీ.. కల్వకుంట్ల కవిత ఇచ్చిన పది ఫోన్లను విశ్లేషిస్తున్నట్లుగా తెలుస్తోంది. మళ్లీ నోటీసులు ఇస్తారా లేదా అన్నది స్పష్టత లేదు. కానీ అరెస్ట్ మాత్రం చేయలేదు. అరెస్ట్ వరకూ వచ్చిందని అందరూ అనుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక వ్యక్తులంతా అరెస్టయ్యారు. వారికి బెయిల్ దక్కడం కూడా గగనంగా మారింది. అత్యంత కీలక వ్యక్తిగా ఈడీ, సీబీఐ న్యాయస్థానాలకూ చెబుతూ వస్తున్న కవితను మాత్రం అరెస్టు చేయలేదు. ఆ రెండు దర్యాప్తు సంస్థలు అనుకుంటే ఎప్పుడైనా అరెస్ట్ చేయవచ్చన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. అదే సమయంలో ఫామ్ హౌస్ కేసు కూడా సీబీఐ చేతిలో ఉంది. ప్రస్తుతం సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు కానీ తదుపరి దర్యాప్తు చేయవద్దని చెప్పింది. ఇవాళ కాకపోతే రేపైనా ఆ కేసు సీబీఐ చేతుల్లోకి వెళ్తుంది. ఆ కేసులో సాక్ష్యాలు బయట పెట్టిన సీఎం కేసీఆర్‌కూ ఇబ్బందులు తప్పవని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేశారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు జైలు సిద్ధం చేశామని సంజయ్ గతంలో ప్రకటించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సంజయ్ కేటీఆర్ ప్రస్తావన తెచ్చి, ఆయనకు కూడా జైలు సిద్ధం చేస్తామన్నారు. కేటీఆర్‌కు సంబంధించి వారి వద్ద ఏమైనా సమాచారం ఉందేమోనన్న అనుమానాలు ఈ ప్రకటనతో ప్రారంభమయ్యాయి. బీజేపీ అగ్రనాయకత్వ ప్రతీకారం తీర్చుకోవాలంటే.. వెంటనే ఏమీ చేసేయదని.. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని... ఆ పార్టీ వ్యూహాలపై అవగాహన ఉన్నవారు చెబుతున్నారు. కారణం ఏదైనా సంజయ్ అరెస్ట్ వ్యవహారానికి ఇది సమయం కాదన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్‌లో వినిపిస్తోంది. అయితే అన్నీ ఆలోచించే బీఆర్ఎస్ చీఫ్ వ్యూహాలు అమలు చేస్తున్నారని.. బీజేపీయే ట్రాప్‌లో పడుతోందని.. త్వరలోనే అసలు విషయం వెలుగులోకి వస్తుందని దింపుడు కళ్లం ఆశతో ఉన్నవారు ఇంకొందరు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ కొన్ని గంటల పరిణామాలు బీజేపీ, బీఆర్ఎస్ మధ్య యుద్ధం మొదలైందన్న అభిప్రాయం ఉంది. మోదీని ఢీకొట్టడం అంత సులభం కాదని చాలా ప్రాంతీయ పార్టీలు అర్థం చేసుకున్నా, కేసీఆర్ ఆ వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరనే అనిపిస్తుంది. అదానీ వ్యవహారం, ప్రధాని చదువు, డిగ్రీ రగడ పలచబడిపోతున్న సమయంలో మళ్లీ మోదీదే పైచేయి అని రాజకీయ వర్గాలు భావిస్తున్న తరుణంలో ప్రధానిని బండి సంజయ్ అరెస్టు ద్వారా కంగుతినిపించి, తనను తాను మోదీని ఢీకొట్టిన వీరునిగా ప్రతిపక్ష శిబిరంలో ఆవిష్కరింప చేసుకోవడానికి కేసీఆర్ ఇలాంటి ఎత్తును నమ్ముకుని ఉండవచ్చు. ఎన్ని ఎత్తులు వేసినా కేవలం 17 లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రం, ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ రాష్ట్ర నేతలు దేశ రాజకీయాలను మార్చేసి, నరేంద్ర మోదీ వంటి నాయకుడిని వెనుక వరసలో కూర్చోబెట్టి, బీజేపీని ప్రతిపక్ష స్థానానికి పరిమితం చేయగలమని అనుకుంటే అది అత్యాశే.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



రామానుజ కల్యాణ్

అక్షయం అంటే క్షయం లేనిది (ఎన్నటికి నశించనిది లేదా స్థిరంగా ఉండేది) అని అర్థం. వైశాఖ శుద్ధ తదియ 'అక్షయ తృతీయ'గా ప్రసిద్ధమైంది. ఇది విశేష శుభ ఫలితాలను ఇస్తుందని, నిండు మనసుతో చేపట్టే కార్యాలు అక్షయం కావాలన్నదే దీని పరమార్థంగా చెబుతారు. అమిత ఫలదాయినిగా చెప్పే ఈ వ్రతానికి లక్ష్మీనాథుడు అధినాయకుడు కాగా ఆ రోజు చేసే దానధర్మాలు, పూజాపునస్కారాలు అనంత శుభాలను అందిస్తాయని వేదోక్తి.



# అమిత ఫలదాయిని అక్షయ తృతీయ...

ఈ రోజున చేసే యజ్ఞయాగాది క్రతువులు, పూజాదికాలు, దానధర్మాలు, పితృతర్పణాలు విశేష ఫలితాలనిస్తాయని మహేశ్వరుడు పార్వతీదేవికి చెప్పినట్లు మత్స్య పురాణం, ఆ రోజు చేసే దానధర్మాలు అత్యధిక ఫలితాలను ఇస్తాయని నారద పురాణం పేర్కొంటున్నాయి. ఆనాటి పుణ్యకార్యాల ఫలం అక్షయంగా ఉంటుంది కనుక 'అక్షయ తృతీయ'గా వ్యవహారంలోకి వచ్చిందని శ్రీకృష్ణ భగవానుడు ధర్మజునికి చెప్పినట్లు పురాణవాక్కు.

శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవిని పరిణయమాడిన రోజు కూడా ఇదేనట. అందుకే ప్రజలు తమతమ స్థోమతను బట్టి బంగారం లేదా వెండి కొనుగోలు చేసి అమ్మవారికి అలంకరించి పూజలు చేస్తారు. భూముల కొనుగోళ్లు, భవనాలు, సంస్థలను వంటి వాటిని ప్రారంభించడం శుభప్రదంగా భావిస్తారు.

ఈ తిథినాడు చేపట్టే పుణ్యకార్యాలకు సంబంధించి ప్రచారంలో ఉన్న కథ ప్రకారం, పేదరికంలో ఉన్న ధర్మనాముడు అనే వైశ్యుడు తనకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేసేవాడు. కొంతకాలానికి కాలం చేసిన ఆయన క్షత్రియుడిగా జన్మించి జపహోమాదులు, నిత్యాన్నదానం చేయసాగాడు. సంపదను వ్యయం చేసిన కొద్దీ అది 'అక్షయం' అవుతోంది. పూర్వజన్మ సంస్కారంతో అలా కొనసాగుతూనే ఉంటుందని పెద్దలు చెబుతారు.

**'అక్షయ' వేడుకలు**

ఈ తిథికి ప్రతి యుగంలో విశిష్టత ఉంది. కృతయుగంలో ప్రహ్లాద వరదుడు శ్రీహరి వరహా నృసింహస్వామి రూపంలో పురూరవ చక్రవర్తికి స్వప్న సాక్షాత్కారం చేసి, ఏటా చందనయాత్ర జరిపించు కుంటున్నది, త్రేతాయుగం ఆరంభం, భగీరథుడు దివిజ గంగను భువికి దింపినది, ద్రౌపదీ మానసంరక్షణకు శ్రీకృష్ణుడు వలువలు ప్రదానం చేసినది, పిడికెడు అటుకుల స్వీకరణతో బాల్య స్నేహితుడు కుచేలుడికి అనంత ఐశ్వర్యం అనుగ్రహించినది, వనవాస దీక్షలోని పాండవులకు సూర్యభగవానుడు అక్షయ పాత్రను ప్రసాదించినది ఈ రోజునే. చార్‌ధామ్ (బదరీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి)ల ఆలయాలను చలికాలం తరువాత ఈ తిథినాడే తిరిగి తెరుస్తారు. హృషీకేశ్ లోని భరత మందిర్‌లో యాత్రికులు 108 సార్లు ప్రదక్షిణలు చేస్తారు. పూరీ జగన్నాథస్వామి రథ నిర్మాణానికి ఈ రోజే అంకురార్పణ చేస్తారు. 41 రోజులు పాటు కనువిందు చేసే చందనోత్సవం ఆరంభమవుతుంది. దేశంలోని కొన్ని ప్రాంతాలలో శ్రీకృష్ణునికి చందన లేపనం, గౌరీదేవికి డోలోత్సవం జరుపుతారు. ద్వైత సంప్రదాయవాదులు (మధ్వులు), ఈ తిథినాడు యతుల బృందావనాలకు గంధలేపనం చేస్తారు.

**సామాజిక పర్వదినం**

కులమతాలకు అతీతంగా దీనిని జరుపు కుంటారు. దేశంలోని అనేక ప్రాంతాలలో పెళ్లికాని యువతులతో బొమ్మల పెళ్లిళ్లు నిర్వహించే సంప్రదాయం ఉంది. దీనివల్ల యోగ్యుడు భర్తగా లభిస్తాడని విశ్వాసం. ఈ వ్రతాన్ని ఆచరించే వారు ఉప్పు రహితంగా, చక్కెర కలిపిన పేలపిండిని స్వీకరిస్తారు.

ఈ పండుగ పరోపకారానికి ప్రతీకగా నిలుస్తోంది. ఎండలు ముదిరే వైశాఖంలో (ఈ నెలలో) బాటసారుల దప్పిక తీర్చే పుణ్యకార్యం అక్షయ తృతీయ నాడే ప్రారంభించడం ఆనవాయితీ. వైశాఖ మాసంలో నీటితో నిండిన కుండ, గొడుగు, విసన్నకర్ర, పాదరక్షలు దానంగా ఇచ్చేవారు.

ఈ రోజున ఉపవాసంతో లక్ష్మీనారాయణులను, గౌరీ మహేశ్వరులను అర్చించి అక్షతలతో హోమం, అక్షతల దానంతో సకల పాపవిముక్తులవుతారని, చేసిన దానం అక్షయంగా మారి సత్ఫలితాలనిస్తుందని శాస్త్రవచనం.

దేశవ్యాప్తంగా వివిధ ఆలయాలలో ఈ తిథినాటి విశేషాలు, వేడుకలను గుర్తు చేసుకుంటే... బృందావనంలోని బన్‌కె బిహారి ఆలయంలో కృష్ణ స్వామి ఏడాది పొడవున నిండైన అలంకరణతో ఉంటూ ఈ తిథినాటి సాయంత్రం కౌపీనంతో దర్శనమిస్తాడు.

తమిళనాడులోని తంజావూరు సమీపంలో నిలంకులన్ గ్రామంలో శివుడు 'అక్షయ పురీశ్వరుడు'గా పూజలు అందుకుంటున్నాడు. కాలు నొప్పితో బాధపడుతున్న శనీశ్వరుడు తిరుగుతూ తిరుగుతూ ఆ ప్రాంతంలోని బిల్వవృక్షం వద్ద కుప్పకూలిపోగా శివుడు ప్రత్యక్షమై ఆరోగ్యాన్ని అనుగ్రహించాడట. ఈ సంఘటన అక్షయ తృతీయ నాడే చోటు చేసుకోవడం వల్ల ఆనాడు అక్కడ పెద్ద ఎత్తున ఉత్సవం జరుపుకుంటారు. ★



# ఎవరి కు

**మరో గోద్రా సబర్మతి రైలు ఘటన కొద్దిలో తప్పింది.. కానీ ఎన్నో ప్రశ్నలను మిగిల్చింది. ఇది ఒక వ్యక్తి చేసిన పని కాదు...కచ్చితంగా కాదు. ఎక్కడ కోజికోడ్? ఎక్కడ షాహీన్‌బాగ్? ఢిల్లీ నుంచి కేరళ వచ్చే రైలులో పెట్రోల్ దాడికి పాల్పడవలసిన అవసరం అతనికేమిటి? లోతుగా విచారిస్తేనే అసలు వాస్తవాలు బయటకు వస్తాయి. కేరళ పోలీసులతో పాటు ఏటీఎస్, ఎన్ఐఏ ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నాయి.**

ఏప్రిల్ 2వ తేదీ.. ఆదివారం రాత్రి 9.45 గంటల సమయం. కేరళలోని అలప్పుజ నుంచి కన్నూర్ బయలుదేరిన ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలు కోజికోడ్ నగరాన్ని దాటింది. మరికొద్ది సేపట్లో గమ్యస్థానాన్ని చేరాల్సింది. అంతలోనే డీ-1 కోచ్‌లో కలకలం మొదలైంది. రైలు కోరపుళ రైల్వే వంతెన వద్దకు చేరుకోగానే ఎర్రచొక్కా, జీన్స్ ధరించిన వ్యక్తి తోటి ప్రయాణికురాలిపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. ఒక్కసారిగా ప్రయాణికులు భయపడి పోయారు. చూస్తున్నంతలోనే మంటలు ఇతరులకు అంటుకున్నాయి. 8 మంది గాయపడ్డారు. అంటుకున్న మంటలను ఆర్పివేశారు. అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే ఎమర్జెన్సీ చైన్ లాగి రైలును నిలిపివేశారు. వంతెనపై రైలు ఆగిపోయింది. ఈ హడావిడిలో అతడు పారిపోయాడు.

డీ-1తో పాటు డీ-2 కోచ్‌లో కూడా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. గాయపడిన ప్రయాణికులను ఆసుపత్రికి తరలించారు. రైలులోని ముగ్గురు ప్రయాణికులు కన్పించలేదు. ముప్పు నుంచి తప్పించుకునే క్రమంలో కొందరు ప్రయాణికులు హడావిడిగా రైలు నుంచి దూకారని తేలింది. అదే ప్రాణాపాయంగా మారింది. ఘటన జరిగిన ప్రాంతం నుంచి సుమారు 100 మీటర్ల దూరంలోని రైల్వే ట్రాక్‌పై వారి మృతదేహాలు పోలీసులకు కన్పించాయి. వీరిని సహరమత్, ఆమె అత్త ఎం రెహ్మత్, చేపల వ్యాపారి నౌఫీక్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారని తేలింది. ఈ ఘటనతో వీరికి ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి.



సైఫీ

**ఉగ్ర కుట్రకు ఆధారాలు**

అలప్పుజ-కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన ఈ తతంగం చూడగానే పక్కా ప్రణాళికతో జరిగిన కుట్ర అని అర్థమైపోతుంది. దీని వెనుక కచ్చితంగా ఉగ్రవాదులు ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటన జరిగిన డీ-1 కోచ్‌లో ఆధారాల కోసం గాలిస్తుండగా ఒక అనుమానాస్పద బ్యాగ్ కనిపించింది. అందులో మరో పెట్రోల్ బాటిల్, రెండు మొబైల్ ఫోన్లు, డైరీ, లంచ్ బాక్స్, జత బట్టలను స్వాధీనం చేసుకున్నారు. రైలు వంతెన మీద ఆగిపోగానే నిందితుడు కిందకు దూకి పారిపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అప్పటికే ఓ వ్యక్తి అతని కోసం బైక్‌పై అక్కడ ఎదురు చూడటం తాము గమనించామని పేర్కొన్నారు. ఈ హడావిడిలో బ్యాగులను వదిలేశాడని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెట్రోల్ దాడికి ముందు నిందితుడు కావాలనే తోటి ప్రయాణికురాలితో వాగ్వాదానికి దిగినట్లు వారు చెప్పడం గమనార్హం. రైలు ఎక్కే సమయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. సీటు విషయంలో మహిళతో వ్యక్తి గొడవ పడ్డాడు. అయితే బోగీలోని కొందరు ప్రయాణికులు మహిళకు మద్దతుగా నిలిచారు. దీంతో అతను వెంటనే పెట్రోలు చల్లి దారుణానికి పాల్పడ్డాడు. దీంతో ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా? అని పోలీసులు అనుమానించారు. సాక్షులు అందించిన వివరాల ఆధారంగా వారు నిందితుడి స్కెచ్‌ను విడుదల చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు, దర్యాప్తునకు ఆదేశించారు.

**రత్నగిరిలో దొరికిపోయాడు**

కోజికోడ్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో దొరికిన ప్రాథమిక సాక్ష్యాధారాలతోనే నిందితుని సమాచారం సులభంగా తెలిసిపోయింది. బ్యాగులో ఉన్న డైరీని పోలీసులు పరిశీలిస్తే నిందితుడు కేరళకు చెందిన వ్యక్తి కాదని గుర్తించారు. అందులో ఢిల్లీ, మొరాదాబాద్, బులంద్‌షహర్ చిరునామాలు కనిపించాయి. మొబైల్ నెంబర్ల ఆధారంగా ఫారూఖ్ సైఫీ (27) అని తేలింది. దీంతో కేరళ పోలీసులు ఎన్ఐఏతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసులను కూడా అప్రమత్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో సైఫీ పేరున్న కొందరు వ్యక్తులను కూడా విచారించి చూశారు. రికవరీ చేసుకున్న ఫోన్‌లో సిమ్ లేకపోయినా, దాని ఐఈఎంఈ నెంబర్ ఆధారంగా, ఢిల్లీలోని షాహీన్ బాగ్ చిరునామా దొరికింది. కేరళ పోలీసులు అక్కడికి వెళ్లి ఆ కుటుంబాన్ని పట్టుకున్నారు. తమ కుమారుడు కనిపించడం లేదని, మార్చి 31న ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

సైఫీకి చెందిన ఆరు ఫోన్లపై నిఘా పెట్టగా, అందులో ఒకటి మహారాష్ట్రలోని రత్నగిరి ప్రాంతంలో స్విచ్ ఆన్ చేసినట్లు గుర్తించారు. లొకేషన్ ఆధారంగా మహారాష్ట్ర పోలీసు బృందం రత్నగిరి ఆసుపత్రికి వెళ్లింది. ఓ వ్యక్తి కాలిన గాయాలతో వచ్చాడని, ప్రాథమిక చికిత్స తర్వాత కనిపించకుండా పోయాడని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ఆ ప్రాంతమంతా వెతికితే రైల్వే స్టేషన్‌లో సైఫీ దొరికాడు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ బృందం, మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) సంయుక్తంగా జరిపిన గాలింపులో నిందితుడు ఏప్రిల్ 5న పట్టుబడ్డాడు. రైలు నుండి కిందికి దూకడంతో అతని నుదిటిపై గాయా



# ట్ర ఇది?

లయ్యాయి. స్వల్పంగా కాలిన గాయాలు కూడా కనిపించాయి. సైఫీని రత్నగిరి ప్రభుత్వాస్పత్రిలో చేర్చి ప్రాథమిక ధ్రువీకరణ తర్వాత కేరళ పోలీసులకు అప్పగించారు..

**సైఫీ వెనుక ఉన్నదెవరు?**

షారూక్ సైఫీ రత్నగిరి రావడంపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. అతను రత్నగిరికి ఎలా వచ్చాడో వెల్లడించడం లేదని దర్యాప్తు అధికారులు తెలిపారు. రత్నగిరి నుంచి కేరళలోని కోజికోడ్‌కు తీసుకొచ్చారు. షారుఖ్ సైఫీపై హత్యానేరం (ఐపీసీ సెక్షన్ 302) విధించారు. ఏప్రిల్ 28 వరకు జ్యుడిషియల్ కస్టడీకి రిమాండ్ విధించారు.

అతడిని విచారించిన తర్వాతే చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఏపీఏ) మోపవచ్చని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. రైల్వే పోలీసులు దాఖలు చేసిన కేసులో సైఫీపై హత్యానేరం మోపారు. నిందితుడు మానసికంగా దృఢంగా ఉన్నాడని, విచారణ సమయంలో పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు ఇచ్చాడని తెలుస్తోంది. సైఫీ స్వయంగా (ఎలోన్ ఉల్ఫ్) ఈ నేరాన్ని చేశాడా? ఈయన వెనుక ఉగ్రవాద సంస్థ ఏదైనా ఉందా అన్నది స్పష్టం కాలేదు. మొదట తన వెనుక ఎవరో ఉండి చేయించారని చెప్పినా, తర్వాత మాట మార్చి సొంతంగా చేసినట్లు వెల్లడించాడు. నేరం తన మీదే వేసుకునేలా ఎవరైనా వత్తిడి తెచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. సైఫీ చేస్తున్న నేరాన్ని పర్య వేక్షిస్తూ, ఎవరైనా సహకరించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు.

**స్థానికుల సాయం...**

కుట్రను అమలు చేసేందుకు కేరళకు వచ్చిన షారూక్ సైఫీ షోర్నూర్ (పాలక్కాడ్)లోని బంకులో రెండు బాటిళ్లలో నాలుగు లీటర్ల పెట్రోల్‌ను కొనుగోలు చేశాడని గుర్తించారు. అనుమానం రాకుండా ఉండేందుకు స్టేషన్‌కు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న పెట్రోల్‌ను కొనుగోలు చేసేందుకు ఆటో రిక్షాపై వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజీలో తేలింది. ఏప్రిల్ 2న దాడి జరిగిన రోజు ఉదయం షోర్నూర్‌కు వచ్చి అక్కడ 12 గంటలకుపైగా గడిపాడు. అతను రైలులో వదిలేసిన బ్యాటులో తాజాగా వండిన భోజనం కూడా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. అతనికి స్థానిక సహాయం లభించి ఉంటుందని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా అతని బ్యాంకు ఖాతా వివరాలు కూడా సూచిస్తున్నాయి. పెద్ద కుట్ర అని అధికారులు తెలిపారు. కుట్రను అమలు చేసేందుకు కేరళను ఎంచుకోవడానికి ప్రత్యేకించి కారణాలపై కూడా దర్యాప్తు సాగుతోంది. ఇతనికి పక్కాగా శిక్షణ ఇచ్చి కేరళ పంపారని తెలుస్తోంది. ఢిల్లీ పోలీసులు, సిట్‌లు సైఫీ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులను పలుమార్లు విచారించారు. ఈ విషయాన్ని తేల్చేందుకు దర్యాప్తు సంస్థలు కేరళ, ఢిల్లీ, మహారాష్ట్ర, యూపీ తదితర ప్రాంతాల్లో మకాం వేశాయి.

సైఫీ ఒంటరిగా లేడని, కొందరు అతని కదలికలను పర్యవేక్షిస్తున్నారని దర్యాప్తు అధికారులు కూడా భావిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) స్వాధీనం చేసుకోనుంది. కోజికోడ్‌లో మకాం వేసిన ఎన్ఐఏ అధికారులు కేంద్ర హోంశాఖకు సమగ్ర నివేదికను సమర్పించారు. ఇది చాలా రాష్ట్రాల ప్రమేయం ఉన్న ఉగ్రవాదానికి సంబంధించిన స్పష్టమైన కేసు అని చెబుతున్నారు. కేసును ఎన్ఐఏకు అప్పగించడంలో కేరళ ప్రభుత్వం జాప్యం చేస్తోందని భారతీయ జనతా పార్టీ విమర్శించింది. ‘ఇది చాలా రాష్ట్రాల్లో దర్యాప్తు అవసరమయ్యే ఉగ్రవాద కేసు అని ప్రజలు అర్థం చేసుకోవాలి. కేసును కేంద్ర సంస్థలకు అప్ప గించడంలో రాష్ట్రం ఎందుకు జాప్యం చేస్తుందో మాకు అర్థం కావడం లేదు’ అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేంద్రన్ అన్నారు.

**షాహీన్‌బాగ్ గుట్టు ఏమిటో?**

సీఏఏ, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా రోజుల తరబడి ఆందోళనలు చేయడం ద్వారా ఢిల్లీలోని షాహీన్‌బాగ్ గతంలో వార్తల్లోకి ఎక్కింది. ఈ ప్రాంతంలో విద్రోహక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతుంటాయని అందరికీ తెలిసిన విషయమే. షారూక్ సైఫీ మార్చి 31 నుంచి ఇంటి నుంచి కనిపించకుండా పోయాడని దర్యాప్తు అధికారులకు అతని కుటుంబ సభ్యులు చెప్పారు. ఆరోజు ఉదయం 9 గంటలకు తన షాహీన్ బాగ్ ఇంటి నుండి పని కోసం బయలుదేరి, రాత్రి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురయ్యాయంటున్నారు. కాల్ చేస్తే స్విచ్ఛ్ ఆఫ్ వచ్చిందని తెలిపారు ఏప్రిల్ 2న వారు మిస్సింగ్ కేసుగా ఫిర్యాదు చేసేందుకు షాహీన్ బాగ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లామన్నారు.

కానీ ఏప్రిల్ 4 ఉదయం 10 గంటలకు, కేరళ పోలీసు బృందం వారి ఇంటి తలుపు తట్టింది. సైఫ్ బెడ్‌రూమ్ పరిశీలిస్తామని పోలీసులు చెబితే, అతనికంటూ ప్రత్యేక గది లేదని చెప్పారు. కొన్ని పుస్తకాలు, గాడ్జెట్‌లను తీసుకెళ్లారు అని సైఫీ తండ్రి ఫక్రుద్దీన్ తెలిపారు. ‘నా కొడుకు ఇంతకు ముందు ఎప్పుడూ ఈ ప్రదేశాలను సందర్శించలేదు. సంబంధం లేని అమాయకులను చంపడానికి అతను ఇంత దూరం ఎందుకు ప్రయాణించాడో నాకు అర్థం కాలేద’ని అన్నారాయన. పాఠశాల చదువు పూర్తి చేసిన సైఫీ తండ్రి వడ్రంగి వ్యాపారంలో సహక రిస్తున్నాడని, ఇందులో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తాడని ఇరుగుపొరుగు వారు తెలిపారు.


**దక్షిణ భారతంపై గురి?**

తాజాగా జరిగిన ఘటనలను గమనిస్తే ఉగ్రవాద సంస్థలు చేతికి మట్టి అంటకుండా సామాన్యులను పావులుగా ఉపయోగించుకోవడం గమనించవచ్చు. వీరిని ఎలోన్ ఉల్ఫ్ అంటారు. గత ఏడాది అక్టోబర్ 23వ తేదీన కోయంబత్తూరు కొట్టేసంగమేశ్వర ఆలయం సమీపంలో మారుతీ 800లో సిలిండర్ పేలుడుకు, నవంబర్ 19 మంగళూరులో కుక్కర్ పేలుడు ఘటనకు సామీప్యతలు కనిపిస్తాయి. లక్ష్యానికి ముందే పేలిపోవడంతో ప్రమాద తీవ్రత వారికే పరిమితమై భారీ ప్రాణాపాయం తప్పింది. కోయంబత్తూరులో జమేషా ముబిన్ అనే నిందితుడు ప్రాణాలు కోల్పోగా, మంగళూరులో షరీఖ్ మహ్మద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనల వెనుక తౌహీ జామాద్ అనే ఉగ్రవాద సంస్థ ఉన్నట్లు తేలింది. ఈ రెండు ఘటనల్లోని వ్యక్తులు చిన్నచిన్న పనులు చేసుకొని జీవించేవారే. తాజాగా కోజికోడ్ ఘటనలో కూడా సామాన్యవ్యక్తే. కానీ సమాజానికి వీరంతా శత్రువులుగా ఎందుకు మారుతున్నారు? వీరికి వెనుక ఉన్న శక్తులు ఏమిటో అర్థం చేసుకోవాలి. ఉగ్రవాద సంస్థలు చాలా కాలంగా దక్షిణ భారత దేశాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ముఖ్యంగా కేరళలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (గతంలో సిమీ) కార్యకలాపాలపై అనేక అనుమానాలు, ఆధారాలు దొరకడంతో ఎన్ఐఏ అధికారులు ఆ సంస్థ ఆస్తులపై దాడులు చేపట్టి అరెస్టులు కొనసాగించాయి. రెండున్నర దశాబ్దాల క్రితం కోయంబత్తూరులో నాటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీపై హత్యకు కుట్ర ముందే భగ్నమైపోవడం గుర్తుండే ఉండాలి.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

# ఇదేనా సుప

**నాలుగేళ్లుగా సమస్యలు పరిష్కరించలేదు. అభివృద్ధి మాటెత్తలేదు. అవినీతి మాత్రం విచ్చలవిడిగా పెరుగుతోంది. వనరులను దొరికినంత దోచుకుంటున్నారు. అధికారమదం తలకెక్కి అవినీతిని ప్రశ్నించిన వారిపై రౌడీయిజం, గుండాయిజం చేయిస్తున్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు. రాజ్యహింసతో రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయి. ఇదీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితి.**



వైసీపీ ప్రభుత్వ అణచివేత చర్యలతో రాష్ట్ర ప్రజలు నివురుగప్పిన నిప్పులా ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీని 3 స్థానాలలో ఓడించారు. ప్రజలు భయాన్ని పక్కన పెట్టి భ్రష్టుపట్టిన ప్రభుత్వం గురించి బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని నిర్ణయించుకున్నారు. ప్రజల్లో వచ్చిన ఈ మార్పును గమనించిన అధికార పక్షం, పరిస్థితి ఇలాగే ఉంటే ఘోరంగా ఓడిపోవడం ఖాయం అని తెలుసుకుంది. ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం ఉండటంతో ఇప్పటి నుంచే ప్రచారం చేస్తోంది.

ప్రజలకు పథకాల రూపంలో డబ్బును ఇస్తున్నామంటూ వాలంటీర్ల నుంచి ఎమ్మెల్యేల వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయిస్తున్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్నా', 'జగనన్నా! నువ్వే మా భవిష్యత్' పేరుతో స్టిక్కర్‌లను ఇంటింటికి అతికిస్తున్నారు. అందుకు అభ్యంతరం వ్యక్తం చేసే ఇళ్ల యజమానులకు పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారు. దాంతో కొందరు అయిష్టంగానే స్టిక్కర్ల అతికించుకునేందుకు అంగీకరిస్తున్నారు. వైసీపీ బెదిరింపులపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తమ ఓట్లతో గెలిచి తమపైనే స్వారీ చేయడాన్ని ప్రజలు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

స్టిక్కర్‌లో పేర్కొన్న విధంగా 'మా నమ్మకం నువ్వే జగనన్నా...', 'జగనన్నా నువ్వే మా భవిష్యత్' అనే నినాదాలు ప్రజల నుంచి రావాలి కానీ, పాలక పక్షమే అలా వేసుకోవడం విడ్డూరం. 'నాలుగేళ్లుగా ఏం ఒరగబెట్టావు? ఏ సమస్యలు పరిష్కరించావు? ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశావు? ఎన్నిటిని ప్రారంభించావు? ఎన్ని రోడ్లు వేశావు? ఏం అభివృద్ధి చేశావు? ఎన్ని పరిశ్రమలు తెచ్చావు? ఎన్ని హామీలు నెరవేర్చావు? ఎంతమందికి ఉద్యోగాలిచ్చావు? రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? నిత్యావసరాల ధరలు ఎంత వరకు అదుపులో ఉంచావు? పన్నులు పెంచకుండా ఎంతవరకు సాంత్వన చేకూర్చావు? విద్యుత్ ఛార్జీలు, బస్సు ఛార్జీలు ఎంత వరకు పెంచకుండా చేశావు? ప్రజలకు ఎన్ని ఇళ్లు కట్టించి ఇచ్చావు? పేదలను ఎంతవరకు ఆదుకున్నావు? ఆడబిడ్డలకు రక్షణ ఉందా? అసలు మాకేం చేశావు జగనన్నా? అని ప్రజలు ప్రభుత్వంపై ప్రశ్నలు వర్షం కురిపిస్తున్నారు. తమ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానం చెప్పినప్పుడే 'మా నమ్మకం నీవేనని భావిస్తాం' అని అంటున్నారు.

నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఎన్ని సమస్యలు పరిష్కరించావంటూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని ప్రజలు నిలదీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయలేదు. కొత్తవి నిర్మించలేదు. కొత్త వంతెనలు, కల్వర్టులు కట్టడం సంగతి అటుంచి గతంలో ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తికాక, ఊరి మధ్యలో అడ్డుగా ఉండి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బకాయిలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాక ఒక్క పనీ పూర్తి కాలేదు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏ పనులు జరగడం లేదు. రిజర్వాయర్లు కట్టలేదు. పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరా వంటి వాటి జోలికి వెళ్లలేదు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన భవనాలను తమ ఘనతగా పేర్కొనడం మినహా ఈ ప్రభుత్వం ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాని చెత్తపై పన్నులు మాత్రం వసూలు చేస్తోంది. ఆస్తిపన్నులు పెంచారు. ఇదేనా మీ పాలన? అంటూ ప్రజలు జగన్‌ను నిలదీస్తున్నారు.

**అమరావతి అధోగతి!**

రాజధాని అమరావతిని కట్టకుండా నాశనం చేశావని, తమ బతుకులతో చెలగాటం ఆడుతున్నా వంటూ రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతులు జగన్‌ను తిడుతున్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై గుండాలు, పోలీసులతో దాడులు చేయించి అరాచకం సృష్టించలేదా? అని నిలదీస్తున్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం కార్యక్రమంలో భాగంగా తిరుపతి, అరసవల్లికి పాదయాత్రలు

వరికి మద్దతు ధర ఎంత వరకు అమలు చేశావు? తమ నుంచి ప్రభుత్వం తీసుకున్న ధాన్యానికి సకాలంలో నగదును చెల్లించావా? రైతు భరోసా పథకంలో హామీ ఇచ్చినట్లు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నావా? అని రైతులు జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే రూ. 6 వేలకు మరో రూ.7,500 ఇస్తూ మొత్తం రూ. 13,500 తానే ఇస్తున్నామని ప్రచారం చేసుకోవడం తమను వంచించడం కాదా అని రైతులు నిలదీస్తున్నారు.

...రిపాలన?



వల్లూరు జయప్రకాష్ నారాయణ

చేసిన సందర్భంగా రాళ్లు విసిరిన సంఘటనలు ఎలా మరచిపోతాం? అని దుయ్య బడుతున్నారు. విశాఖను పరిపాలన రాజధానిని చేయడం అక్కడ దోపిడికి, భూకబ్జాల కోసం కాదా? అని నిలదీస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు పనులను మీ హయాంలో పది శాతం అయినా పూర్తి చేశారా? అని ప్రశ్నిస్తు న్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎన్ని నిధులు కేటాయించారు? ఎన్ని పూర్తిచేశారు? అని అడుగుతున్నారు. కొత్త వాటిని అటుంచి పాతవాటిలో ఒక్కటైనా ఎందుకు పూర్తి చేయలేదు? అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్ని రహదారులు కొత్తవి నిర్మించారు? నిర్మాణంలో ఎన్ని ఉన్నాయని ప్రశ్నిస్తున్నారు. కోటిపల్లి–నరసాపురం, శ్రీకాళహస్తి–నడికుడి, కడప–బెంగళూరు రైల్వే ప్రాజెక్టులు ఎన్ని పూర్తిచేశారు? ఇంకా నిర్మాణంలో ఎన్ని ఉన్నాయని అడుగుతున్నారు.

**రైతులు అప్పుల పాలు కాలేదా?**

వరికి మద్దతు ధర ఎంత వరకు అమలు చేశావు? తమ నుంచి ప్రభుత్వం తీసుకున్న ధాన్యానికి సకాలంలో నగదును చెల్లించావా? రైతు భరోసా పథకంలో హామీ ఇచ్చినట్లు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నావా? అని రైతులు జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే రూ. 6 వేలకు మరో రూ.7,500 ఇస్తూ మొత్తం రూ. 13,500 తానే ఇస్తున్నామని ప్రచారం చేసుకోవడం తమను వంచించడం కాదా అని రైతులు నిలదీస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు నాలుగేళ్ల వరకు ఎందుకు అమలు చేయలేదని, ఇటీవల ట్రాక్టర్లు ఇస్తున్నట్లు ప్రకటించినా సబ్సిడీని తామే ముందుగా చెల్లించాలనడం మోసం కాదా? పంటల బీమా పథకానికి సకాలంలో ప్రీమియం చెల్లించకపోవడంతో వరదల కారణంగా నష్టపోయిన తమకు ఏం న్యాయం చేశావు? నకిలీ విత్తనాలు అరికట్టగలి గావా? యూరియ, విత్తనాలు బ్లాక్‌లో అమ్ముతుంటే ఏం చేశావు?' అని ప్రభుత్వంపై రైతులు మండిపడు తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం తమను వంచించిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వసతి దీవెన కింద ఏడాదికి ఇవ్వవలసిన రూ. 20 వేలకు గాను రెండు విడతలు రూ.10 వేలు మాత్రం ఇవ్వడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం తొలగింపు వల్ల ఆ డబ్బు చెల్లించలేక సర్టిఫికెట్లను కళాశాలలోనే వదలివేసినట్లు పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

**కొత్త పాలసీ పేరుతో ఉపాధికి గండి**

కొత్త పాలసీ పేరుతో ఇసుక సరఫరాను నిలిపివేసి ఉపాధి లేకుండా చేసి తమ కడుపు కొట్టలేదా? అని దాదాపు 20 లక్షల మందికి పైగా నిర్మాణరంగ కార్మికులు ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు. పనులు లేక అప్పులు చేసి ఉన్నవి తెగనమ్ముకున్నామని, చివరికి అప్పులు కూడా పుట్టక ఆకలితో చనిపోవడానికి మీ మొండి వైఖరే కారణం కాదా జగనన్నా? అని నిలదీస్తున్నారు. గతంలో లారీ రూ.4 వేలకు లభించే ఇసుకను రూ. 25 వేల వరకు బ్లాక్ మార్కెట్‌లో అమ్మలేదా? అని ప్రశ్నిస్తున్నారు. నాసిరకం మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.


**2.50 లక్షల ఉద్యోగాలేమయ్యాయి?**

రాష్ట్రంలో 2.50 లక్షల ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తాననే హామీతో 2019 ఎన్నికలలో గెలిచి, ఆ హామీని ఎంత వరకు అమలు చేశావు? కేవలం నీ పథకాల అమలుకు సచివాలయ ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశావు తప్ప టీచర్ల ఖాళీలను పట్టించుకోలేదు. ఈ నాలుగేళ్లలో ఎన్ని జాబ్ క్యాలెండర్లు విడుదలయ్యాయి. ఎంత మంది కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించావు? ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎందుకు తొలగించారు? సీపీఎస్ విధానం ఎందుకు అమలు చేయలేదు? పీఎఫ్ డబ్బులు కూడా వాడేసుకోవడమేనా నీవు మాకిచ్చే భవిష్యత్తా అని ప్రశ్నలు సంధిస్తున్నారు.

**మత వివక్ష ఎందుకు?**


హిందూ ధర్మానికి అవమానాలు జరుగుతున్నా, హిందూ దేవతా విగ్రహాలను పగలగొడుతున్నా, రథాలు ధ్వంసం చేస్తున్నా, మత మార్పిడులు ఉధృతంగా జరుగుతున్నా అదుపు చేయకపోగా క్రైస్తవులు, ముస్లిం గురువులకు జీతాలిచ్చావు. చర్చిల నిర్మాణానికి కోట్ల నిధులిచ్చావు. హిందూ ధర్మానికి హాని జరుగుతుంటే పట్టించుకోలేదంటూ హిందు వులు నిరసన తెలుపుతున్నారు. పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేయవలసి ఉండగా, నీ ఇష్టానుసారం పంచేసి సొంత డబ్బులిస్తున్నట్లు వ్యవహరించడం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అమలుచేసే జీవనోపాధి, స్వయం ఉపాధి పథకాలను అమలు చేయడం లేదు. పైగా అందరికీ అమలుచేసే పథకాలనే వీరికి వర్తింప చేస్తూ ఆ మొత్తాన్ని వీరి కోసం ఖర్చుచేసినట్లు ప్రకటనలిస్తున్నావు. ఇదేనా సుపరిపాలన? అని జనం ముక్త కంఠంతో నిలదీస్తున్నారు.

**వ్యాసకర్త:** ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.



❊ రామాయణంలోని పాత్రలు ❊

# లోకోపకారం మంధర అంతరార్థం



దుర్బోధలతో కైకేయిని రెచ్చగొట్టి శ్రీరాముడి పట్టాభిషేకాన్ని ఆపి, వనవాసానికి పంపి రామాయణంలో ముఖ్యమైన ఘట్టానికి కారణమైన వ్యక్తి మంధర. అందుకే చెడు సలహాలు ఇచ్చేవారిని, లేనిపోనివి చెప్పేవారిని ఆ పాత్రతో పోలుస్తారు. అయితే, మంధర పాత్ర చాలా కీలకమైనది. ఆమె ద్వారా ఒక ప్రత్యేకమైన ప్రయోజనాన్ని ఆశించి, రామాయణ మహాకావ్యంలో మంధర పాత్రను ప్రవేశపెట్టాడు వాల్మీకి మహాకవి. అదెలాగో చూద్దాం.

అసలు రామావతార లక్ష్యమే రావణ వధ. అది జరగాలంటే సీతను రావణుడు అపహరించాలి. సీతను రావణుడు అపహరించాలంటే రాముడు అడవులకు వెళ్లాలి. రాముడు అడవులకు వెళ్లాలంటే ఒక సాకు దొరకాలి. అదే కైకేయికి దశరథుడిచ్చిన వరాలు. కైకేయి ఆ వరాలను సరిగా ఉపయోగించుకోవాలంటే అందుకు మంధర బోధ చేయాలి. ఆ ప్రకారమే మంధర తన కర్తవ్యాన్ని నిర్వహించింది. ఇక్కడ ఆమె కర్తవ్యం ఏమిటి? కైకేయి మనస్సును చెడగొట్టి, దశరథుడు ఆమెకు ఎప్పుడో ఇచ్చిన వరాలను అడ్డు పెట్టుకుని భరతునికి పట్టాభిషేకం చేయించడం, శ్రీరామునికి పద్నాలుగేళ్లు అరణ్యవాసం ఆదేశించడం. ఈ పరిణామాలతో వీక్షకులకు, చదువరులకు మంధర మీద చాలా కోపం వస్తుంది. మనసులోనే మెటికలు విరుస్తారు

ఆధ్యాత్మికం

❊ 'మొక్క'బడి ❊

# ఆముదంతో ప్రయోజనాలెన్నో!

'ఏ చెట్టూ లేని దగ్గర ఆముదం చెట్టే మహావృక్షం' అని సామెత. ఆముదాన్ని పారిశ్రామిక రంగంలోనూ విస్తృతంగా వాడతారు. దీని శాస్త్రీయ నామం రిసినస్ కమ్మినిస్. యుఫెర్బేసియే కుటుంబానికి చెందినది. ఆముదం మొక్కలను నూనెగింజల ఉత్పత్తి కోసమే ఎక్కువగా సాగు చేస్తారు. తూర్పు ఆఫ్రికాలోని ఇథోఫియాలో ఆముదం మొక్కను మొదటిసారిగా గుర్తించారు. ఏపుగా, ఎత్తుగా పెరగడం వలన దీన్ని చెట్టు అని కూడా అనొచ్చు.

గానుగలో ఆముదం గింజలు ఆడించి వచ్చిన నూనెను చిన్నపిల్లలకు తలకు పట్టించేవారు. అంతేకాదు, కాటుక తయారీలోనూ ఆముదం వాడేవారు. పెద్ద ఇత్తడి పళ్లానికి అరగదీసిన గంధం, కరక్కాయ రాసి రాత్రిపూట ఓ మూలగా మూడు రాళ్లు పేర్చి కింద మట్టి ప్రమిదలో ఓపెద్ద వత్తివేసి ఆముదంతో వెలిగించి దాని మీద ఆ ఇత్తడి పళ్లెం మూతపెట్టేవారు. ఆముదానికి ఉన్న సహజ గుణం నెమ్మదిగా కాలడం, ఆ దీపం రాత్రంతా వెలిగి పళ్లెం మసిబారేది. ఆ పళ్లానికి అంటుకున్న మసినంతా ఉదయం గీకి అందులో పచ్చకర్పూరం, కొద్దిగా ఆముదం రాసి కాటుకను ఒక చిన్న ఇత్తడి డబ్బాలో దాచుకునేవారు. దానిని కొన్నినెలల పాటు పెట్టుకుని మిలమిలలాడే కళ్లతో అందంగా తయారయ్యేవారు. కిరోసిన్ వాడకంలోకి రానప్పుడు కాగడాలకు గుడ్డ చుట్టి ఆముదం పోసి వెలిగించేవారు. ఆ కాగడాన్ని గోడకు కొద్దిగా వంచి తగిలించే వారు. దాని కాంతి గది అంతా వ్యాపించేది.

ఆముదం నూనె అనాదిగా బళ్లచక్రాల ఇరుసుకు కందెనగా వాడుతున్నారు. బళ్లకు, ఇరుసుకు మధ్యలో రాపిడికి ఆముదం నల్లగా, చిక్కగా తయారయ్యేది. ఇలా తయారైన కందెనను హోలి సందర్భంగా రంగులతో పాటు వాడేవారు. ఆముదం తగ్గిపోతే బండి చక్రాల నుంచి కిర్రు కిర్రు మంటూ శబ్దం వచ్చేది. ఇళ్లలో వాడే కత్తులకు, కత్తెరలకు ఆముదం రాస్తే తుప్పు పట్టవు. అలాగే కండారాల బెణకు నొప్పులకు ఆముదం నూనెతో మర్దన చేస్తే ఉపశమనం లభిస్తుంది. వీధి దీపాలను వెలిగించేందుకు కూడా ఆముదం వాడేవారు. అంతేకాదు, ముద్రణా సంస్థల్లో, సబ్బుల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఆముదంలో విటమిన్ 'ఈ' ఎక్కువగా ఉంటుంది. వేలి చిగుళ్ల చిట్లూతూ, గోళ్ల విరిగి పోతుంటే

చాలామంది. నిజానికి రాముడు అడవులకు వెళ్లడంలో కానీ, భరతుడికి పట్టాభిషేకం వల్ల కానీ మంధరకు ఒరిగేది ఏమైనా ఉందా? ఇందులో ఆమె స్వార్థం ఏమైనా ఉందా? దుర్బోధ చేసింది కానీ, దానివల్ల తానేదో లబ్ధి పొందాలన్న తాపత్రయం కనపడిందా అసలు? స్వభావసిద్ధంగా మిక్కిలి చాకచక్యంగా మాట్లాడగల శక్తి ఆమెది. భరతునికి పట్టాభిషేకం కోరి కైకతో అయోధ్యకు రాలేదు. అయితే కైకతో మిక్కిలి చనువుగా మెలుగుతూ, ఆమెకు అవసరం వచ్చినప్పుడు సలహాలనిస్తూ, తన మాటను నెగ్గించుకునే స్థాయికి ఎదిగింది. రామునికి పద్నాలుగేళ్ల పాటు అరణ్యవాసానికి పంపడం మంధర మనోవాంఛితం ఏమీ కాదు. తలచుకుంటే రాముడు ఇంకా ఎక్కువ కాలమే అడవుల్లో ఉండేలా చేయగలదు. కానీ, అరణ్యవాసం పద్నాలుగేళ్ల పాటే ఉండేలా చూడమని కైకకు ఎందుకు సలహా ఇచ్చిందంటే.. త్రేతాయుగంలో ఆస్తికి ఉండే హక్కుకాలం పద్నాలుగు సంవత్సరాలు, ద్వాపరయుగంలో పదమూడు సంవత్సరాలు, కలియుగంలో పది సంవత్సరాలని చెబుతారు. అంటే నియమిత కాలం పాటు ఆస్తి లేదా అధికారానికి దూరమైన వారు, ఇక దాని మీద శాశ్వతంగా హక్కును కోల్పోతారన్న మాట. బహుశ ఈ కారణం చేతనే మంధర, కైకతో అలా అడిగించి ఉండవచ్చు. ఇలా శ్రీరామ వనవాసానికి మంధర ప్రథమ సోపానాలను నిర్మించి, రామావతార ప్రాశస్త్యానికి చేదోడు వాదోడైంది. అందువల్ల అమె పాత్ర చిత్రణమంతా దైవఘటన. ఆమె మాట దైవ ప్రేరణ.

ఏది ఏమైనా, మంధర దుర్బోధ కైకేయిని అపమార్గం పట్టించిన మాట వాస్తవం. దానివల్ల లోకకల్యాణం జరిగినప్పటికీ కైక మీద నింద పడింది. విపరీత పరిణామాలెన్నో సంభవించాయి. రామాయణంలో మంధరది చిన్న పాత్రే అయినా ఆ కావ్యాన్ని మలుపుతిప్పినదిగా మిక్కిలి గుర్తింపు తెచ్చుకుంది. ★



రోజుకు మూడు, నాలుగు చుక్కల చొప్పున మూడు నెలల పాటు గోళ్లకు ఆముదం రాసుకుంటే సమస్య తగ్గుతుంది.

నిగనిగలాడే, నల్లని, దృఢమైన జుట్టు పెరగాలంటే ఆముదం నూనె రాస్తే మంచి ఫలితం ఉంటుంది. రెండు స్పూన్ల ఆముదం, ఒక స్పూన్ గ్లిజరిన్, ఒక కోడిగుడ్డులోని తెల్లటి సొన మిశ్రమంలా కలిపి తడి జుట్టుకు పట్టించి పావుగంట తరువాత శుభ్రపరుచుకోవాలి. వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఇలా చేస్తే ఆరోగ్యవంతమైన జుట్టు మీ సొంతమవుతుంది. అలిసిపోయిన సందర్భాల్లో కనురెప్పల మీద ఆముదం రాసుకుని పడుకుంటే సుఖనిద్రను పొందుతారు. కళ్లు కూడా నిగనిగలాడతాయి. ★





# దేవుడు మనలోనే ఉన్నాడు!

దేవుడు ప్రపంచాన్ని సృష్టించినప్పుడు ఆయన కూడా అదే ప్రపంచంలోని ఒక వీధిలో నివసించేవాడు. ప్రజలు రకరకాల కోరికలతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా తమ కోరికలు తీర్చాలని, విన్నపాలు ఆలకించాలని ఆయన వద్దకు వచ్చేవారు. ఒకరికి ఉద్యోగం కావాలి, ఒకరి భార్యకు అనారోగ్యం, ఒకరి బిడ్డ చనిపోయింది – అంటూ ఆయనకు విన్నవించు కునేవారు. దాంతో దేవుడి జీవితం నరకయాతనగా తయారైంది. ఆ బాధను భరించలేని ఆయన ఆ నరకం నుంచి బయటపడే మార్గం ఏమిటని తన సలహాదారులను అడిగాడు.

వారు 'ఈ ప్రపంచాన్ని సృష్టించడం మీరు చేసిన మొదటి తప్పు, పైగా మీరు ఇక్కడే ఉండడం రెండవ తప్పు. కాబట్టి, ఇక్కడి నుంచి ఎక్కడికైనా పారిపోవాలి. లేకపోతే, ఈ మనుషులు మిమ్మల్ని బతకనివ్వరు' అని చెప్పారు.

అప్పుడు దేవుడు 'ఎక్కడికి పారిపోవాలి?' అని అడిగాడు.

ఆ సలహాదారులలో ఒకడు 'ఎవరెస్టు పైకి పారిపోండి' అన్నాడు.

వెంటనే దేవుడు 'నీకు భవిష్యత్తు గురించి తెలియదు. త్వరలో ఎడ్మండ్ హిల్లరీ అక్కడకు వస్తాడు. అప్పుడు నేను అతనికి కనిపిస్తే మళ్లీ సమస్య మొదలవుతుంది. రోడ్లు, బస్సులు, హోటళ్లు, విమానాశ్రయాలు– ఇలా అన్నీ అక్కడ కూడా తయారవుతాయి. దాంతో అందరూ వచ్చి నన్ను మళ్లీ వేధించడం ప్రారంభిస్తారు' అన్నాడు.

అయితే, 'చంద్రుడిపైకి పారిపోండి' అని మరొక సలహాదారుడన్నాడు.

'మనిషి అక్కడికి కూడా వస్తాడు. ఎందుకంటే, మనిషి వెళ్లలేని ప్రదేశమే లేదు. ఎప్పటికైనా మనిషి ఎక్కడికైనా వెళ్లగలడు' అన్నాడు దేవుడు.

వెంటనే ఆ సలహాదారులలో అతి తక్కువగా మాట్లాడే, వయసు పైబడిన ఒకాయన దేవుడి చెవిలో 'మీరు మనిషిలోనే దాక్కుంటే ఎవరూ మీ దగ్గరికి రాలేరు. ఎందుకంటే మనిషి మీకోసం బయట వెతుకుతాడే కానీ, తనలో తాను వెతకడు' అన్నాడు.

వెంటనే దేవుడు 'ఈ సలహా చాలా బాగుంది' అన్నాడు.

అప్పటినుంచి మనిషి దేవుడి కోసం ఎక్కడెక్కడో వెతుకుతూనే ఉన్నాడు తనలో తప్ప. ★



రోమ్ నగరంలోని తన భవంతిలో కూర్చుని సీజర్ ఆలోచిస్తున్నాడు. క్రాసస్‌ను చంపేశారు. పాంపే పలాయితుడైనాడు. అధికార త్రయంలో మిగిలినది తానే. తనను తాను నియంతగా ప్రకటించుకుని, తానే ఎన్నికలు నిర్వహించి, తననే విజేతగా ప్రకటించుకున్నాడు. కానీ శత్రుశేషముండరాదు. ఈజిప్టులో పాంపేకు అక్కడ పరిపాలకుడైన టోలమీ ఆశ్రయమిచ్చినట్లు తెలిసింది. తాను అలెక్సాండ్రియా వెళ్లి పాంపేనూ, అతడు ఆశ్రయం ఇచ్చిన రాజునూ మట్టు పెట్టాలి.

సీజర్ సైన్య సమేతంగా అలెక్సాండ్రియాకు కదిలాడు. రోమ్ సైన్యం తమ రాజ్యానికి వస్తున్న సంగతి టోలమీకి తెలిసింది. ఆ సమయంలో ఈజిప్టులో వారసత్వ యుద్ధం నడుస్తున్నది. టోలమీ కన్నా తనకే సింహాసనం మీద హక్కు ఉన్నదని అతని సోదరి క్లియోపాత్రా పోరాటం నడుపుతున్నది. టోలమీకి ఏం చేయాలో బోధ పడలేదు.

నైలునదీ ప్రాంతంలోనే క్లియోపాత్రా సైన్యంతో దండెత్తడానికి సిద్ధంగా ఉన్నది. ఇంకొక వైపున సీజర్ సైన్యంతో అలెక్సాండ్రియా వైపు వస్తున్నాడు. తన గురువూ, హితోభిలాషీ థియోడోటస్ సలహాను అనుసరించి టోలమీ తన ఆశ్రితుడైన పాంపేను సంహరించి అతని తలనూ, రాజముద్రనూ సీజర్‌కు పంపించాడు.

పాంపే ఖండిత శిరస్సును చూసి సీజర్ కార్చిన మొసలి కన్నీటితో నైలునదికి వరద వచ్చినట్టని పించిందంటే అతిశయోక్తి కాదేమో! పాంపేను హతమార్చిన సైనికులను బహిరంగంగా కొరత వేయించి, తన ప్రాసాదంలో కూర్చున్న సీజర్ వద్దకు రాత్రి రహస్యంగా ఒక సుందరాంగి – ఇరువది ఏండ్ల యువతి – వచ్చింది. ఆమే ఈజిప్టు రాణి క్లియోపాత్రా.

క్లియోపాత్రా తన చారుల ద్వారా జూలియస్ సీజర్ గురించి తెలిసికొన్నది. అతనికి స్త్రీ వ్యామోహం ఎక్కువ. అందునా రాజవంశ స్త్రీలు, అతనిని సులభంగా ఆకర్షిస్తారు. తన సోదరుడు టోలమీకి తెలియకుండా, ప్రత్యేకమైన అలంకరణతో ఆమె జూలియస్ సీజర్ నివాసంలో అడుగు పెట్టింది. తానెవరో తెలియజేసింది. రాజ్యానికి సరియైన వారసత్వం తనదేనని వాదించింది. ఈజిప్టును జయించి, రోమ్ సామ్రాజ్యంలో భాగం చేసికోవడం వలన సీజర్‌కు ప్రయోజనం లేకపోగా నష్టదాయకమేనని వివరించింది. ఈజిప్టు ధనిక దేశం కాదు. అందునా ప్రస్తుతం కరవు కాటకాలు పీడిస్తున్నాయి.

ఆమె రాజకీయ చతురతకే ముగ్ధుడయ్యాడో, లేక సౌందర్యానికే దాసుడైనాడో సీజర్‌కే తెలియదు కానీ ఆమెకు వశుడైపోయాడు. ఆమెయే ఈజిప్టుకు రాణి అని మాట ఇచ్చాడు.

తన సోదరి క్లియోపాత్రా సీజర్‌ను కలసిన విషయం టోలమీకి తెలిసింది. అతడు తన సేనతో ప్రాసాదాన్ని ముట్టడించాడు కానీ వెనువెంటనే సీజర్ చేతిలో బందీ అయినాడు. ఆ విషయం తెలిసిన అలెక్సాండ్రియా నగర ప్రజలు వ్యతిరేక నినాదాలతో ప్రాసాదం వద్దకు వచ్చారు.

సీజర్ వద్ద ఉన్న ఆయుధాలలో అన్నిటికన్నా గొప్పది అతని వాక్చాతుర్యం. తన ఉపన్యాసాలతో ఎంతటి వారినైనా మాట్లాడకుండా చేసి, లొంగతీసికోగల శక్తి ఉన్నది. గుంపులుగా వచ్చిన వారిని శాంతపరచి, టోలమీ, క్లియోపాత్రాలను వారి ఎదుట నిలబెట్టాడు. వారి తండ్రి తన ఇద్దరు సంతానానికీ వారసత్వం సమానంగా ఉందని రాసిన పత్రం పాంపేకు ఇచ్చాడనీ, అది ప్రస్తుతం తన వద్ద ఉందనీ అన్నాడు. ఇరువురూ కలసి ఈజిప్టు పరిపాలించడమే

## ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన




17

ఆయన అభిమతమనీ, ఈజిప్టు రాజవంశ సంప్రదాయాన్ని అనుసరించి వారిరువురికీ తాను వివాహం జరిపించగలననీ అన్నాడు. ప్రజలు సంతోషంతో వెనుతిరిగారు. కానీ జూలియస్ సీజర్ వెను తిరగలేదు. పాంపే మరణాంతరం రోమ్‌కు వెళ్లిపోవడానికి అతనికి ఏ అభ్యంతరమూ ఉండ రాదు. కానీ స్త్రీ వ్యామోహం అతనిని అలెక్సాండ్రియా నుండి కదలనివ్వలేదు.

ఆ పరిస్థితులలో అలెక్సాండ్రియాలో వరాహ మిహిరుడు అడుగుపెట్టాడు.

* * *

బాబిలాన్ నగరం నుంచి పశ్చిమ దిక్కుగా కదలిన విక్రమాదిత్యుని సేన జూడియాను జయించింది. సైనికుల సంయమనాన్నీ చక్రవర్తి సరళ స్వభావాన్నీ గమనించిన జూడియావాసులు దక్షిణంగా కొన్ని ఎడారి ప్రాంతాలున్నవనీ, నాగరికత లేని ఆ ప్రాంతాలను విక్రమాదిత్యుడు జయించి, వారి విద్యనూ, సంస్కృతి సంప్రదాయములనూ అభివృద్ధి చేయడం అభిలషణీయమనీ కోరారు. ఉమడ్ మొదలైన అనేక చిన్న చిన్న రాజ్యాలున్నాయని చెప్పారు. (నాటి ఆ ప్రాంతమే నేటి సౌదీ అరేబియా). విక్రమాదిత్యుడు అంగీకరించాడు. వరాహమిహిరుని కోరికను మన్నించి, రథంలో అతనిని అలెక్సాండ్రియాకు పంపించాడు. నగర పొలిమేరలో రథం దిగిన మిహిరుడు సారథిని వెనుకకు వెళ్లిపొమ్మనీ, చక్రవర్తి తనకు తగినంత ధనమిచ్చారనీ, తిరుగు ప్రయాణానికి తానే వాహనం అమర్చుకొనగలననీ చెప్పి, కాలినడకన నగర ప్రవేశం చేశాడు.



పాలంకి సత్య

సాయం సమయము కావస్తున్నది. ఇదివరలో కాక ఇప్పుడు భోజనమూ, వసతికీ తన వద్ద ధనమున్నది. గురువులకు కూడ వారు కోరినంత ఇవ్వగలడు. ఎవరినైనా అడిగి వసతి గృహాలకు చేరుకోవాలి. వరాహమిహిరుడు ఒక గృహం ముందు నిలబడి తలుపు తట్టినాడు. తలుపు తీసిన వారికి అతని వస్త్రధారణ నచ్చకనో, మరే కారణం వల్లనో వెంటనే మూసేసుకున్నారు. మరి రెండు విఫల యత్నాల తర్వాత వీధిలో నడిచే వారిని వసతి గృహాల గురించి ప్రశ్నించాడు. సమాధానం లభించలేదు.

చివరి ప్రయత్నం చేసి, సమాధానం దొరకని పక్షంలో వీధిలోనే శయనించవలెనని వరాహ మిహిరుడు నిర్ణయించుకుని, ఒక గృహం ముందు నిలబడి, తలుపు తట్టాడు.

ఒక యువతి ఇంటి వెలుపలకు వచ్చి అతని వంక ప్రశ్నార్థకంగా చూసింది. వరాహమిహిరుడు వసతి గృహాల విషయమడిగాడు. అతని యవన భాషలోని యాస పట్టిచ్చినదేమో ఆమె "పారసీక దేశం నుండి వచ్చారా?" అని అడిగినది. అతడు అస్తి నాస్తి విచికిత్సాకారకమైన శిరః ప్రకంపనం చేశాడు. ఆమె ''మా యజమానురాలిని అడిగివస్తాను'' అని లోపలకు వెళ్లినది. "ఈమె పరిచారికయా"? అని మిహిరుడనుకున్నాడు.

ఆమె తిరిగివచ్చి "ఈ రాత్రికి ఇక్కడ శయనించండి. రేపు ఉదయమే మీకు దారి చూపగలను" అన్నది. మిహిరుడు లోనికి వెళ్లి పడుకున్నాడు. కానీ అతనికి నిద్ర పట్టలేదు. లేదా అతని వద్ద ధనము నిద్ర పట్టనీయలేదు. భరత ఖండానికి తిరుగు ప్రయాణమయ్యే వరకూ జాగ్రత్త తప్పనిసరి.

మరునాడు ఉదయం ఇంటి యజమానురాలు అతనిని అలెక్సాండ్రియా వచ్చిన కారణం గురించి అడిగింది. ఆమె భాష అతనికి అర్థం కాలేదు. అలెక్సాండ్రియాలో అందరూ గ్రీకు భాషను మాట్లాడరా? రాత్రి తనతో సంభాషించిన యువతి వచ్చి, భాషాంతరీకరణము చేయగా మిహిరుడు తాను వచ్చిన కార్యము గురించి చెప్పాడు.

"కొంతకాలం మీరిక్కడ ఉండడం తప్పనిసరి. వసతి గృహాలలో నివసించడం వ్యయంతో కూడిన పని. మా ఇంట తక్కువ ధనానికే మీకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించగలను. నేను ధనవంతురాలను కాను. మీరిచ్చే ధనం నాకు ఉపయోగపడుతుంది. హెలీనా మీకు నచ్చినట్లుగా వండి పెట్టగలదు. మీకు ఈ పద్ధతి నచ్చకపోతే వసతి గృహానికి దారి చూపగలదు".

వరాహమిహిరుడు ఆలోచించసాగాడు. ఇరువురు స్త్రీలు మాత్రమే ఉన్న ఇంట నివసించడమా? వసతి గృహమే మేలేమో! కానీ, ఎక్కువమంది ఉండేచోట తాను నిత్య, నైమిత్తిక కర్మలను ఆచరించగలడా? తాను ఆరాధించు సూర్యదేవుడే తాను నీతిపథాన్ని తప్పకుండా రక్షించుగాక. మిహిరుడు వారి ఇంట నివసించేందుకు అంగీకరించి, యజమానురాలు కోరినంత బంగారం ఇచ్చి, స్నాన, జపాది కార్యక్రమాలలో నిమగ్నుడైనాడు.

మధ్యాహ్నం యజమానురాలు హెలీనాను పిలిచి మిహిరుని యవన గురువులుండే చోటికి తీసికొని వెళ్లమని ఆదేశించింది. మిహిరుడు ఆమెతో తాను ఇదివరలోనే యవన జ్యోతిషమభ్యసించాననీ, విశేషాంశాలు నేర్చుకునేందుకు వచ్చాననీ చెప్పాడు. హెలీనా అతనిని ఒక ఉపాధ్యాయుని వద్దకు తీసుకొని వెళ్లింది. గురువు కోరినంత ధనమిచ్చి, నేర్చుకొనే ఏర్పాటు చేసుకున్న మిహిరుడు మరునాడు ఉదయమే రాగలనని చెప్పాడు. హెలీనా అతనికి దారిలో గుర్తులు చూపిస్తూ ఇంటికి తీసికొని వచ్చినది. సాయంత్రం ఆమె ''విద్యార్జనకై బహుదూరం వచ్చినారు. మీరు రోమ్ వారి ఖగోళశాస్త్రాన్నీ అభ్యసించవచ్చును కదా!" అన్నది.

"రోమ్ జ్యోతిషమా?" మిహిరుడు ఆశ్చర్యంగా అడిగినాడు.

ఆమె మరింత ఆశ్చర్యంతో "రోమ్ గురించి

తెలియదా?" అని ప్రశ్నించింది. అవును. రోమ్ అన్నమాట ఇదివరలో విన్నాడు. ఖనా సోదరులలో ఒకరు ఆ నగరంలో వస్త్ర వ్యాపారం చేస్తారు. అక్కడ శాస్త్ర పద్ధతి ప్రత్యేకం కాబోలును.

"రోమ్ గురించి విన్నాను. అంతకుమించి తెలియదు".

"ఈ ఇంటి యజమానురాలు అక్కడి నుంచి వచ్చినది. వారి భాషను లాటిను అంటారు".

వరాహమిహిరుని విజ్ఞాన తృష్ణ అతనిని లాటిను భాషను ముందుగా నేర్చుకుని, ఆపైన రోమ్ వారి ఖగోళశాస్త్రమభ్యసించేలా నిశ్చయింపచేసింది.

❊ ❊ ❊

విక్రమాదిత్యుని సేన దక్షిణ దిక్కుగా కదలి, ఎడారి ప్రాంతవలో ఉన్న అనేక చిన్న రాజ్యాలను ఆక్రమించింది. ప్రతి చోటా చక్రవర్తి అక్కడ ఉన్న జనులతో ప్రసంగించి వారి జీవనవిధానాన్నీ, కష్ట సుఖములనూ తెలుసుకునేవాడు. సంస్కృత, యవన భాషలు తెలిసిన పండితుడూ, యవన భాషనూ, ప్రాంతీయ భాషలనూ అధ్యయనం చేసిన వాడూ విక్రమాదిత్యుని వెంట ఉన్నారు. వారిద్దరూ భాషాంత రీకరణ చేయవలసి రావడంతో సంభాషణ చాలా నెమ్మదిగా సాగేది. ఎంతో సౌమ్యంగా మాట్లాడుతూ, వారి ధార్మిక నియమాలనూ, సంస్కృతి సంప్రదాయా లను గౌరవిస్తూ, వారి జీవన విధానానికి మెరుగులు దిద్దే ప్రయత్నాన్ని విక్రమాదిత్యుడు చేశాడు. సామాన్య ప్రజలకు అతడొక విజేతగా కాదు, తమను అజ్ఞానాంధకారం నుంచి వెలుగులోకి నడిపించే మహాపురుషునిగా కనిపించాడు.

భరతఖండం నుంచీ, జూడియా దేశం నుంచీ పండితులనూ, శిల్పులనూ రప్పించి, విద్యా బోధనకై గృహాలను నిర్మించి, చదువుకునే అవకాశం చక్రవర్తి కల్పించాడు. ఇక తిరిగి వెళ్లిపోవాలనుకునే సమయంలో దేశజనులు చక్రవర్తిని విద్యాలయాలతో పాటు ఒక దేవాలయం నిర్మించి ఇవ్వమని కోరారు.

ఉజ్జయినీ వదలి నాలుగేండ్లయింది. ఇక పోవాలనుకునే సమయంలో ఈ కార్యం వచ్చినదేమి? ప్రజాభీష్టం నెరవేర్చడం పాలకుని బాధ్యత. విక్రమాదిత్యుడు అక్కడే నిలిచి, నిర్మాణ కార్యక్రమం ప్రారంభించాడు. పండితులు వాస్తు పూజా ముహూర్తం నిర్ణయించారు. విక్రమాదిత్యుడు తన ధర్మపత్ని ప్రతిమను చేయించి, పీటపై ప్రతిష్టించి, వాస్తు పూజాది కార్యాలు చేశాడు. దేవాలయంలోని లింగ ప్రతిష్టకు అన్ని సిద్ధమయ్యాయి. అనేక శిలలను భరతభూమి, నుంచీ, ఇతర ప్రాంతాలనుంచీ తెప్పించి, ఆలయ నిర్మాణం చేయించాడు చక్రవర్తి. శివలింగంతో పాటు అమ్మవారి విగ్రహం, నవగ్రహాలూ శిల్పులు చెక్కారు. విష్ణువుకూ, బ్రహ్మకూ ఆలయాలు నిర్మించారు. గంగాజలం తెప్పించి, సంప్రోక్షణ చేసిన తర్వాత చక్రవర్తి ఆలయంలో ప్రవేశించి స్వామికి నమస్కరించి, "దేవా, నా శక్తి మేరకు ఈ దేశ ప్రజలు నిన్ను ఆరాధించేందుకు అవకాశం కల్పించాను. ఏ రూపంలో కొలిచినా అనుగ్రహించే మహాదేవుడివి. నీ భక్తులందరినీ అనుగ్రహించు" అని ప్రార్థించాడు.

చక్రవర్తి వెలుపలకు వచ్చాక అక్కడ నిలబడి ఉన్న ప్రజా నాయకుడొకడు "ప్రభూ, చిన్న విన్నపం"



విక్రముని రాజ్యంలోని వారు అదృష్టవంతులు. ఆయన ప్రజా సంక్షేమానికే జీవితాన్ని అంకితం చేశాడు. తోడేలుకి చిక్కిన గొర్రెల మాదిరిగా ప్రజలున్న సమయంలో, అమావాస్య నాటి అంధకారంలో దేశం చిక్కిన కాలంలో విక్రమాదిత్య మహారాజు జ్ఞానమనే వెలుగును ప్రసాదించాడు. పరదేశీయులని మమ్ము నిర్లక్ష్యం చేయక పండితులచే పవిత్రమైన ధర్మాన్ని బోధింప చేశాడు.

అన్నాడు. విక్రముడు ఏమిటన్నట్లుగా చూశాడు. "ఈ స్వర్ణపాత్రను ఆలయంలో ఒక మూలగా తగిలించు కునేటందుకు అనుమతి ఇమ్మని ప్రార్థన" అన్నాడు.

"స్వర్ణపాత్రా? దేనికి?"

"ప్రభూ, మీరు మాపై చూపిన ఔదార్యానికి గుర్తుగా చెక్కించినాము" అన్నాడు. స్వర్ణపాత్రపై నున్న విషయంను పండితులు చక్రవర్తికి వివరించారు.

"విక్రముని రాజ్యంలోని వారు అదృష్టవంతులు. ఆయన ప్రజా సంక్షేమానికే జీవితాన్ని అంకితం చేశాడు. తోడేలుకి చిక్కిన గొర్రెల మాదిరిగా ప్రజలున్న సమయంలో, అమావాస్య నాటి అంధకారంలో దేశం చిక్కిన కాలంలో విక్రమాదిత్య మహారాజు జ్ఞానమనే వెలుగును ప్రసాదించాడు. పరదేశీయులని మమ్ము నిర్లక్ష్యం చేయక పండితులచే పవిత్రమైన ధర్మాన్ని బోధింప చేశాడు. భగవంతుని గురించీ, సత్యపథాన్ని గురించీ, ధర్మాన్ని గురించీ తెలుసుకుని, వెలుగులోకి వచ్చామంటే అది విక్రమాదిత్యుని చలవే." వివరాలు విన్న విక్రమా దిత్యుడు "ఇందులో మేము చేసినదేమీ లేదు. మానవుడు నిమిత్తమాత్రుడు. భగవంతుడు మాపై ఉంచిన బాధ్యతను నెరవేర్చినామంతే!" అన్నాడు.

ప్రజానాయకుడు "ప్రభూ, మీరు ఈ దేశం వదలి వెళుతున్నారు. మళ్లీ ఎప్పుడు వస్తారో! మేమెవరమూ మీ దర్శనం కోసం రాగల శక్తి కలిగిన వాళ్లం కాదు. మమ్ము అనుగ్రహించ ప్రార్థన. ఈ బంగారు గిన్నెను దేవాలయంలో ఉంచేందుకు అనుమతించగలరు".

విక్రమాదిత్యుడు అతి కష్టం మీద అంగీక రించాడు.

❊ ❊ ❊

సేన ఆనందోత్సాహాలతో భరతభూమికి తరలింది. మార్గ మాధ్యంలో శిల్పులను అక్కడక్కడ నిలిపి దేవాలయాలను నిర్మించమని ఆదేశించి, విక్రమాదిత్యుడు పారసీక దేశంలో ప్రవేశించినాడు. వరాహమిహిరుడు పారసీక భాషలో రచించిన పంచతంత్రం పారసీక రాజైన తన మామగారికిచ్చిన తర్వాత విక్రమాదిత్యుడు సేనా సమేతంగా భరత ఖండానికి కదలినాడు. సింధు నదీ తీరం నుండి ఉజ్జయినీ వరకూ దిగ్విజయ యాత్ర ముగించుకుని వచ్చిన చక్రవర్తిపై ప్రజలు పూలవాన కురిపించారు. కోటలో వందిమాగధులు స్తుతి పాఠాలు చదివారు. వేద పండితులు ఆశీర్వదించారు. పట్ట మహిషీ, ఇతర రాణులూ నీరాజనమిచ్చారు. ప్రాయశ్చిత కర్మలను నిర్వహించిన అనంతరం చక్రవర్తి పాలనా కార్యక్రమంలో నిమగ్నుడైనాడు.

❊ ❊ ❊


యవన ఖగోళ శాస్త్రాభ్యాసంతో పాటు లాటిను భాషను నేర్చుకొనడం ప్రారంభించిన వరాహ మిహిరునికి రెండు మాసాలలోనే ఆ భాషలో తగిన ప్రావీణ్యం కలిగినది. సంస్కృత భాషకు, గ్రీకు భాషకు పోలికలున్నట్లే, గ్రీకు, లాటినులకు సారూప్యమెక్కువ. అందుకే సులభంగా, శీఘ్రంగా నేర్చుకొనగలిగానని అతడనుకున్నాడు. భాషలన్నిటికే మూల మొక్కటియే కాబోలును.

లాటిను భాషను నేర్చుకున్న తర్వాత రోమ్‌వారి ఖగోళమభ్యసిస్తున్న సమయంలో అతని మనస్సులో ఒక ఊహ మెదిలినది. ఇదివరలో తాను సిద్ధాంత గ్రంథరచన చేసినప్పుడు సూర్య, వాసిష్ట, పైతామహ సిద్ధాంతాలను వేరువేరుగా రాశాడు. అట్లు కాకుండా ఒక్కొక్క విషయం గురించి అభిప్రాయ సారూప్యా లనూ, అభిప్రాయ భేదాలనూ కలిపి రాస్తే ప్రతి విషయం గురించి పాఠకులకు సంపూర్ణమైన అవగాహన ఏర్పడుతుంది కదా. ఆ ఊహ వచ్చిన వెంటనే వరహమిహిరుడు ఈజిప్టులో రాతకు ఉపయోగించే పీపిరస్ ఆకులనూ, కుంచెలనూ, రంగులనూ క్రయం చేశాడు.

ఇంటికి వచ్చిన తర్వాత అతనికి రాయడంలోని కష్టం అనుభవానికి వచ్చింది. పీపిరస్ ఆకులు భూర్జ పత్రాల వలె లేవు. అవి చుట్ట చుట్టుకొని పోతున్నాయి. అవి ముడుచుకు పోకుండా ఎలా రాయాలో అతనికి తెలియలేదు.

(సశేషం)

# చందన చర్చితుడు నరహరి...



ఈ విశ్వమంతా విష్ణుమయమే (సర్వం విష్ణుమయం జగత్). ఆర్తజన బాంధవుడు. తలచినంత మాత్రమునే భక్తులను అనుగ్రహించే కరుణానిధి. ప్రహ్లాద వరదుడు శ్రీమన్నారాయణుడు ఆ భక్తాగ్రేశ్వరుడి కోరిక మేరకు ద్వియరూపుడై (వరాహ, నరసింహ) సింహగిరిపై దర్శనమిస్తున్నాడు. నృసింహుడు అనగానే ఉగ్రమూర్తి కళ్ల ముందు కదలాడడం సర్వ సాధారణం కానీ సింహాద్రినాథుడు పరమ శాంతమూర్తిగా దర్శనమిస్తాడు.

**'కుదాంభ సుందర తనుఃపరిపూర్ణ చంద్రబింబానకారి వదన ద్విభుజ స్త్రినేత్రః శాంతః త్రిభంగి లలితః క్షితి గుప్తపాదః సింహాచలే జయతి దేవ వరో నృసింహః'....**

వరాహ ముఖం, నృసింహ శరీరంతో, జారిపోతున్నట్లున్న పీతాంబరాన్ని ముడి వేసుకోకుండా ఒక చేతితో పట్టుకున్నట్లు త్రిభంగిమలో లలిత సుందరంగా, వయ్యారంగా నిలిచి ఉంటాడు. ఏడాది పొడవున శ్రీచందనం అలంకార భూషితుడై వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే నిజదర్శన భాగ్యం కలిగిస్తాడు. అదీ పన్నెండు గంటలు మాత్రమే. అరుదైన ఈ దర్శనం కోసం భక్తకోటి అత్యంత ఆసక్తితో ఎదురు చూస్తుంది. చందనయాత్ర నాడు నిజరూపం సందర్శనం వైకుంఠంలో లక్ష్మీనారాయణులను దర్శించినంత ఫలితమని క్షేత్ర మహాత్మ్యం పేర్కొంటోంది. సింహాద్రినాథుడు చందనమయ లింగాకృతిలో దర్శనమిస్తూ, హరిహర అభేదానికి నిదర్శనంగా నిలిచాడు.

అన్ని ప్రముఖ వైష్ణవ క్షేత్రాల మాదిరిగానే సింహాచలం శ్రీ లక్ష్మీ వరాహ నృసింహ స్వామికి ఏడాది పొడవునా పర్వదినాలు, ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. వాటిలో వైశాఖ శుక్ల తదియ నాటి నిజరూప దర్శనం (చందనయాత్ర లేదా చందనోత్సవం) ప్రత్యేకమైనది. ఏడాది అంతా సుగంధ పరిమళ చందనంతో నిండి ఉండే స్వామి ఆ ఒక్కరోజు నిజ రూపదర్శనం ఇవ్వడం వల్ల ఆ రోజును అత్యంత ప్రాధాన్యమైనదిగా పరిగణిస్తారు. ఆనాడు సింహగిరి భక్తులతో కిటకిటలాడుతుంది.

చందనోత్సవం నేపథ్యాన్ని స్మరించుకుంటే... ప్రహ్లాదుడి తరువాత స్వామివారికి ఆరాధన అర్చనాదులు లోపించి, కొంతకాలానికి అక్కడ పెద్ద పుట్ట వెలసింది. అటు తర్వాత షట్చక్రవర్తులలో ఒకరు పురూరవుడు ఊర్వశితో కలసి ఆ ప్రదేశానికి విహారానికి వచ్చి విశ్రమించినపుడు, స్వామి కలలో కనిపించి తన ఉనికిని చాటాడు. పుట్టను తొలగించి తనను ప్రతిష్ఠించాలని సూచించగా, స్వామి దేహం మీది గల పన్నెండు మణుగుల (480కిలోల) మట్టిని చక్రవర్తి పాలధారతో కరిగించి దర్శించుకున్నాడు. కానీ పాద నమస్కారం చేసుకోలేకపోయారట. 'స్వామి పాదార్చన భాగ్యం కలుగలేదు కదా?'అని చక్రవర్తి ఆవేదన చెందుతుండగా, 'దేవదేవుని పాదాలు కొండ పర్వతంలో దిగబడిన వైనాన్ని అశరీరవాణి వివరించిందట. బ్రహ్మాండ పురాణం ప్రకారం, 'పాహి' అన్న ప్రహ్లాదుడి ప్రార్థనతో గరుడవాహనంపై ఉన్న శ్రీమన్నారాయణుడు ఒక్క ఉదుటున దిగడంతో ఆయన దివ్య చరణాలు పాతాళంలోకి దిగబడడంతో పాదదర్శనానికి అవకాశం లేదు.

తాను సాక్షాత్కరించిన వైశాఖ శుక్ల తదియ.. అక్షయ తృతీయ నాడు మాత్రమే నిజరూప దర్శనం ఉంటుందని, ఆ రోజు మినహా ఏడాది పొడవునా తొలగించిన పుట్టమట్టితో సమాన తూకంతో చందనం సమర్పించాలని స్వామి సూచించారట. నాటి నుంచి అదే సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. వైశాఖ శుద్ధ తదియ వేకువజామునకు ముందు రాత్రి 'చందనోత్తరణ' జరిపి స్వామికి విశేషణ ఆరాధన నిర్వహిస్తారు. ఆలయ సమీపంలోని 'గంగధార'తో సహస్ర కలశాభిషేకం, పంచామృత స్నానం నిర్వహించి, బంగారు గొడ్డలితో స్వామి వారిపై గల చందనాన్ని తొలగిస్తారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలకు స్వామి నిజరూప ప్రథమ దర్శనం అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. దర్శనానంతరం మళ్లీ అభిషేకం నిర్వహించి 120కిలోల పచ్చి చందనంతో అరవై రకాల వనమూలికలు, సుగంధ ద్రవ్యాలు కలిపి స్వామికి లేపనం సమర్పిస్తారు. ఇలా మరో మూడు విడతలు వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి నాడు మొత్తం 480 కిలోల చందనాన్ని సమర్పిస్తారు. శ్రావణ పూర్ణిమ నాడు మేలిముసుగు కరాళ చందన సమర్పణతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. .

ఈ క్షేత్రంలో ఐదుగురు దేవతామూర్తులు... గోవిందరాజస్వామి (ఉత్సవమూర్తి), మదనగోపాల స్వామి (శయనమూర్తి), వేణుగోపాలస్వామి (స్వప్న మూర్తి), యోగ నృసింహ (బలిమూర్తి), సుదర్శనుడు (చక్రపెరుమాళ్)కి జరిగే నిత్యార్చనను 'పంచభేరి' అంటారు. ప్రహ్లాదుడు అహోబిలంలో అర్చించి సింహగిరి చేరి ముక్తి చెందారని, అక్కడి స్వామిని సేవించిన ఫలితమే ఇక్కడా సిద్ధిస్తుందని జైమిని మహర్షి పేర్కొన్నట్లు ఐతిహ్యం.

**'గంగధార సమం తీర్థం క్షేత్రం సింహాద్రి నాసమం నారసింహ సమోదేవో త్రైలోక్యే నాస్తి నిశ్చయః'**

(సింహాద్రీశుడి సేవకోసం ఉద్భవించిన గంగధార లాంటి తీర్థం లేదు. నృసింహునికి సాటిదైవం త్రిలోకాలలోనూ లేదు. సింహాచలం లాంటి క్షేత్రం లేదని క్షేత్ర మహాత్మ్యం. రామానుజాచార్యులు, చైతన్య ప్రభువు లాంటి ఆధ్యాత్మికవేత్తలతో పాటు శ్రీకృష్ణదేవరాయలు, రెడ్డిరాజులు, చాళుక్య, చోళ రాజులు, వీరకూట పల్లవులు, వేంగి చాళుక్యులు, కోరుకొండ నాయకులు, కొప్పుల నాయకులు, నందాపుర రాజులు, గాంగులు, వడ్డాదిమాత్యులు, జంతరనాటి సురభివంశజులు, ఒడిశా గజపతులు తదితరులు దర్శించుకున్నారు. కటకం నుంచి కంచి వరకు పాలించిన అనేక మంది రాజులు, రాణులు స్వామి వారికి భూరి విరాళాలు సమర్పించుకున్నట్లు ఆలయ స్తంభాలపై, ప్రాకార గోడలపై రాతలు తెలియచెబుతాయి. ఈ ఆలయానికి విజయనగరం పూసపాటి వంశీయులు అనువంశిక ధర్మకర్తలుగా ఉన్నారు.

**సుందరాయ శుభాంగాయ మంగళాయ మహౌజసే సింహచల నివాసాయ శ్రీనృసింహాయ మంగళమ్!!**

# అమెరికాలో ట్రంప్

తమ నిర్ణయాలకు ఎదురుండదని, ఎవరూ వ్యతిరేకించకూడదని గట్టిగా భావించే వర్తమాన దేశాధినేతలైన హంగరీ ప్రధాని విక్టర్ ఆర్బన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహుల కోవకే అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా వస్తారని చెప్పవచ్చు. కానీ పై దేశాధి నేతలు తీసుకునే నిర్ణయాలకు ఒక వ్యూహం ఉంటుంది. కానీ ట్రంప్‌కు అటువంటి వ్యూహం ఏదీ ఉండదు. ఆయనకు ఎప్పటికి ఏది తోస్తే అదే వ్యూహం! ప్రొటొకాల్స్, ఇతర విధి విధానాలు పట్టవు. కానీ ఆయనలోని సానుకూల లక్షణం 'భోళాతనం', 'అవకాశా లను అనువుగా మలచుకోవడం'. కానీ నోటి దురుసు తనం వీటిని దెబ్బతీస్తోంది. ఈ కారణమే ఆయన్ను అమెరికా చరిత్రలో క్రిమినల్ కేసును ఎదుర్కొంటున్న దేశ తొలి మాజీ అధ్యక్షుడిగా మిగిలిపోయేలా చేస్తున్నది.

తనపై వచ్చిన అభియోగాల నేపథ్యంలో ట్రంప్ ఏప్రిల్ 3న ఫ్లోరిడా నుంచి న్యూయార్క్‌కు వచ్చి మాన్‌హట్టన్ డిస్ట్రిక్ట్ ఆటార్నీ ఆఫీసులో లొంగి పోయారు. ఆయనపై వచ్చిన నేరాభియోగాలను న్యాయమూర్తులు చదివి వినిపించిన తర్వాత ట్రంప్ వెంటనే వెళ్లిపోయారు. తర్వాతి విచారణ డిసెంబర్ 24న జరుగుతుంది. వాస్తవానికి హష్‌మనీ కేసును మాన్‌హట్టన్ న్యాయస్థానం గత ఐదేళ్లుగా విచారి స్తోంది. పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్ (ఈమె అసలు పేరు స్టెఫనీ క్లిఫర్డ్) బయటకు ఏమీ మాట్లాడకుండా ఉండేందుకు 2016 ఎన్నికల ముందు డొనాల్డ్ ట్రంప్ 'హష్‌మనీ' చెల్లించారన్నది ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోపణ. అయితే ఆయనపై తప్పుడు బిజినెస్ రికార్డులకు సంబంధించి 34 అభియోగాలు దాఖలయ్యాయి. కోర్టులో ఈ ఆరోపణలను ట్రంప్ అంగీకరించలేదు. 'నేను చట్టవిరుద్ధంగా ఏమీ చేయలేదు కనుక, ఇవ్వాల్సిన సమాధానం కూడా ఏమీ ఉండదు' అంటూ ఆయన సోషల్ మీడియాలో తనను తాను సమర్థించు కున్నారు. ఇప్పటివరకు ట్రంప్‌పై వచ్చిన ఆరోపణలు



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

'నేరం' కంటే దిగువస్థాయిలో ఉన్నట్టుగానే పరిగణిస్తారు. ఇకముందు మళ్లీ ఇటువంటి నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు ఎదుర్కొని, అవి రుజువైతే 'నేర'స్థాయిగా గుర్తిస్తారు. యూఎస్ చట్టాల ప్రకారం ట్రంప్ రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ విచారణ అడ్డంకి కాబోదు. ఆయన నిరాక్షే పణీయంగా అధ్యక్ష పదవికి పోటీపడవచ్చు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కోర్టులో న్యాయమూర్తులు అడిగిన ప్రశ్నలకు 'ఔను', 'కాదు' అన్న సమాధానాలు ఇచ్చి మౌనంగా ఉండిపోయినప్పటికీ, బయట మాత్రం ప్రభుత్వంపై నిప్పులు చెరగడం ఆయన సహజవైఖరికి నిదర్శనం. ఆ విధంగా చేయకపోతే విచిత్రమనుకోవాలి!

**న్యాయమూర్తులపై విమర్శలు**

ఏప్రిల్ 4న డొనాల్డ్ ట్రంప్ మన్‌హట్టన్ కోర్టుకు హాజరైనప్పుడు, బయట ఆయన అనుయాయులు నానా హంగామా సృష్టించడం న్యాయమూర్తికి చికాకు తెప్పించింది. దీంతో ఇటువంటి అశాంతిని ప్రేరేపించే చర్యలు తగదని న్యూయార్క్ కౌంటీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి మెర్చాన్ ట్రంప్‌కు హితవు పలికారు. అప్పటికి ఏమీ మాట్లాడని ట్రంప్ బయటకు వచ్చిన తర్వాత జువాన్ మెర్చాన్, అల్విన్ బ్రాగ్‌లపై అవాకులు చెవాకులు పేలారు. మెర్చాన్ కుటుంబం తనను ద్వేషిస్తున్నదని ఆరోపించడమే కాకుండా, అల్విన్ బ్రాగ్‌ను ఏకంగా ఒక జంతువు, మానసిక రోగి అంటూ నోరుపారేసుకున్నారు. దీంతో ట్రంప్ నోటికి తాళం వేయడానికి సుప్రీంకోర్టు న్యాయ మూర్తి మెర్చాన్ గాగ్ ఆర్డర్ జారీచేసే అవకాశాలు లేకపోలేదు. గాగ్ ఆర్డర్‌ను పట్టించుకోకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణిస్తారు. కోర్టుకు హాజరైన దగ్గరినుంచి ట్రంప్ దేశవ్యాప్తంగా 'రాడికల్ లెఫ్ట్' భావాలున్న ప్రాసిక్యూటర్లున్నారంటూ ప్రచారం మొదలుపెట్టారు. వీరంతా అమెరికా చట్టాలను ఉపయోగించుకొని, దేశ అంతర్గత వ్యవహారాల్లో తల దూరుస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఇందుకు పెద్దఎత్తున మద్దతు లభిస్తున్నదనడానికి ట్రంప్ ప్రచారానికి విరాళాల రూపంలో విపరీతంగా సమకూరుతున్న నిధులే తార్కాణం.

**ప్రచారానికి అడ్డంకి**

కోర్టు ఈ కేసును కొట్టేయకపోతే విచారణ 2024 జనవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మరి వచ్చే ఏడాది అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో 'ప్రైమరీల సీజన్'లో ట్రంప్ విచారణ అత్యంత కీలకం కానుంది. సరిగ్గా రిపబ్లికన్, డెమోక్రట్ పార్టీలు తమ అభ్యర్థులను నిర్ణయించే తరుణమిది. నిజానికి ఈ న్యాయవిచారణ ట్రంప్ పూర్తి సామర్థ్యంతో ప్రచారం చేసుకోవడానికి అడ్డంకిగా మారుతుందనడంలో సందేహంలేదు. అయితే ఈ విచారణ అక్రమమంటూ రిపబ్లికన్లు నానా యాగీ చేయాలనుకున్నా ట్రంప్‌పై ఉన్న మరో మూడు కేసులు పెద్ద అవరోధంగా మారనున్నాయి. 2020లో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు యత్నించారన్న అభియోగం, రాజధాని నగరంలో విధ్వంసకాండకు కారణమయ్యారని, క్లాసిఫైడ్ సమాచార నిర్వహణ విషయంలో ఎదుర్కొం



టున్న ఆరోపణలపై జరుగుతున్న విచారణలు ట్రంప్‌ను తీవ్రస్థాయిలో ఇరకాటంలో పడేయవచ్చు.

**ట్రంప్ ట్రేడ్‌మార్క్**

ఇన్ని గందరగోళాలున్నప్పటికీ, తమ నాయ కుడిపై నేరాభియోగాలను తీవ్రంగా ఖండించడంలో రిపబ్లికన్లను ఏకతాటిపైకి తీసుకొని రావడం 'ట్రంప్ ట్రేడ్‌మార్క్'కు నిదర్శనం. రాబోయే ఎన్నికల్లో అధ్యక్ష పదవి అభ్యర్థిగా ట్రంప్‌కు వ్యతిరేకంగా పోటీలో ఉన్న ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్, పారిశ్రామిక వేత్త వివేక్ రామస్వామి,సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హెలీ కూడా ఇప్పుడు ట్రంప్‌కు మద్దతుగా డెమోక్రట్లపై విరుచుకుపడుతున్న పార్టీతో పాటు ముందుకెళ్లక తప్పడంలేదు. ఆర్కాన్సాస్ రాష్ట్ర మాజీ గవర్నర్, ప్రముఖ అటార్నీ, అధ్యక్ష అభ్యర్థిగా పోటీపడుతున్న అసా హచిన్‌సన్ మాత్రం ట్రంప్‌పై

# 'మార్కు' రాజకీయాలు

కొనసాగుతున్న చట్ట ప్రక్రియకు మద్దతు పలికారు. ఓటర్లే ఎన్నికల్లో ఏది న్యాయమో తేలుస్తారని అభిప్రాయపడ్డారు. అయితే ఒక్కటి మాత్రం నిజం. ఇప్పటికీ రిపబ్లికన్ పార్టీ దిగువ శ్రేణుల్లో ట్రంప్ భావాలను సమర్థించే వర్గం చాలా బలంగా ఉంది. అందువల్ల అధ్యక్ష పదవికి పోటీ పడటంలో ఆయన లోని లోపాలు పెద్దగా అడ్డంకి కాబోవని కూడా చెప్పాలి. మరి ఈ విచారణ ప్రభావం పార్టీ దిగువ శ్రేణులపై ఏవిధంగా ఉంటుందనేది రాబోయే కొద్ది నెలల్లో తేలుతుంది. విచిత్రమేమంటే రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థికి గట్టిపోటీ ఇస్తున్న రాన్



డిసాంటిస్ కూడా 'ట్రంపిజాన్ని' మరింత ముందుకు తీసుకెళతాననే ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో ట్రంప్ విషయంలో ప్రస్తుతం కొనసాగు తున్న గందరగోళం 'తుట్టె'కు తగినంత దూరాన్ని పాటిస్తున్నారు కూడా. కానీ ట్రంప్ విచారణ పార్టీ మొత్తానికి ప్రతిష్టాత్మకంగా మారడంతో, రాన్ డిసాం టిస్‌కు ఆ దిశగా వెళ్లడం తప్ప మరో మార్గం లేదు.

**డెమోక్రట్ల మౌనం**

వ్యతిరేకమైన, అనుకూలమైనా.. ఏ అవకాశాన్నీ వదలకుండా తనకు అనుకూలంగా మలచుకునే ట్రంప్ సత్తా ముందు డెమోక్రట్లు వెనుకబడ్డారనే చెప్పాలి. ప్రస్తుతం జో బైడెన్‌తో సహా డెమోక్రట్లు ఎవ్వరూ నోరు మెదపడంలేదు. అదీకాకుండా రాబోయే ఎన్నికల్లో గట్టి పోరు ఉండబోతున్న తరుణంలో, ఈ విచారణ తమకు ఎంతమాత్రం ప్రయోజనం కలిగించబోదన్న అభిప్రాయం కూడా వారిలో వ్యక్తమవుతోంది. అదీకాకుండా 2021 ఆగస్టు తర్వాత జో బైడెన్ విషయంలో ప్రజల్లో సాను కూలత ఎంతమాత్రం పెరగలేదు. ఈ నేపథ్యంలో రెండోసారి ఆయన పదవికి ఎన్నిక కావడం ప్రశ్నార్థకమే! ప్రతినిధుల సభలో రిపబ్లికన్ల మెజారిటీ కూడా జో బైడెన్‌కు తలనొప్పిగా మారింది. దీన్ని ఆధారం చేసుకొని హంటర్ బైడెన్ (జోబైడెన్ కుమారుడు) వ్యాపారాలు, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వైదొలగడం, కొవిడ్-19 సమయంలో ప్రభుత్వ స్పందన వంటి అంశాలపై సొంత విచారణలు జరపాలన్న ఉద్దేశంతో రిపబ్లికన్లు ఉన్నారు.

**ట్రంప్ వివాదం నేపథ్యం**

స్టార్మీ డేనియల్స్ అమెరికాకు చెందిన ఒక పోర్నోగ్రఫీ నటి. ఈమె చెప్పే కథనం ప్రకారం 2006లో ట్రంప్‌ను నెవెడా రాష్ట్రంలోని ఒక సెలబ్రిటీ గోల్ఫ్ కోర్టులో కలుసుకున్నారు. అప్పట్లో ది అప్రెంటీస్ రియాలిటీ టి.వి. సీరీస్‌కు ట్రంప్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. అప్పుడు తనను ట్రంప్ 'హరాహ్ లేక్ టోరే' హోటల్ పెంట్ హౌజ్‌కు ఆహ్వానించారని, ది అప్రెంటిస్ టి.వి. సిరీస్‌లో తనను గెస్ట్‌గా చేసే విషయంలో ఇద్దరి మధ్య మాటలు జరిగాయని, అప్పుడే తామిద్దరం శారీరకంగా కలిశామని డేనియల్స్ అప్పట్లో చెప్పారు. ఇదిలా ఉండగా 2011లో ట్రంప్ తర్వాతి అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థిగా నిలబడాలన్న యత్నాల్లో ఉన్న సమయంలో డేనియల్స్ 'లైఫ్&స్టైల్' సెలబ్రిటీ మ్యాగజైన్‌కు తన కథను ఇచ్చేందుకు యత్నించింది. ఇందుకు 15 వేల డాలర్ల పారితోషికం ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. అప్పుడు లైఫ్&స్టైల్ మ్యాగజైన్ ఆమె ఇచ్చిన కథనంపై ట్రంప్ సంస్థలను అభిప్రాయం కోరగా ట్రంప్ లాయర్ మైఖేల్ కోహెన్ కోర్టులో దావావేస్తానంటూ ఆ మ్యాగజైన్‌ను హెచ్చరించడంతో అది అక్కడే ఆగిపోయింది. అటు తర్వాత అదే ఏడాది అక్టోబర్ నెలలో, డేనియల్ ఏజెంట్ గినా రోడ్రిగ్యుజ్ ఈ కథను 'ది డర్టీ' అనే పేరుతో నడిచే గాసిప్ బ్లాగ్‌కు లీక్ చేసింది. ఈ పోస్ట్‌పై ట్రంప్ లాయర్లు, డేనియల్‌లు ఫిర్యాదు చేయడంతో ఆ బ్లాగ్‌ను తొలగించింది. అయితే కథ అంతటితో ముగిసి పోలేదు. 2016 అధ్యక్ష ఎన్నికలకు ప్రచారం మొదలుకాగానే గినా రోడ్రిగ్యుజ్ ఇదే కథను మళ్లీ 'నేషనల్ ఎంక్వయిరర్'తో సహా పలు పబ్లికేషన్ సంస్థలకు అమ్మజూపింది. ట్రంప్‌కు సహాయం చేయాలన్న ఉద్దేశంతో నేషనల్ ఎంక్వయిరర్ ఈ కథను తొక్కిపట్టడానికే నిర్ణయించుకుంది. ఇందు కోసం ఆమెకు చెల్లింపులు జరపడానికి బదులు, ఆ మ్యాగజైన్ ఎడిటర్-ఇన్-చీఫ్ డైలాన్ హోవర్డ్ మధ్యవర్తిత్వం వహించి డేనియల్‌కు, ట్రంప్ లాయర్ కోహెన్‌కు మధ్య 'నాన్ డిస్క్లోజర్ అగ్రిమెంట్' పేరుతో ఒక ఒప్పందం కుదిర్చాడు. దీని ప్రకారం ఈ కథను డేనియల్ మరెక్కడా లీక్ చేయకుండా కోహెన్ ఆమెకు 1,30,000 డాలర్లు చెల్లించాలి. అయితే ఈ చెల్లింపు బాగా ఆలస్యం కావడంతో డేనియల్ లాయర్ కీత్ డేవిడ్‌సన్ 2016, అక్టోబర్‌లో రద్దు చేశాడు. దీంతో ట్రంప్ లాయర్ కోహెన్ ఈ కథనం బయట కొస్తుందని భయపడి 'హోమ్ ఈక్విటీ లైన్ ఆఫ్ క్రెడిట్' కింద రుణం తీసుకొని, డెలావెర్‌లో ఒక షెల్ కంపెనీ పేరుమీద డేనియల్‌కు ఆ మొత్తం చెల్లించాడు. ఈ చెల్లింపు విషయం తనకు తెలియదనేది ట్రంప్ వాదన. ఈ హష్‌మనీపై తర్వాత చెలరేగిన దుమా రమే ఇప్పుడు ట్రంప్‌ను కోర్టుదాకా తీసుకెళ్లింది.

**మరోకేసులో ట్రంప్‌కు అనుకూల తీర్పు**

ఒక పక్క ట్రంప్ మాన్‌హట్టన్ డిస్ట్రిక్ట్ అటార్నీ కోర్టులో డెనియల్‌కు హష్‌మనీ చెల్లించారన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటుండగా, ఇదే డేనియల్ వేసిన మరో కేసుకు సంబంధించి లాస్ ఏంజిలిస్‌లో ఒక జడ్జి, ట్రంప్‌కు అనుకూల తీర్పు చెప్పడం విశేషం. నిజానికి ఈ కేసుకు, న్యూయార్క్‌లో ట్రంప్ ఎదుర్కొంటున్న కేసుకు సంబంధం లేదు. డేనియల్ 2018లో డొనాల్డ్ ట్రంప్‌పై పరువునష్టం దావా వేసింది. ట్రంప్ స్టోరీ విషయంలో ఏమీ మాట్లాడవద్దంటూ తనను 2011లో ఒక అపరిచిత వ్యక్తి ట్విట్టర్‌లో బెదిరించాడన్నది ఈ కేసు సారాంశం. అయితే ఇదంతా బోగస్ అని ట్రంప్ కోర్టులో తన వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 4న నైన్త్ సర్క్యూట్ యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు చెబుతూ పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియల్స్ లీగల్ ఫీజుల కింద ట్రంప్ అటార్నీకి 121,972 డాలర్లు చెల్లించాలని తీర్పు చెప్పింది.

**ఉపసంహారం**

తనపై జరుగుతున్న విచారణను ట్రంప్ ప్రధాన ప్రచారాస్త్రంగా మలచుకుంటారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ పరిణామాలన్నీ, అమెరికాలో ప్రస్తుతం న్యాయ, రాజకీయ విచిత్ర 'సమ్మిళిత' పరిస్థితిని ప్రపంచం అచ్చెరువుతో గమనిస్తోంది. ఇదే సమయంలో అమెరికా రాజకీయ వ్యవస్థ, సంస్థాగత నిర్మాణం వంటి అంశాలపై కూడా మొదటిసారి ప్రపంచ సమాజం దృష్టి కేంద్రీకరించే పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర దేశాల ప్రజాస్వామ్యాలపై ఎప్పటికప్పుడు తీర్పులు చెప్పే అమెరికా గురివిందతనాన్ని ప్రస్తుత రాజకీయులు ప్రస్ఫుటం చేస్తున్నాయి. ★

భరతావని ధర్మభూమి, కర్మభూమి. ధర్మాను సారం కర్మలను ఆచరించడం భారతీయ సంస్కృతి. ధర్మబద్ధంగా ఆచరించవలసిన కర్మలను మన రుషులు శాస్త్రాధారంగా నిర్దే శించారు. పుష్కర సంస్కార విధులు అందులో భాగమే. పుష్కరమంటే ఏదైనా జీవనదికి పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పండుగ లాంటిదని ఆధునిక కాలంలో నిర్వచిస్తున్నారు. పుష్కరం అంటే 'పుణ్య జలం' అనే అర్థం ఉంది. మనిషికి పుష్టినిచ్చే వాటిలో నీరు ('పోషయతీతి పుష్కరం) ఒకటి. బాహ్యా, అంతఃశుద్ధికీ నీటిని వినియోగిస్తారు. గురు గ్రహం ఒక్కొక్క రాశిలో ప్రవేశించడం వల్ల ఆయా నదులకు పుష్కరాలు వస్తాయి. అలా, గురు గ్రహం ఈ ఏడాది (శ్రీ శోభకృత్) మేషరాశిలో ప్రవేశించడంతో గంగానదికి పుష్కరాలు (ఏప్రిల్ 22న) మొదలవుతాయి. ఆ గ్రహం పన్నెండో రాశి మీనంలో ప్రవేశించ డంతో గంగా పుష్కరం పూర్తి అవుతుంది. ఈ కాలంలో గంగానది స్నానంతో సకల తీర్థాలలో స్నానమాడిన ఫలితం దక్కుతుందని విశ్వాసం. అంతటి పరమ పావని గంగానది వ్యర్థాలతో, మానవ తప్పిదాలతో కలుషితమవుతోంది. దాని పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజా సహకారమూ అవసరమే.



# ఏప్రిల్ 22 నుంచి గంగా పుష్కరాలు



# పావన

పుష్కరుడు అంటే పుణ్యజలమనీ అర్థం చెబుతారు. అంటే ఆయన నివాసం ఉన్నంత కాలంలో ఆయా నదులను మరింత పుణ్యదాయిను లుగా భావిస్తారు. గురు (బృహస్పతి) గ్రహం ఏడాదికి ఒక రాశి వంతున పన్నెండు రాశులను పన్నెండేళ్లలో చుట్టి వస్తుంది. అలా ఒక్కొక్క రాశిలో ప్రవేశించి నప్పుడు ఆ నదికి మహత్త్వం కలుగుతుందంటారు.

పుష్కారాల ఆవిర్భావ నేపథ్యాన్ని స్మరించు కుంటే–తుందిలుడు అనే గంధర్వుడు ఘోరతపస్సుతో పరమేశ్వరుడిని మెప్పించాడు. పుష్కరుడు అనే పేరుతో, ప్రత్యేకించి మూడున్నర కోట్ల తీర్థాలకు ఆధిపత్యం (చక్రవర్తిత్వం) వరం పొందాడు. శివుడి ఆదేశం మేరకు విధాత కమండలంలో ప్రవేశించాడు. కాగా, సకల జీవరాశిని పునీతం చేసేందుకు, తనకు పుష్కర స్పర్శ అవసరమని, పుష్కరుని తన వెంట పంపాలని బృహస్పతి అర్థించాడు. అలా గురుగ్రహం ఒక నది నుంచి మరో నదికి మారేటప్పుడు పన్నెండు రోజులు, ఏడాది చివర మరో నదికి మారేటప్పుడు పన్నెండు రోజులు పుష్కరుడు ఆయనను అనుసరించి ఉంటాడు. ఏడాదిలో మిగిలిన రోజులలో ప్రతిదినం మధ్యాహ్నం రెండు ముహూర్తముల (నాలుగు గడియలు) సమయం మాత్రమే బృహస్పతితో ఉండి, మిగతా కాలమంతా బ్రహ్మ కమండంలో ఉంటాడు. అలా బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్క నదికి పుష్కరాలు వస్తుంటాయి.

*'మేషే గంగా వృషే రేవా మిథునేచ సరస్వతీ!*
*కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా!!*
*కన్యాయాం కృష్ణవేణీ చ కావేరీ ఘటకే స్మృతా!*
*వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కర వాహినీ!!*
*మకరే తుంగభద్రా చ కుంభే సింధునదీ స్మృతా!*
*మీనే ప్రణీతా చ నదీ గురోస్సంక్రమణే స్మృతా!!'*

మేషంలో (గంగ), వృషభం (రేవ), మిథునం (సరస్వతి), కర్కాటకం (యమున), సింహం (గోదావరి), కన్య (కృష్ణా), తుల (కావేరి), వృశ్చికం (భీమారథీ), ధనుస్సు (బ్రహ్మపుత్ర), మకరం (తుంగభద్ర), కుంభం (సింధు), మీనం (ప్రాణహిత) ఇలా పుష్కరాలు వస్తుంటాయి. పుష్కరుడితో పాటే సమస్త దేవతలు, రుషులు, ఇతర నదీమ దేవతలు, పితృదేవతలు నదిలో ప్రవేశిస్తారని, పుష్కరాల విశిష్టతకు అదీ ఒక కారణమని చెబుతారు.

నీటిలో రెండు శక్తులున్నాయని వేదం చెబుతోంది. దాహార్తిని తీర్చడం, శుభ్రపరచడం అనే రెండు బాహ్యశక్తులైతే; మేధ్యం, మార్జనం అనే శక్తులు అంతర్గతంగా ఉన్నాయని వివరిస్తోంది. మేధ్యం అంటే నదిలో స్నానం చేసి మూడుసార్లు మునక వేస్తే తెలిసీ తెలియక చేసే పాపాలు పోతాయని, 'మార్జన' అంటే నీటిని చల్లుకోవడం అంటే సంప్రోక్షణ చేయడం అని, దీని వలన ద్రవ్య శుద్ధి జరుగుతుందని పురాణాల వర్ణన. నీరు నారాయణ స్వరూపం కనుక స్నాన ప్రక్రియలో ఆయన స్పర్శతో పాపాలు పటాపంచలు అవుతాయని విశ్వసిస్తారు.

**పరమ పావని గంగ**

శివుని శిరస్సు నుంచి భువికి జాలువారిన పరమ పావనం, శుభప్రదమైన గంగానదికి హిందూ మతంలో గల ప్రాధాన్యం తెలిసిందే. 'పరమపావని, గంగమ్మతల్లి, పావనగంగ, గంగాభవాని' అనీ ఈ నదిని స్మరించు కుంటారు. ఇందులో ఒక్కమారు స్నానం చేస్తే జన్మ జన్మల పాపాల నుంచి విముక్తి లభిస్తుందని, ఈ నదీ జలాన్ని చిన్న పాత్రలో ఇంటిలో ఉంచుకోవడం శుభప్రదంగా భావిస్తారు. 'నీరు' అన్న పదానికి సంస్కృతంలో 'గంగ' అన్న పదాన్ని వాడుతారు. గంగ అనేది నదీ నామమే కాదు. అది దాహం/దప్పిక/నీరుకు పర్యాయపదాలు. ఆయా నదులు, ఇతర జలవనరుల పేర్లు వేరైనా వాటిలోని నీటిని 'గంగ' అని సంభావించడంలోనే దీని ఉన్నతి అవగతమవు తోంది. ఎక్కడో హిమాలయాలలో పుట్టిన 'గంగ' పేరునే దక్షిణాపథంలోని చిట్టచివరి నదికీ అన్వయించి చెప్పడంలో దాని ప్రత్యేకత తెలుస్తోంది. భారతీయులు నిత్యం ప్రాతఃకాలంలో, పూజాది సంకల్పంలో చెప్పుకునే 'గంగేచ యమునే కృష్ణే గోదావరీ సరస్వతీ...'శ్లోకం గంగతోనే ప్రారంభమవుతుంది.

వామనావతార సమయంలో శ్రీమహావిష్ణువు రెండవ అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించినప్పుడు ఆయన కాలివేళ్ల తాకిడికి అకాశానికి రంధ్రమేర్పడి దాని నుంచి స్రవించిన జలమే సురనదిగా మారిందని, బ్రహ్మ తన కమండలం లోని జలంతో త్రివిక్రముడి (వామనుడి) పాదాన్ని కడగడంతో ఆ జలం మరింత పవిత్రమై 'ఆకాశగంగ'గా పరిణమించిందని వామన పురాణం చెబుతోంది. విష్ణు పాదాల నుంచి ప్రవహించినందున దీనికి 'విష్ణునది' అనే పేరు వచ్చింది. తన తాత, ముత్తాతలకు ఉత్తమ గతులు అనుగ్రహించాలని కోరుతూ ఇక్ష్వాక వంశీయుడు భగీరథుడు గంగ కోసం తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన గంగ 'దివి నుంచి భువికి దిగే వేళ నా ఉధృతిని, వేగాన్ని భరించగల వారెవ్వరు?' అని అడిగింది. భగీరథుడు శివుని కోసం తపస్సు చేయగా, అనుగ్రహించిన ఆయన దివిజ గంగ



# గంగకు పుష్కర శోభ



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

భువికి జాలువారుతుండగా తన శిరస్సున ధరించి, భరించి జటాజూటంలో బంధించాడు. భగీరథుని ప్రార్థనతో ఒక పాయను నేలపైకి వదలాడు. అది భగీరథుని వెంట పరుగులు తీస్తూ, దారిలో జహ్నుముని ఆశ్రమాన్ని ముంచెత్తి, “జాహ్నవి” అయ్యింది. ఆపై సాగరంలో ప్రవేశించి, పాతాళానికి చేరి, సగర పుత్రులకు ఉత్తమ గతులను కలుగజేసింది. ఈ గంగోత్పత్తి గురించిన గాథలు ఆ నది అతిపునీతం అన్న విశ్వాసాన్ని ప్రోది చేసేవే..!

మంచుకొండలలోని గల్‌దాల్ ప్రాంతంలో పుట్టి సాగరగర్భం చేరేంత వరకు సుమారు రెండున్నర వేల కిలోమీటర్లు ప్రవహించే ఈ నదికి అమృత, భాగీరథి, జాహ్నవి, మందాకిని, భీష్మసూ, త్రిపథ, నంది, నళిని, సుద, దక్షపుత్రి, విహగ, విశ్వకాయ, విద్యాధరి, విశ్వ ప్రసాదిని, క్షేమ, శాంతిప్రదాయిని, శివ, సుప్రశాంత అని నామాంతరాలు ఉన్నాయి. దేవలోకంలో ఉండడం వల్ల ‘సుర’ (నిమ్న) నది అని, ఆకాశంలో ప్రవహించినందున ‘ఆకాశగంగ / వియద్గంగ’ అని, భూలోకంలో “గంగ” లేదా “అలకనంద”గా, పాతాళంలో “భోగవతి”గా మూడు లోకాల్లో ప్రహించినందున ‘త్రిపథగ’ అంటారు. కశ్యప మహర్షి తపో ప్రభావంతో భువికి వచ్చినందున ‘కశ్యపి ’అని, వ్యవహరిస్తున్నారు.

**పుష్కర స్నాన విధివిధానాలు**

పుష్కరాల సమయంలో నదీస్నానం చేయడంతో పాటు నదీ తీరంలోని ఆలయాల సందర్శన ఆనవాయితీగా వస్తోంది. గంగానదీ తీరంలో గంగోత్రి, కేదార్‌నాథ్, గౌరీకుండ్, బదరీనాథ్, బ్రహ్మకపాలం, త్రివేణీ సంగమం, హరిద్వార్, కనఖలీ, హృషికేశ్, ప్రయాగ, వారణాసి, దేవప్రయాగ, హృషీకేశ్, కేశవ ప్రయాగ, కర్ణప్రయాగ, మాన్సాదేవి, జ్వాలాపురం, పాండుకేశ్వర్, హనుమాన్ చట్టి వంటి క్షేత్రాలు ఉన్నాయి

**‘జన్మప్రభృతి యత్పాతం స్త్రియావా పురుషైనవా**
**పుష్కరేత్ స్నాన మాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి’..**
పుట్టినప్పటి నుంచి సంక్రమించే పాపాలు తొలగిపోవాలంటే పుష్కర సమయంలో నదీస్నానం చేయాలని శాస్త్రం చెబుతోంది. నదీస్నానం... ప్రధానంగా పుష్కర స్నాన సమయంలో పాటించవలసిన క్రమశిక్షణను, విధి నిషేధాలను శాస్త్రం నిర్దుష్టంగా చెప్పింది. పుణ్యస్నానం అంటే మునకలు వేయడమే కానీ ఈతగొట్టడం, జలకాలాటలు కాదు. నీటిలో ఉమ్మకూడదు. పాదరక్షలతో నీటిలో దిగకూడదు. మలమూత్ర విసర్జన చేయకూడదు. వస్త్రాలను శుభ్రపరచకూడదు. నిద్రా సమయంలో ధరించిన దుస్తులతో కాకుండా శుభ్రమైన వస్త్రాలను ధరించి స్నానం చేయాలి. పుష్కర స్నానం వేళ **‘శంనో దేవీరభీష్టయ ఆపోభవంతు పీతయే/శంయోరభి స్రవస్తునః’** (దివ్యములైన ఈ జలాలు మంగళ కరములై మా అభీష్టములను నెరవేర్చుగాక! తాగేందుకు అనువైన నీటిని ఇచ్చుగాక! నీరు మా వైపు ప్రవహించుగాక) అని రుషిప్రోక్తమైన జలదేవతా ప్రార్థన చేస్తారు.

ఒడ్డున ఉన్న మృత్తికను (మట్టిని) లేదా పసుపును తీసుకొని నీటిలో వదిలిన తరువాతే స్నానమాచరించాలి. శాస్త్రానుసారం జపం, హోమం, అర్చన, దానాలు చేస్తారు. భగవత్ కృపాపాత్రులు కావాలంటే ముందుగా పితృదేవతల అనుగ్రహం, ఆశీస్సులు కావాలని పెద్దలు చెబుతారు. కనుక పితృతర్పణం వంటివి చేయాలి.

**పుష్కరం వెనుక సామాజిక లబ్ధి**

పుష్కరాలను కేవలం ఆధ్యాత్మికంగానే కాక సామాజిక కోణంలో అధ్యయనం చేస్తే అనేక ఆసక్తికర అంశాలు వెల్లడవుతాయి. ఉదాహరణకు, నదుల బాగోగులు, పర్యావరణం, పరిశుభ్రతలను కాపాడుకునేందుకు పుష్కరాలను ఒక అవకాశంగా భావిస్తారు. నదీతీరంలో ఎక్కడెక్కడ కోత పడుతోంది? ఎక్కడెక్కడ వృక్ష వినాశనంతో పచ్చదనం లోపిస్తోంది. ఏయే ప్రాంతంలో కలుషితమవుతోంది? లాంటి విషయాలను అధ్యయనం చేసి ఆయా సమస్యల పరిష్కారానికి, నదుల బాగోగులకు చర్యలు చేపట్టేందుకు పుష్కరాలు ఒక కారణమని ప్రఖ్యాత ప్రవచనకర్త, మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు ఒక సందర్భంలో వ్యాఖ్యాన సహిత వివరణ ఇవ్వడం గమనార్హం.

**పావన నదికి కాలుష్య బెడద**

దేశ జనాభాలో దాదాపు 40 శాతానికి, 11 రాష్ట్రాలకు నీరు అందిస్తున్న దేశంలోని అతిపెద్ద నది గంగ కాలుష్య బెడదను ఎదుర్కొంటూ , పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత కలుషిత నదులలో ఐదవ స్థానంలో నిలిచినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. నది వెంట గల ప్రాంతాల నుంచి మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు నదిలోకి ప్రవహించడంతో నీరు కలుషితమవుతోంది. రోజూ సగటున కనీసం మూడువేల మిలియన్ లీటర్ల మురుగునీరు గంగలో కలుస్తోందని, అదే సమయంలో అందుబాటులో గల మౌలిక సదుపాయాలతో అందులో మూడవ వంతు నీటిని మాత్రమే శుద్ధి చేయగలుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గంగానది వెంట ఘాట్‌లలో మృతదేహాలకు అంతిమ సంస్కారం తరువాత చితాభస్మాన్ని నదిలో కలపడం, పూర్తిగా దహనం కాకుండానే మృతదేహాలను నదిలో వదలడం, నది ఒడ్డున బహిరంగ మలవిసర్జన, మురికి దుస్తులు శుభ్రం చేయడం వంటివి ఈ నదీ జలకాలుష్య కారకాలుగా చెబుతున్నారు

**నమామి గంగే...**

ఈ పరిస్థితిని చక్కదిద్ది నదిలో కాలుష్యాన్ని సమర్థంగా తగ్గించడం, నదీ పరిరక్షణ, పునరుజ్జీవనం ప్రధాన లక్ష్యాలుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో ‘నమామి గంగే’ ప్రాజెక్టును ప్రకటించింది. ఆ ఏడాది కేంద్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలను ప్రాథమికంగా ప్రత్యేకించింది. గంగా పునరుజ్జీవనం కార్యక్రమం కింద ఐదు రాష్ట్రాలలోని (ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్) ఉప నదుల వెంట అడవుల పెంపకం చేపట్టారు. డెహ్రాడూన్‌లోని అటవీ పరిశోధన సంస్థ (ఎఫ్ఆర్ఐ) ‘గంగా ఫారెస్ట్రీ ఇంటర్వెన్షన్స్’ ప్రాజెక్టును రూపొందించగా, దాని అమలుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. అంతకు ముందు గంగా నదిని కాలుష్య బారినుంచి కాపాడుకునేందుకు ఆందోళనలు సాగాయి. ప్రభుత్వ చర్యలకు ప్రజా సహకారంతో తోడైతేనే ఏ ప్రణాళికైనా సత్ఫలితాన్నిస్తుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

శాస్త్రీయ సంగీతం మన జాతి సంపద. అది నిత్యనూతనం, సత్య సనాతనం. వేదమంత్ర ప్రపూర్ణం, ప్రవర్ధితం. చతుర్వేదాల్లో ఒకటైన సామవేదం పేరుకు తగినట్లు మధురాతి మధురం. సామవేదంలోని వందలాది మంత్రాలకు విలక్షణ ఛందస్సు ఒకటుంది. దీని ఉచ్చారణ విధానమూ ప్రత్యేకంగా ఉంటుంది. ఇదే వేద సంహిత శాఖలు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల్లో మరింత ప్రాచుర్యాన్ని సంతరించుకున్నాయి. భారతీయ శాస్త్ర సంగీత సంప్రదాయాలన్నింటిలోనూ 'హిందుస్థానీ' అత్యంత విశేషమైనది. ఇదంతా సాంస్కృతిక, కళారంగాలతో ఎంతెంతో ప్రభావితం. వేదపద్ధతులు ఆధ్యాత్మిక, మానసిక దోహదకారకాలైతే; రాగ, తాళభరిత సంపూర్ణ ఉత్తేజకారకం హిందూస్థానీ ప్రక్రియ. అసలు సంగీతమన్నదే హిందూ సంస్కృతికి ప్రధాన అలంకారంగా వర్ధిల్లుతోంది. ఈ విశిష్టతల నేపథ్యంలో, మనందరి హృదయాల్లో నిలిచే సంప్రదాయ సంగీత గాత్ర కళాకారిణుల్లో సాటిలేని మేటి అంజనీబాయి.



గోవా ప్రాంతంలో పుట్టి పెరిగిన అంజనీది సంగీత కుటుంబం. ఇదే ఏప్రిల్ 22వ తేదీ – ఆమె జయంతి ఉత్సవం. తొమ్మిది పదులకు పైగా జీవితకాలం. ఎనిమిదో ఏట నుంచే సంగీత శిక్షణ పొంది, పదహారేళ్ల ప్రాయం నుంచే వేదికలపై ప్రదర్శనలిచ్చారు. అటు ఆస్థానాల్లో, ఇటు బహిరంగ ప్రదేశాల్లో కచేరీల నిర్వహణ. అందుకే ఆమె శ్రోతల హృదయాస్థాన కళావేత్తగా ఇప్పటికీ నీరాజనాలందు కుంటున్నారు. ఆమె జీవన ప్రస్థానాన్ని సందర్భానుసారం అవలోకిస్తే...

కొంకణి భాషతో వీనుల విందు చేసే ప్రాంతం గోవా. ఈ కొంకణ తీరానికి సరిహద్దుల్లోనే కర్ణాటక, మహారాష్ట్రలున్నాయి. గోవాలో ఒకప్పుడు పోర్చుగీసుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. అనంతర కాలపరిణామాల్లో భారతీయ ప్రాంతంగా వెలుగు లీనింది. ఎవరైనా సరే, గోవా పేరు వినగానే రెండు విశిష్టతలను గుర్తుకు తెచ్చుకుంటారు. ఒకటి – అటవీసంపద. మరొకటి – కట్టడాల కోట. పర్యాటక కేంద్రంగా గొప్ప పేరున్న గోవా నిజానికి సంగీత రసతరంగిణి. అందులోనే అశేష జనావళిని ఓలలాడించిన అంజనీబాయి మాల్పేకర్ స్వస్థలం మాల్పే. సంగీత గురువు నజీర్‌ఖాన్ అయితే, ఆ కళాకారిణి అనుసరించిన శైలి భెండి బజార్‌కు సంబంధించిన గాన రీతి. తనది గోవా అయినా; సంగీత జీవితం, నివాసం సమస్త ముంబయిలోనే! ప్రభావిత పరచిన భాగ్యవతి ఆమె మాతృమూర్తి నబుబాయి. ఇంటా బయటా ఎంతో అభ్యసించానని; ఆ కళను అక్కడికే పరిమితం చేయకుండా అంతటా విస్తరించగలిగానని వినమ్రంగా ప్రకటించుకున్నారు.

**అనుభవాలతో రాటుదేలి...**

అంతా ఒకే విధంగా కొనసాగితే, అది జీవితం ఎందుకవుతుంది? గురు సన్నిధిలో నేర్చుకున్న సంగీత విద్యను విస్తృత ప్రాచుర్యానికి తెచ్చిన అంజనీ ఆయన హఠాత్తు అస్తమయంతో ఎంతగానో దిగ్భ్రాంతి చెందారు. అదే మానసిక

# గాయనీమణి.... శిక్షక రమణి 'అంజని'



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

స్థితిలో చాలాకాలం అలాగే ఉండిపోయారు. నిరాశ ఆవరించిన స్థితిలో కొంతకాలంపాటు వేదికల ప్రదర్శనలకు తనకు తానుగా దూరమయ్యారు. 'వేదన కొనసాగాల్సిందేనా' అనిపించిన తరుణంలో, తనకు నాలుగుపదుల ప్రాయంలో పూర్తిగా శిక్షణకే అంకితమయ్యారు. కిశోరీ అమోంకర్‌ను హిందుస్థానీలోనే అద్భుతంగా తీర్చిదిద్దారు. శిష్యురాలు కిశోరీ జీవితకాలమూ గురుకాలంతో సమానమే. ఇంకా ఎందరెందరినో తీర్చిదిద్ది సంగీత ప్రపంచానికి ఎనలేని సేవ చేసిన సుప్రసిద్ధత అంజనీకే దక్కుతుంది. ఈమె జీవితయాత్రలో వేరొక ప్రత్యేకతనీ తప్పనిసరిగా ప్రస్తావించుకోవాలి. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఇచ్చే ఫెలోషిప్‌ను అందుకున్న ప్రథమ మహిళ ఆమె. అప్పటికి తనకు డెబ్భయ్ ఐదు సంవత్సరాలు! అకాడమీ భారత ప్రభుత్వంలోని విద్యామంత్రిత్వ శాఖకు చెందింది. అలనాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా ప్రారంభమైన వ్యవస్థ. సంగీత ప్రాధాన్యం, నాటక సమాజాలకు సహకారం, కళాకారులకు అన్నివిధాలా ఉపకారం, కళాపరిషత్తులతో ప్రోత్సాహకల్పన వంటి బాధ్యత లెన్నో ఉన్నాయి. సంగీతానికి వన్నె తెచ్చినందుకే ఇంతటి ప్రోత్సాహకమని అకాడమీ నిర్వాహకులు ఆనాడే అంజనీబాయిని ప్రశంసించారు.

**స్వరరాగ సుందరి**

గాత్రంతో పాటు రూపంలోనూ మిన్న ఆమె. ఎంతటి సౌందర్యం అంటే, సాక్షాత్తు రవివర్మ చేతుల్లో కళాకృతిగా వెలిగేంత! భారతీయ చిత్రకళా చరిత్రలో ఆయన ప్రశస్తి అందరికీ విదితమే. అంతటి ఆ ప్రముఖ సృజనకారుడే ఆ రోజుల్లో అంజనీని సరిపోల్చే చిత్రాన్ని రచించి కళాప్రపంచాన్ని ముగ్ధుల్ని చేశారు. చంద్రకాంతిలో చందన శిల్పంలా భావిస్తూ ఆవిష్కరించిన ఆ చిత్రరాజం నేటికీ అనేకమందిని మైమరపింపచేస్తోంది. కళాహృదయాల్లో ఇంకా డోలికలూగిస్తూనే ఉంది. తనదైన శైలిలో సంగీత శిక్షణ సాగిస్తూ వచ్చిన ఆ కళామయి శ్రుతి, లయలు అసాధారణంగా ఉండేవి. కానీ విధి బలీయం అన్నట్లు పలువిధాల సమస్యలూ ఆమెను చుట్టు ముట్టాయి. కళ అనేది మనో సంస్కారంతో ముడివడి ఉంటుంది.


ప్రదర్శనలు ప్రతిభ కనబరుస్తారు. ఆస్వాదకులు మానసిక పరిణతి చూపితేనే గుర్తింపు, గౌరవాలు అందించినట్లు. అలా కాని సందర్భాలు సర్వ సహజంగా ఏ కళాకారుడు/ కళాకారిణినైనా గాయపరుస్తాయి. అటువంటి గాయం అంజనీకి సైతం తప్పలేదు. పర్యవసానంగా, సంవత్సరంపాటు ఆమె గానం ఎక్కడా వినిపించ లేదు!! అప్పుడు ఆ మహిళామణి వయసెంతో ఊహించగలరా? కేవలం 21 ఏళ్ళు. తదుపరి పరిణామాలు కోలుకునేలా చేశాయి. మళ్లీ స్వరం సవరించుకున్నారామె!

**తనకు తానే అండదండ**

ముంబయ్ పురమందిరంలో ఇచ్చిందే ఆమె తుది సంగీత ప్రదర్శన. తనకి 45 ఏళ్లప్పుడు భర్తను కోల్పోయారు అంజనీ. వాణిజ్య రంగంలో ఉన్న ఆయన అనుకోని రీతిలో ఆర్థిక కడగండ్లు పాలయ్యారు. ప్రాణమూ కోల్పోవడంతో, ఆమె ఉక్కిరిబిక్కిరై పూర్తి నిస్సహాయ స్థితికి చేరుకున్నారు. రుణభారం తీర్చేందుకు కుటుంబ ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చింది. మరో విశేషాంశం ఏమిటంటే, అన్ని కష్టనష్టాలనీ భరిస్తున్నకొద్దీ మానసికంగా ఆమె బలోపేతం కావడం! మొదట్లో అసహాయంగా మిగిలినా, చివరికి తనకు తానే ధైర్యాన్ని కూడబట్టుకున్నారు. శిక్షణ ఇవ్వడంతో, ప్రశాంతతను సొంతం చేసుకున్నారు. చలనచిత్ర గాన సామ్రాజ్ఞి లతామంగేష్కర్ సైతం అంజనీబాయి శిష్యురాలే.

**సాహసికురాలు**

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నా; పడిపోయిన ప్రతీసారీ పైకి లేచి శభాష్ అనిపించుకున్నారామె. తాత వాసుదేవ్ మాటల్ని ఎన్నోసార్లు గుర్తు చేసుకునేవారు. 'ఎవరికి ఎవరూ ప్రేరణ ఇవ్వరు. ఎదురు చూశారు కదా అని, ఏ ఒక్కరూ ఆదుకునేందుకు రారు. సహానుభూతి ఉంటుందేమోకానీ, శాశ్వత సహకారాన్ని ఎక్కడి నుంచీ ఆశించకూడదు మనం. మనకు మనమే దిటవు తెచ్చుకుని, ధైర్యాన్ని కలిగించుకుని, ముంద డుగువేస్తే సరి. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా మనల్ని శాశ్వతంగా బంధించలేవు. విముక్తులం కావాల్సిందే మనమే. అందుకోసం అటు ఇటు చూసినంత మాత్రాన పెద్దగా ఒరిగేదేమీ ఉండదు' ఆ మాటలే కుడి ఎడమలు బాసటగా నిలిచి, అంజనీబాయిని సాహసికురాల్ని చేశాయి. సంగీత చరిత్రలో ఆమె కంటూ ఓ అధ్యాయాన్ని కేటాయిం చాయి. గాయనీమణి, శిక్షక రమణి... రెండు పాత్రల్లోనూ ఒదిగిన వనితా జ్యోతి అంజనీ. ★






# నిజాం జైళ్లు యమపు

అక్బర్ సంస్థానంలో జరిగిన ఒక సంఘటన గురించి ఓ పార్సీ కవి ఇలా చెప్పాడు. ఒకనాడు అర్ధరాత్రి యముడు దేవుడింటికి వెళ్లాడు. 'ఇంత రాత్రి వచ్చావేమిటి' అని దేవుడు అడిగాడు. 'అక్బర్ చక్రవర్తి వద్ద గల రాజవైద్యుడు – జలాల్, అంతు లేకుండా రోగుల్ని చంపుతున్నాడు. నేను ఒక్కణ్ణి చంపితే అతడు వేయిమందిని చంపుతున్నాడు. యమ పదవి నుంచి నన్నైనా తొలగించండి, లేదా అతనికైనా కట్టబెట్టండి' అని మొర పెట్టుకున్నాడు. నిజామాబాద్ జైలు డాక్టరును గురించి అనుకున్నప్పుడల్లా జలాల్ జ్ఞాపకం వస్తాడు అని దాశరథి వాపోయారు.

దాశరథికి నిజామాబాద్ జైల్లో జబ్బు చేసింది. ఉడికీ ఉడకని జొన్న రొట్టెలు రెండు, ఒక చిప్ప నిండా పప్పుచారు (దో రోటీ – బుర్రాభర్ దాల్). రొట్టెలలో సిమ్మెంటు, సున్నం కలిపేవారు. వారానికి ఒక పూట వరి అన్నం. దాన్నిండా వడ్ల గింజలు. ఆ గింజలన్నిటిని ఏరిపారేశాక నాలుగు ముద్దలైన అన్నం మిగిలేది కాదు. దాశరథి డాక్టరుకు తన అనుభవాన్ని ఇలా రాశారు.

'భారత ప్రభుత్వం వారు నిజాం రాష్ట్రంలోకి మందులు రానివ్వడం లేదు. దవాఖానాలో మందులు లేవు. 'దవా నహీ దువాకరో' (మందుల్లేవు, దేవుణ్ణి ప్రార్థించుకోండి) అనేవాడు డాక్టరు. మొత్తం జైలుకు ఒక్కడే డాక్టరు. పూర్వం నైజాంసైన్యంలో పని చేశా డట. చాలా క్రమశిక్షణ గల వ్యక్తిగా నటించే వాడు. జబ్బుతో వచ్చినవాణ్ణి తిట్టి, హడలుగొట్టి, దుస్తులన్నీ విప్పించి కూర్చోబెట్టేవాడు, తలనొప్పి వస్తున్నా షర్టు, చడ్డీ విప్పాల్సిందే.

తలనొప్పి వచ్చిన వాడు ఎందుకు బట్టలు విప్పాలి అడిగాడట ఖైదీ, 'నీకు శరీర శాస్త్రం తెలుసా? అని ప్రశ్నించేవాడు'. తెలియదు అని చెప్పగానే 'అయితే వినండి. తలనొప్పి కదా? తల మెడమీద, మెడ భుజాల మీద ఉంటుంది, భుజాలు శరీరానికి అంటుకొని ఉంటాయి. శరీరం కాళ్ల మీద అతుక్కొని ఉంటుంది. కనుక తలనొప్పి రోగిని నఖశిఖ పర్యంతం పరీక్షించాల్సి ఉంటుంది. ఏ కారణం చేతనైనా తలనొప్పి రావచ్చును. నేను సైనిక వైద్యుణ్ణి, మేము రోగిని నగ్నంగానే పరీక్షిస్తాం. ఇష్టమైతే పరీక్ష చేయించుకోండి లేకపోతే పొండి' అనే వాడు. విధి లేక నగ్నంగానే కూర్చునేవారు. ఒకరోజు డాక్టర్‌కు టెలిగ్రాం ఇవ్వడానికి తపాలా బంట్రోతు వచ్చాడు. అతనూ రోగే అనుకొని "కప్డే చోడ్ కర్ బైఠో (బట్టలు విప్పి కూర్చో) అన్నాడు.

మారు మాట్లాడ నివ్వడు. గత్యంతరం లేక గుడ్డలు విప్పి కూర్చున్నాడు టెలిగ్రాం తెచ్చిన వాడు. 'ఏమిటి జబ్బు' అని అడిగాడు డాక్టరు. 'నాకు జబ్బు లేదండీ! నేను ఖైదీని కాను. మీకు టెలిగ్రాం తెచ్చాను' అన్నాడు. నగ్నంగా నుంచుని కోపంతో టెలిగ్రాం లాక్కుని బట్టలు తొడుక్కోవడానికి అనుమతి ఇచ్చి పంపించేశాడు డాక్టరు. అతను కన్నీరు పెట్టుకుంటూ, సిగ్గుపడుతూ రోగుల వైపు చూస్తూ ఖాకీ బట్టలు వేసుకుని వెళ్లిపోయాడు.

దాశరథికి జ్వరం ఎక్కువైంది. చికిత్స లేదు, తిండీలేదు. రక్త విరేచనాలు. మిత్రులు చుట్టూ చేరి "నాయన క్షమాపణ రాసిచ్చి ఇంటికి పో బతికి వుంటే బలుసాకు తినవచ్చు" అని సలహా ఇచ్చారు. 'నాకు ఇక్కడే మృత్యువు రాసిపెట్టి ఉంది. కాగితం కలం తెప్పించండి. క్షమాపణ రాసి ఇస్తాను' అంటే కాగితం కలం ఇవ్వగా, ఆ కాగితం మీద మృత్యుంజయుడైన మహాశివునిపై నాలుగు పద్యాలు రాసుకుంటే జ్వరం తగ్గిస్తాడు" అన్నాడు, "నటస్వామి" అనే శీర్షికన నలభై పద్యాలు రాశాడు.

**"కుడి హస్తమున శూల మెత్తెదవు, దిక్కుల్ పిండిగా దక్కచ / ప్పుడు గావింతు మరొక్క హస్తమున, నిప్పుల్ గ్రక్కునీదక్క నీకంటిలో**

**పిడుగుల్ పిల్లలు పెట్టుకొన్నవి, మహా మేఘావళీ గర్జనల్ / గుడుగుం చమ్ములనాడు కొన్నవి శిరః శోకారి నీడక్కలో"**

అన్న పద్యం చెప్పినప్పుడు పిడుగులు పడ్డ శబ్దం వినిపించింది దాశరథికి. మహాశివుని ఢంకా ధ్వని మారుమ్రోగింది. కుంభవర్షం, ఇందుపుర దుర్గం (నిజామాబాద్ జైలు కోట) ఆ వర్షానికి ఆనంద తాండవం చేసింది.

**"శివుని ఫాలాన పెనుకారు చిచ్చులేచి**
**గగన కబరీ భరమ్మును కప్పుకొనియె;**
**చెంగు చెంగున నెగయు సారంగమొకడు**
**శివ శిరశ్చంద్ర కేదారసీమ తోచె"** అని రాశాడు.

సర్వదేవ భట్ల సీతారామయ్య అర్ధరాత్రి దాశరథి దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చి "దాశరథీ! శివుడు ఆకాశంలో తిరుగుతున్నాడయ్యా. పిడుగులు ఉరుములు అన్నాడు. "అవునా! అయితే నన్ను కాపాడ్డానికే వచ్చాడు. నా నాడి చూడు". నాడి చూచి జ్వరం లేదు అన్నాడు సీతారామయ్య. "హమ్మయ్య నటస్వామీ! నన్ను కరుణించావా తండ్రీ!" అన్నాడు దాశరథి.

సర్వదేవ భట్ల సీతారామయ్యను విడుదల చేశారు. కారణం బాగా సుస్తీగా ఉంది. డాక్టర్లు వైద్యం చేయలేకపోయారు. దాశరథి "సీతారామయ్య విడుదల వార్త నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. నెలల తరబడి ఒకే బారక్కులో ఉంటూ, అతని బాధల్ని చూస్తూ బాధపడుతూ ఉన్న వాణ్ణి. అతడు రాత్రుళ్లు నిద్రపోయేవాడు కాదు. మూల్గుతూ – లాంతరు మీద తడి చేతిరుమాలు పెట్టి, అందులోంచి వేడి ఆవిరి వస్తూ వుంటే, కీళ్లు కాపుకుంటూ కూర్చునే వాడు. ఒక్కనాడూ అతనికి చికిత్స చేసిన పాపాన పోలేదు జైలు డాక్టరు. కేంద్ర ప్రభుత్వం ఔషధాలు రాష్ట్రంలోకి రానివ్వడం లేదు అంటూ ఉండేవాడు, ఔషధాలను బయట అమ్ముకునేవాడు. నిజాం సైన్యంలో ఇరవై ఐదు సంవత్సరాలు డాక్టరుగా పనిచేసి మేజర్ అనిపించుకు వచ్చానని గొప్పలు చెప్పుకునేవాడు "వెళ్లిరా సీతారామయ్య! బతికి బయటపడ్డావు. దారిలో రజాకారులు చంపకుండా ఇల్లు చేరుకుని ట్రీట్‌మెంటు తీసుకో" అని అతన్ని సాగనంపారు.


దాశరథి

1948 జనవరి 11, కాళరాత్రి, కురుక్షేత్ర సంగ్రామం చూడలేదు, ప్రథమ ద్వితీయ ప్రపంచ యుద్ధాలు చూడలేదు. కాని విచిత్రమైన సంగ్రామాన్ని నిజామాబాద్ జైల్లో చూశాం. సర్వసాధారణంగా జైల్లో ఉన్నప్పుడు అందరూ నిరాయుధులూ, నిస్సహాయులూ అయిన సత్యాగ్రహులు ఎక్కువగా ఉంటారు. వారి రక్షణ బాధ్యత ప్రభుత్వానిది. కానీ జైలు ద్వారాల ముందు కాపలా కాసే సాయుధ రక్షకభటులుండగా రజాకార్లు కర్రలతో, కత్తులతో జైల్లో ఎలా ప్రవేశించారో తెలియదు. జైలు అధికారులు చాలా కచ్చితంగా పనిచేస్తూ ఉంటారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పెన్నుగానీ, పెన్ నైఫ్‌గానీ జైల్లోకి పట్టుకు వెళ్లడానికి వీలులేదు. అలాంటిది ఇనుప చువ్వలతో, బరిసెలతో, బల్లాలతో, కత్తీ కటారులతో, హాకీ స్టిక్కులతో రజాకార్లు అసురసంధ్య వేళ జైల్లో చొరబడి సత్యాగ్రహులను చావబాదుతుంటే దీనికి ప్రభుత్వ తోడ్పాటు కూడా ఉందేమోననే అనుమానం కలుగుతుంది. ఆనాడు ప్రతీ జైల్లో ఇలానే జరిగింది. తన

# రికి నకళ్లు

కళ్ల ఎదుటే ఓ సత్యాగ్రహిని కొట్టి చంపారని స్వామి రామానంద తీర్థ నిజాం రాజుకు రాసిన ఉత్తరంలో ఉదహరించారు.

శ్రీరాములు అనే సత్యాగ్రహి, సత్యాన్ని పక్కన బెట్టి ఆగ్రహించాడు. "చచ్చే వాళ్లం చావనే చస్తాం, చంపేవాళ్లను చంపి చద్దాం" అన్నాడు. అతనితో పాటు ఇతర సత్యాగ్రహులు బోర్కర్, కులకర్ణి, ఇతర దృఢకాయులైన సత్యాగ్రహులు ఓ యాభయ్ వంటగది పక్కకు వెళ్లారు. అక్కడ ఓ వంద బండ్ల వంట చెరకు ప్రధానంగా మామిడి, తుమ్మ, చింత పేర్చి ఉంచారు. చెట్లను నరికి వంట చెరకుగా వాడేవారు. ప్రతీ సత్యాగ్రహి అక్కడి నుంచి ఓ లావుపాటి కర్రను తెచ్చారు. అప్పటికే వాళ్ల చేతుల్లో అల్యూమినియం కంచాలున్నాయి. వాటిని విష్ణు చక్రాల్లా రజాకార్లపై ప్రయోగించారు. వీరి దెబ్బలకు తాళలేక "మర్గయే మర్గయే" (చచ్చాం, చచ్చాం) అని కేకలు వేస్తూ పరుగెత్తడం, అరవడం మొదలు పెట్టారు. రజాకార్లు శ్రీరాములు, కులకర్ణిని చావబాదారు. రజాకార్ల కత్తులు, బల్లాలు విరిగి పోయాయి. తలలు పగిలాయి. రజాకార్లు సత్యాగ్రహుల దాడిని తట్టుకోలేక చెల్లాచెదురయ్యారు. గుడ్డి దీపాల వెలుగులో సత్యాగ్రహులు కాగడాలు వెలిగించి ఎదురు దాడాకి దిగారు. ఈలోగా రజాకార్ల బట్టలకు నిప్పు అంటుకుంది. నిజామాబాదు కొండమీద అగ్ని జ్వాలలు "మమ్మల్ని చంపుతారా? మిమ్మల్ని చంపి మేము చస్తాం" అంటూ నినాదాలు మొదలు పెట్టారు జై బోలో చండీమాతకు, జైబోలో భజరంగ్ దళ్‌కి (హనుమంతునికీ జై) జైబోలో భారత్‌మాతాకీ అంటూ ఉద్రేకంగా నినాదాలు చేస్తూ రజాకార్లపై పడ్డారు. డెబ్బయి మంది రజాకార్లు గాయపడ్డారు. ముప్పై మంది పోలీసులకు కాళ్లు విరిగాయి. నాలుగు వందలమంది సత్యాగ్రహులు రక్తంలో స్నాన మాడారు.

జైలుకు కాపలా కాస్తున్న సాయుధ సైనికులు తమ తుపాకులతో గాలిలో కాలుస్తున్నారు. ప్రజల హాహాకారాలు మిన్నంటాయి. రెండు గంటల యుద్ధం, తరువాత సైనికుల సహాయంతో జైలు గేట్లు మూయించారు. కాళ్లు విరిగినవారు, తలలు పగలినవారు, ప్రాణాలు కోల్పోయినవారు చెల్లా చెదురుగా కొండమీద పడివున్నారు. గాయపడిన రజాకారులను జైలు బయటకు దాటించారు. పోలీసులు సత్యాగ్రహులను జీవితఖైదీల సహాయంతో బేరక్కుల్లోకి మోసుకెళ్లి పడేశారు. మూలుగులు,



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు


కేకలు, నినాదాలు, కాగడాలు, కోలాహలం. అగ్నిజ్వాలలు, తుపాకీలు పేలిన మోతలు, బారక్కుల తలుపులు మూశారు.

లాంతరు చేత పట్టుకొని ఒక డాక్టరు ఇద్దరు నర్సులు వచ్చారు. తలుపుల సీకుల్లోంచి గాయాలకు ముందు రాశారు. కట్లు కట్టారు. పోలీసులు బారక్కు తలుపులు తెరవనివ్వలేదు. శ్రీరాములు కంగారుగా కవి గారు బేహోష్‌గా (స్పృహతప్పి) పడిపోయారు. సాబ్ తలలోంచి రక్తం కారుతుంది. జర్రా మందు రాయండి సాబ్" అని ప్రాధేయపడుతున్నాడు. 'ఆక్సిజన్ లేదే! దీపం అటు చూపండి, కోరమైన్ ఇంజక్షన్ ఇస్తా' అన్నాడు జైలు డాక్టరు. ఎంత ప్రయత్నించినా తలుపు సీకుల్లోంచి ఇంజక్షన్ ఇవ్వడం కురదలేదు. కవి గారిని అలాగే వదిలేసి వెళ్లి పోయాడు డాక్టరు.

తెల్లవారు జామునకు కొంత స్పృహ వచ్చింది. ఒళ్లంతా నొప్పులు, రక్తం కడిగి తలకు కట్టుకట్టారు. "దాహం దాహం" అని అరుస్తుంటే సత్యాగ్రహులు నీళ్లు పట్టించారు. డొక్కలో తగిలిన దెబ్బకు నోట్లోంచి రక్తం వస్తున్నది. డొక్కలో తగిలిన దెబ్బకు విలవిల లాడి పోతున్నారు. నెత్తిమీద గాయం నుండి రక్తం కారడం ఆగిపోయింది. ఎవరికి ఆ రాత్రి నిద్రలేదు. ఈలోగా మాగన్నుగా నిదురపట్టింది. సూర్యకిరణాలు వెచ్చగా తగులుతుండగా కళ్లు తెరిచారు కవిగారు. శ్రీరాములు, బోర్కర్, గంగారామ్ ఆయన చుట్టూ కూర్చొని ఉండగా బారక్కు తలుపులు తెరిచారు. మళ్లీ డాక్టరు, నర్సులు వచ్చారు. ఒక ఖైదీ చాయ్ తెచ్చాడు. డాక్టరు కడుపు నొక్కి చూశాడు, నోట్లోంచి రక్తం వస్తున్నది. "హెమరేజ్ మాదిరి ఉంది" అని డాక్టరు వదిలి పోయారు.

ఈ సంఘటన తాలూకా వార్త నిజామాబాద్ నగరంలోనూ, హైదరాబాద్‌లోనూ తెలిసిపోయింది "జైలులో సత్యాగ్రహులపై హత్యాకాండ" అని కరపత్రాలు వేశారు, అవి క్షురకుడు సుబ్బన్న ద్వారా లోనికి వచ్చాయి. వాటిని చూస్తూండగా హైదరాబాద్ రాజ్యంలో వైద్యరంగం ఆలోచనకు వచ్చింది కవి గారికి.

తొలిదశలో మానవులు రోగ నివారణకు నిర్మూలనకు ప్రకృతిలో లభించే వనమూలికలు



కోఠిలోని (హైదరాబాద్) బ్రిటిష్ రెసిడెన్సీ

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

కషాయాలపైనే ఆధారపడేవాడు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల వైద్య విధానాలు ఉనికిలోనికి వచ్చినవి. చైనాలో ఆక్యుపంచర్, అరబ్ దేశాల్లో యునానీ, జర్మనీలో హోమియోపతి, భారత్‌లో ఆయుర్వేదం స్థానికంగా తెలంగాణాలో భూతవైద్యం, ఆయుర్వేద యునాని విధానాలు అమలులోకి వచ్చాయి. బౌద్ధ భిక్షువులు, జైనమునులు ప్రజలకు వైద్య సదుపాయాలు అందించేవారు.

తెలంగాణాలో దాదాపు 40 ఆరామాలు ఉన్నట్లు వాటిల్లో వైద్యవిద్యను బోధించినట్లు చైనా యాత్రీకులు పాహియాన్, హువాన్‌త్సాంగ్‌ల గ్రంథాలను బట్టి తెలుస్తున్నది. ఆచార్య నాగార్జునుడు తన ఆరామంలో వైద్య విద్యను బోధించినట్లు తెలుస్తున్నది.

యునాని వైద్య విధానానికి మూల పురుషులైన హిపోక్రటస్, ఇల్యూషినా, (అవిసెన్నా) పైథాగరస్ వైద్య విధానం తొలిదశలో అరబ్బు దేశాలకు, గ్రీకు ప్రాంతాలకు పరిమితమైంది. అసఫ్ జాహీల కాలంలో ఆ రెండు వైద్య విధానాలే ప్రజలకు అందుబాటులో ఉండేవి. 1798లో నాటి గవర్నర్ జనరల్ లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతితో హైదరాబాద్ రాజ్యం బ్రిటిష్ రెసిడెంట్ పర్యవేక్షణలో కొనసాగడం ప్రారంభమైనది. దీనిలో భాగంగా జేమ్స్ ఆకిలిస్ కిర్క్ ప్యాట్రిక్ బ్రిటిష్ రెసిడెంటుగా హైదరాబాద్‌లో నియమితులయ్యారు. ఇతని కోసం కోఠీలో రెసిడెన్సీ భవనాన్ని (నేటి కోఠి





నిలోఫర్ పిల్లల ఆస్పత్రి



మహిళా కళాశాల) నిర్మించారు. పై ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లోని బొల్లారంలో నిజాం రాజ రక్షణకు బ్రిటిష్ సైన్యాలుండేవి. వీరికి వైద్య సేవలందించే నిమిత్తం వైద్య సిబ్బందిని ఇక్కడ నియమించారు. వారు కేవలం బ్రిటిష్ వారికే వైద్యం అందిం చేవారు. ఇక ఆయుర్వేదానికి వస్తే కొన్ని కుటుంబాలు కొన్ని తరాలు వాటిపై ఆధిపత్యం చేశాయి. వారిలో లాలాశంకర్ అగ్రిహోత్రి, జీవన్ లాల్, మోతీలాల్, నట్వర్‌లాల్ శాస్త్రి, బ్రిజ్‌లాల్ గోపాలరావు, హరిగోవింద్, జనార్దన్ తదితరులు 1935లో నిజాం ఆయుర్వేద సదర్ దవాఖానాను సుల్తాన్ బజార్లో నెలకొల్పారు. కుతుబ్ షాహీల కాలంలో "యునాని" వచ్చింది, 16వ శతాబ్దంలో దరూష్ షిఫా (House of Cures) నెలకొల్పారు. 1810లో గవర్నమెంటు నిజామియా టిబ్బి కాలేజీని (యునాని కాలేజీని) మొగల్‌పురాలో నెలకొల్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో అబ్దుల్ కీమ్, అర్షిద్ నదీం, ఆయుబ్ అహ్మద్‌ఖాన్‌లు ప్రముఖ యునానీ వైద్యులు. 1926లో గవర్నమెంటు నిజామియా జనరల్ హాస్పటల్‌ను చార్మినార్ దగ్గర నెలకొల్పారు. సైన్య సహకార పద్ధతికి ముందు ప్రజలకు ఆయుర్వేదం, యునాని, భూతవైద్యం మాత్రమే అందుబాటులో ఉండేది.

1844-46లో ప్రారంభించిన మెడికల్ స్కూలు 1927లో మెడికల్ కాలేజీగా అభివృద్ధి చెందింది, 1908లో ఎర్రగడ్డ ప్రాంతంలో మెంటల్‌హెల్త్ హాస్పిటల్‌ను, అఫ్జల్‌గంజ్‌లో జామియా హస్పటల్‌ను, నిజాం నవాబు రెండవ కోడలు నీలోఫర్ జ్ఞాపకార్థం నీలోపర్ పిల్లల ఆస్పత్రి ఏర్పాటయ్యాయి. 1851లో కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పటల్ గాంధీ ఆసుపత్రిగా మార్పు చెందింది.

తొలి రోజుల్లో బ్రిటిష్ ఆర్మీకి మాత్రమే సేవలందించేది. ఆ తదుపరి కొంత కాలానికి ప్రజలకు అందుబాటులోనికి వచ్చింది. 'ఇవన్నీ హైదరాబాద్ నగరానికే పరిమితం కావడంతో గ్రామీణ ప్రాంతవాసులకు ఈ వైద్య సదుపాయం అందలేదు, నేడు అందట్లేదు' అంటూ వాపోయాడు దాశరథి. అరడజనుసార్లు వాయిదాపడిన హైదరాబాద్ ప్రయాణం ఇవాళ కార్యరూపం దాల్చింది. నిజామాబాదు జైల్లో రజాకార్ల దాడుల్లో గాయపడి, ఆరోగ్యం పూర్తిగా కోల్పోయిన కొందరిని చికిత్స కోసం హైదరాబాద్ సెంట్రల్ జైలుకు (చంచల్‌గూడ) మార్చాలనీ, అక్కడ ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయించవచ్చనీ అప్పటి పోలీసు శాఖ మంత్రి అబ్దుల్ హామీద్‌ఖాన్ సూచించాడు. ఆ మేరకు కొందరు సత్యాగ్రహులను నిజామాబాద్ జైలు నుంచి హైదరాబాదు మార్చడానికి నిర్ణయించారు. ★



సంకలనం : లక్ష్మణ సుధాకర్, వరంగల్

# చీకటియుగం మీద కొత్త వెలుగు

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలను పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్మోహన్ స్మారక భవనంలో ఏప్రిల్ 7వ తేదీన 'జాగృతి' వారపత్రిక సౌజన్యంతో ఓరుగల్లు సాహితీ ఉత్సవం స్ఫూర్తిదాయకంగా జరిగింది. నిజాం రాజ్యంలో హిందువులు అనుభవించిన క్లేశాలు, కవులూ, పత్రికారచయితలు ఎదుర్కొన్న కడగండ్ల గురించి, సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల గురించి, ఆనాటి అణచివేతకు వ్యతిరేకంగా వినిపించిన గళాలను ఈ ఉత్సవం స్మరించుకుంది. 'నైజాం విముక్త స్వాతంత్ర్య పోరాటం-రజాకార్ల అరాచకాలు' అనే అంశంపై ఉపన్యాసంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. తరువాత నైజాం విముక్త స్వాతంత్ర్యం పోరాటం-గ్రంథాలయోద్యమం, నైజాం విముక్త స్వాతంత్ర్యం పోరాటం- సంస్కృతి సాహిత్యోద్యమం; నైజాం విముక్త స్వాతంత్ర్యం పోరాటం-పత్రికల పాత్ర, కాకతీయులు-ఆలయాలు అన్న అంశాలపై సంగోష్ఠులు జరిగాయి. చివరిగా జరిగిన కవి సమ్మేళనం సాహిత్యాభిమానులను కంటతడి పెట్టించింది.

## సాహిత్య ఉత్సవాల ద్వారానే జాతీయవాద నిర్మాణం




ప్రసంగిస్తున్న ఆర్.ఎస్.ఎస్. తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్, వేదికపై నిట్ డైరెక్టర్ ఆచార్య ఎన్.వి.రమణరావు, నిట్, వరంగల్ గణితశాస్త్ర ఆచార్యులు, ఉత్సవ సమితి అధ్యక్షులు ఆచార్య జె.వి. రమణమూర్తి, జాగృతిప్రకాశన్‌ట్రస్ట్ అధ్యక్షులు, వరంగల్ విభాగ్ సంఘచాలక్ ఆచార్య చిలుకమారి సంజీవ

సాహిత్య ఉత్సవాల నిర్వహణ ద్వారానే యువతలో జాతీయ వాదం నిర్మాణం అవుతుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ డైరెక్టర్ ఆచార్య ఎన్.వి.రమణరావు ప్రారంభ సమావేశంలో అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో వాస్తవ చరిత్రకు స్థానం లేకుండా పోయిందని, దీనిని ఎన్.సి.ఈ.ఆర్.టి, సరిదిద్దే ప్రయత్నంచేస్తున్న దన్నారు. నిట్, వరంగల్ గణితశాస్త్ర ఆచార్యులు, ఉత్సవ సమితి అధ్యక్షులు ఆచార్య జె.వి. రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఆరెస్సెస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ మాట్లాడుతూ నైజాం పాలనలో తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం అధోగతిపాలైందన్నారు.

తెలుగు, మరాఠీ, కన్నడ భాషల పాఠశాలలను మూసి వేయించి, ఉర్దూ మీడియం పాఠశాలను ప్రారంభించి మన మాతృభాష నుండి మనల్ని నైజాం పరిపాలకులు దూరం చేశారన్నారు. తెలుగు భాషను



పరిరక్షించుకోవడానికి ఆనాడు సమాజంలో ఉన్న సాహిత్యాభిమానులు, విద్యాభిమానులు గ్రంథాల యాలను, తెలుగు పాఠశాలలను ప్రారం భించా రన్నారు. అహల్యాబాయి ఖేల్కర్ విరాళంగా ఇచ్చిన భూమిలో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి, తానే, తన సొంత భూమిలో నిర్మాణం చేశానని చెప్పుకున్నారన్నారు. రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ అమాయక హిందువుల మానప్రాణాలను హరించి వేశాడన్నారు. నైజాం పాలనలో ఆనాటి మహిళల పట్ల జరిగిన ఆకృత్యాలను ఆయన వివరించారు.

జాతీయవాద భావ పరివ్యాప్తికై ఓరుగల్లు సాహితీ ఉత్సవాల్లాంటి సాహిత్య కార్యక్రమాలు సహకరిస్తా యన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వరంగల్ విభాగ్ సంఘచాలక్ ఆచార్య చిలుకమారి సంజీవ పాల్గొన్నారు.

# ఊపిరిపోసిన గ్రంథాలయాలు

నైజాం విముక్త పోరాటంలో సారస్వత సామాజిక, రాజకీయాది రంగాల సర్వతోముఖాభి వృద్ధికి ముఖ్యంగా సాధనా భూతమైనది గ్రంథా లయోద్యమమేనని అరబిందో సొసైటీ, హనుమకొండ శాఖ చైర్మన్, ప్రముఖ సాహితీవేత్త వరిగొండ కాంతారావు అన్నారు. రెండవ సంగోష్టికి సహృదయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ వరంగల్ అధ్యక్షులు డాక్టర్ గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు అధ్యక్షత వహించారు. నైజాం కాలంలో గ్రంథాలయోద్యమం జరగకపోయినట్లయితే ఈ ప్రాంతం పాకిస్తాన్‌గా మారి ఉండేదని సురవరం ప్రతాపరెడ్డి అన్నారని ముఖ్యవక్త వరిగొండ పేర్కొన్నారు. హైదరాబాదులో గ్రంథాలయోద్యమానికి రావిచెట్టు రంగారావు గారు,నాయిని వెంకట రంగారావు (మునిగాల రాజా వారు), కొమర్రాజు లక్ష్మణరావు (దీవాన్), ఆదిపూడి సోమనాథరావు, ఆదిరాజు వీరభద్రయ్య మూల కారకులని ఆయన పేర్కొన్నారు.




ప్రసంగిస్తున్న వరిగొండ కాంతారావు, సంగోష్టి నిర్వాహకులు పిన్నింటి బాలాజీరావు, సభాధ్యక్షులు డాక్టర్ గన్నమరాజు గిరిజ మనోహర్‌బాబు

హనుమకొండలో 1904లో ప్రారంభమైన రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిర్వహణకు పింగళి వెంకట్రామిరెడ్డి 30 సంవత్సరాలపాటు తన ఇంటిని ఉచితంగా ఇచ్చారని అన్నారు. తుంగతుర్తి నరసింహారావు, రాయ మురళీధర్ సుబేదార్ ఈ గ్రంథాలయానికి వ్యవస్థాపకులు అన్నారు. వరంగల్లులో 1908లో తూము వరదరాజులు శబ్దానుశాసనాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించారు. భాషా నిలయం నిర్వహణకు ముదిగొండ శంకరారాధ్యుల వారు తన ఇంటిని ఉచితంగా ఇచ్చారన్నారు. ధూపాటి వెంకట రమణా చార్యులు రెండు భాషా నిలయాలకు సేవలందిం చారని గుర్తు చేశారు. 1930 ప్రాంతంలో శ్రీ రాజ రాజ నరేం ద్రాంధ్ర భాషా నిలయానికి 32 తెలుగు పత్రికలు వచ్చేవని చెప్పారు. ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహించింది ఈ గ్రంథాలయ ఉద్యమకర్తలే అని వరిగొండ అన్నారు. 1925లో మధిరలో ప్రథమ గ్రంథాలయ మహాసభలతోపాటు ఆంధ్ర మహాసభలు జరిగాయన్నారు. కాళోజి, బూర్గుల రామకృష్ణారావు గ్రంధాలయోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆలంపురులోని క్యాతురులో జరిగిన గ్రంథాలయ మహాసభలను గడియారం రామకృష్ణ శర్మ నిర్వహించి రావు బహదూర్ వెంకట్రామిరెడ్డిని రథం మీద తీసుకు వచ్చారన్నారు. సమావేశాలలోనే స్త్రీ విద్య గురించి, ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి, చేతివృత్తుల గురించి వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేశారన్నారు. నైజాం ప్రాంతంలో జరిగిన గ్రంధాల యోద్యమంలో బ్రిటిష్ ఆంధ్రుల సహకారం మరువలేనిది అన్నారు. ఈ ఉద్యమాలలో ఆంధ్ర ప్రాంతం నుండి అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం లాంటి సాహితీవేత్తలు సహక రించారన్నారు. చాట్రాతి లక్ష్మీనరసమ్మ 1930లో ఖమ్మం ప్రాంతంలోని ఎర్రుపాలెంలో, వరంగల్ ప్రాంతంలోని హసన్‌పర్తిలో ఉపాధ్యాయురాలుగా

# నిజాం రాజ్యంలో తెలుగు పత్రిక పుట్టుకే ఒక చరిత్ర

నిజాం నిరంకుశ పాలనలో తెలుగు పత్రిక పుట్టుకే ఒక చరిత్ర అని జాగృతి జాతీయ వార పత్రిక సంపాదకులు డాక్టర్ గోపరాజు నారాయణ రావు అన్నారు. నైజాం విముక్త స్వాతంత్ర పోరాటం–పత్రికల పాత్ర అనే అంశం మీద ఆయన ప్రసంగించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక వరంగల్ ఎడిషన్ ఇన్చార్జి శంకర్‌రావు శెంకేసి అధ్యక్షతన జరిగిన మూడవ సంగోష్టిలో నిజాం సంస్థానంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు స్థానం లేదని, అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే తెలుగుకు విలువ లేదని, తెలుగుతోపాటు సంస్థానంలో భాగమైన కన్నడ, మరాఠీ జిల్లాలలో ఆ భాషలకు కూడా గౌరవం లేదని గోపరాజు చెప్పారు. కేవలం 10 శాతం ప్రజలు మాట్లాడే ఉర్దూ రాజభాషగా చలామణి అయిందని, అలాంటి నేపథ్యంలో తెలుగు భాషా పత్రికలు పంటి బిగువున ప్రయాణం సాగించాయన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, ఒద్దిరాజు సోదరులు, దేవులపల్లి రామానుజరావు, వి. హెచ్ .దేశాయ్, ఎం.జె.గోపాల్ నాయుడు ,ఎంపీ .స్వామి, అనంత, వి. భాస్కరరావు, ఏఆర్వీ చారి, కేవీఎస్. వైద్య వంటి వారు నిర్బంధం లోనూ పత్రికా రచనను నిబద్ధతతో నిర్వహించా రన్నారు. నిజాం వ్యతిరేకోద్యమంలో పత్రికల పాత్ర అంటే తెలుగు, కన్నడ, మరాఠీ, ఉర్దూలతో పాటు హిందీ, ఇంగ్లిష్ పత్రికల పాత్ర గురించి కూడా తెలుసుకోవాలి. 'వైదిక ఆదర్శ' ఆర్య సమాజ్ పత్రిక మీద రహబరే దక్కన్, సబహే దక్కన్ అనే నిజాం సర్కారు పోషణలోని పత్రికలు ఆర్య సమాజ్ నిర్వహిస్తున్న శుద్ధి ఉద్యమం మీద విమర్శలు గుప్పించేవి.

ఆ విమర్శలను వైదిక ఆదర్శ ఆర్య సమాజ్ పత్రిక

పనిచేస్తూ స్త్రీవిద్య, గ్రంథాలయోద్యమాల గురించి నిర్వహించే కార్యక్రమాలకు విరివిగా డబ్బులు సమకూర్చేవారన్నారు. బాలయ్య అనే అతను తామరాత్ శాఖలో ఆర్మూర్లో పనిచేస్తూ తాను ప్రయాణించే ఎడ్లబండిలో 100 పుస్తకాలు పెట్టుకొని సంచార గ్రంథాలయం నిర్వహించారని వరిగొండ తెలిపారు. ఆ కాలంలో కోదాటి నారాయణరావు ఖమ్మం జిల్లాలో రెండు సంవత్సరాల వ్యవధిలో 50 గ్రంథాలయాలను నెలకొల్పారన్నారు. నాడు హరిజనులుగా పేర్కొన్నవారి విద్య కోసం కూడా గ్రంథాలయోద్యమం ప్రచారం చేసిందన్నారు.

1924లో మడికొండలో పెద్ది శివరాజయ్య ప్రతాప రుద్ర ఆంధ్రభాష నిలయం స్థాపించారన్నారు. అయితే నిజాం పోలీసులు మత కల్లోలాలు రేకెత్తడానికి గ్రంథాలయం ఏర్పాటు చేశారని ఆయనపై ఆరోపణ మోపారు. దీంతో ఆయన తన వద్ద ఉన్న పుస్తకాలను పశువుల కొట్టంలో దాచిపెట్టి దొంగచాటున గ్రంథాలయాన్ని నిర్వహించారని తెలిపారు. ఈ దొంగచాటు గ్రంథాలయానికి కాళోజీ, వానమామలై వరదాచార్యులు, బిరుదురాజు రామరాజు, పల్లా దుర్గయ్యలు వస్తుండేవారు అని ఆయన తెలిపారు.

1941లో రావి నారాయణరెడ్డి చిలుకూరులోని ట్రావెలర్స్ బంగ్లాలో ఏర్పాటు చేసిన రైతు గ్రంథాలయాన్ని నిజాం పోలీసులు తగలబెట్టారు. ఆ తర్వాత కొత్తూరు మాణిక్యం ఇంట్లో గ్రంథాలయం నిర్వహించారు. కుల రహిత సమాజ నిర్మాణానికి గ్రంథాలయ ఉద్యమాలు సహక రించాయి. ఈ పోరాటాన్ని కమ్యూనిస్టులు హైజాక్ చేసి సాయుధ పోరాటంగా నిర్మాణం చేసి నిజాం పాలనను అంతం చేసింది తామే అని ప్రచారం చేసుకున్నారని వరిగొండ ఆవేదన వ్యక్తం చేశారు.

# సమరం దిశగా నడిపిన సాహిత్యోద్యమాలు



ప్రసంగిస్తున్న ఆచార్య కసిరెడ్డి, వేదికపై ఆచార్య దామోదర్

నైజాం రాజ్యంలో మెజారిటీ ప్రజలైన హిందువుల సంస్కృతి, సాహిత్య ఉద్యమాలను ఏడవ నిజాం మీరు ఉస్మాన్ అలీ ఖాన్ అణిచివేశారని జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఓరుగల్లు సాహితీ ఉత్సవ రెండవ సంగోష్ఠికి చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ వరంగల్ వైస్ ఛాన్సలర్ ఆచార్య దామోదర్ అధ్యక్షత వహించగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి వక్తగా పాల్గొన్నారు. 1724 నుండి 1948 వరకు పరిపాలించిన ఏడుగురి నిజాముల పాలనలో మెజార్టీ ప్రజలు తమ సంస్కృతీ, సాంప్రదాయాల నుండి దూరమయ్యారన్నారు. ఆ నేపథ్యంలో సంస్కృతి పునరుద్ధరణకు ఆంధ్ర మహాసభ, జాతీయోద్యమ నిర్వహణ సంస్థలు, గ్రంథాలయోద్యమాలు, జనపద కళా ప్రదర్శన సంస్థలు సాహిత్య ఉద్యమాన్ని సృష్టించి ప్రజలను చైతన్యవంతం చేశాయన్నారు. ఆది హిందూ ఉద్యమం, అక్షరాస్యత పెంపునకు కృషి, వివాహ సంస్కరణలు, అస్పృశ్యత నిర్మూలన, వెట్టి చాకిరీ నిర్మూలన, మద్య నిషేధం, జంతుబలి నిషేధం, వర్ణాంతర, కులాంతర వివాహాలు, జోగినీ వ్యవస్థ నిర్మూలన, సహ పంక్తి భోజనాలు, ఘోషా పద్ధతి నిర్మూలన, వెలివాడల నిర్మూలన, భూదానోద్యమం, బాల్యవివాహాల నిలుపుదల లాంటి ఎన్నో సంస్కరణల ద్వారా ఆనాటి సంస్థలు నిజమైన సంస్కృతీ స్థాపనకు కృషిచేశాయన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, విజ్ఞాన వర్ధిని పరిషత్తు, ఆంధ్రభాషా నిలయాలు, లక్ష్మణరాయ పరిశోధక మండలి లాంటి సంస్థలు పలు సాహిత్యోద్యమాలద్వారా మాతృదేశ, మాతృభాషాభిమానాన్ని పెంచాయన్నారు. సురవరం, దాశరథి, చెరివిరాల భాగయ్య, రావెళ్ల వెంకటరామారావు, కాళోజీ తదితరులు ఎందరో నిజాం పాలనకు వ్యతిరేకంగా గళమెత్తారన్నారు. వీరి సాహిత్యం ప్రజలలో చైతన్యం రగిలించడంతో నిజాం వీరి రచనలను నిషేధించారన్నారన్నారు.



ప్రసంగిస్తున్న గోపరాజు నారాయణ రావు, వేదికపై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆముదాలదాత మహర్షి, శంకర్‌రావు

ఖండిస్తూ ఉండేది. 1921 నవంబర్ 12న హైదరాబాదులో హైకోర్టు న్యాయవాది టేకుమాల రంగారావు ఇంట్లో జరిగిన సమావేశంలో 11 మంది తెలుగు పెద్దలు ఆంధ్రోద్యమానికి అంకురార్పణ చేశారు. దాని కొనసాగింపే 'నీలగిరి పత్రిక' స్థాపన. షబ్నవీసు వెంకట రామ నర్సింహారావు దీని స్థాపకులు. 1920- 30 మధ్య కాలంలో దాదాపు 45 పత్రికలు వెలువడి నాయని గోపరాజు చెప్పారు. నీలగిరి, తెనుగు పత్రిక, రయ్యత్, గోలకొండ, దివ్యవాణి, భాగ్యనగర్, ఆంధ్రవాణి, మీజాన్, కాకతీయ వంటి పత్రికల స్థాపనకు దారి తీసిన పరిస్థితులు, వాటి మనుగడల గురించి ఆయన వివరించారు. ఇమ్రోజ్ పత్రిక సాహసం, అందులో పనిచేసిన షోయబుల్లా ఖాన్ హత్య గురించి కూడా తన ప్రసంగంలో ఆయన గుర్తు చేశారు.

# ప్రతి ఆలయం కళకు కాణాచి

కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాలు ఆనాటి వైభవోపేతమైన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం ఆచార్యులు కొక్కొండ విజయబాబు అన్నారు. నాల్గవ సంగోష్టికి సహృదయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ వరంగల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.వి.ఎన్.చారి సభాధ్యక్షత వహించగా ఆచార్య విజయబాబు వక్తగా పాల్గొన్నారు. కాకతీయులు తమ సామ్రాజ్యంలో అనేక దేవాలయాలను నిర్మించి సంస్కృతీ పరిరక్షకులుగా కీర్తి గడించారన్నారు. ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పరిపాలించిన గణపతి దేవ చక్రవర్తి, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి కాలంలో అనేక దేవాలయాలు నిర్మాణమైనట్లు శాసనాల ద్వారా తెలుస్తుందన్నారు. దేవాలయాల ద్వారా సంగీతం, నృత్యం, శిల్పం, లలితకళలను ఆనాటి పాలకులు పోషించారన్నారు. ఓరుగల్లు సామ్రాజ్యంలో పాలంపేట, జాకారం, రామానుజాపురం, పిల్లలమర్రి, నాగులపాడు, పానగల్, కూసుమంచి, హనుమకొండ, ఓరుగల్లు, గణపురం లాంటి అనేక ప్రాంతాలలో పలు ఆలయాలు నిర్మించారన్నారు. ఈ ఆలయాలు ప్రస్తుత తరానికి స్ఫూర్తినిస్తాయన్నారు. దేవాలయంలో నంది మండపం, నాట్య మండపం, అంతరాళం, గర్భాలయం, స్తంభాలు ఆనాటి శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు. పాలంపేటలోని రామప్ప దేవాలయం, హనుమకొండ వేయి స్తంభాల దేవాలయం, గణపురంలో దేవాలయాల సమూహం, వరంగల్ కోటలో స్వయంభు శ్రీ శంభు లింగేశ్వర స్వామి దేవాలయం, భద్రకాళి మందిరం, హనుమకొండలోని పద్మాక్షి దేవాలయం, కాజీపేటలోని మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయాలు కాకతీయుల ఆధునిక సాంకేతిక ప్రతిభను సాక్షాత్కరింప చేస్తాయన్నారు. రామప్ప దేవాలయం, వేయి స్తంభాల దేవాలయం ఇసుక పునాదులపై నిర్మాణం చేశారన్నారు. రామప్ప దేవాలయ శిఖరంలో నీటిలో తేలియాడే ఇటుకలు ఉన్నాయన్నారు. సందర్శకులను ఇవి అబ్బుర పరుస్తాయన్నారు. కాకతీయుల కాలం నాడు నిర్మాణమైన ఈ ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వం మరియు సమాజంపై ఉందని ఆయన అన్నారు.



ఆచార్య కొక్కొండ విజయబాబు

కాకతీయుల వైభవోపేతమైన పాలన నుండి నిజాం నిరంకుశ పాలన వరకు సమాజంలో ఎంత అల్లకల్లోలం ఉన్నా ఇక్కడి కవులు, రచయితలు, సాహితీవేత్తలు నిశ్శబ్దంగా కావ్యాలు రాస్తూ, రచనలు చేస్తూ తమ సాహిత్య సాంస్కృతిక ప్రవాహాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించేందుకు తమ వంతు కృషి చేశారని కాకతీయ విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య అన్నారు. ఓరుగల్లు సాహితీ ఉత్సవ ముగింపు సమావేశానికి ఆయన వక్తగా విచ్చేసి ప్రసంగించారు. ఉత్సవ సమితి గౌరవ సలహాదారులు, ఆర్.ఎస్.ఎస్ వరంగల్ విభాగ్ సంఘచాలక్ ఆచార్య చిలుకమారి సంజీవ అధ్యక్షత వహించారు. సాహిత్యసేవలో కానీ, జాతీయసేవలో కానీ ప్రశంసకు లొంగకుండా తమ రచనలలో జాతీయవాద భావాన్ని గట్టిగా నొక్కి చెప్పిన మహానుభావుడు ఆచార్య సుప్రసన్న అని అన్నారు. ఓరుగల్లులో వికసించిన సాహిత్యవైభవం, తెలంగాణలో వికసించిన సాహిత్య వైభవం గురించి సుప్రసన్నాచార్య విస్తృతంగా ప్రసంగించారు. 1323లో కాకతీయరాజ్య పతనం తరువాత జరిగిన విధ్వంసం గురించి గంగాదేవి అనే కవయిత్రి ఆనాటి విధ్వంసకర చరిత్రను గ్రంథస్థం చేసిందన్నారు. గణపతి దేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి కాలంలో ఇక్కడ సాహిత్యం వెల్లి విరిసిందన్నారు. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం రాజ్యంలో దుఃఖం ఉంది, బాధ ఉంది, దురాక్రమణలు ఉన్నాయి, సామూహిక అత్యాచారాలు ఉన్నాయి. గ్రామాలకు గ్రామాలే



# అరాచక పాలనపై 'అక్షర' సమరం

ఓరుగల్లు సాహితీ ఉత్సవ సమితి జాగృతి వారపత్రిక సౌజన్యంతో ఓరుగల్లు సాహితీ ఉత్సవాల సందర్భంగా "నైజాం విముక్త స్వాతంత్ర్య పోరాటం–రజాకార్ల అరాచకాలు" అనే అంశంపై కవితల పోటీని నిర్వహించింది.

ఈ పోటీలో సుమారు 95 మందికి పైగా కవులు, కవయిత్రులు తమ కవితలను వాట్సప్ ద్వారా పంపారు. హాజరైన 45 మంది కవులు, కవయిత్రులు శ్రీ అరబిందో సొసైటీ హనుమకొండ, చైర్మన్ వరిగొండ కాంతారావు అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని నిజాం పాలనలో హిందువులపై జరిగిన రజాకార్ల అరాచకాలపై కవితల రూపంలో గొంతెత్తి పాడుతూ ఉంటే సాహిత్య అభిమానుల కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. యువకుల నుండి మొదలుకొని వృద్ధుల వరకు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతో పాటు, వ్యవసాయదారులు, ఉద్యోగులు సమ్మేళనంలో ఉన్నారు. ఓరుగల్లు సాహితీ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి

మరికొన్ని చిత్రాలు 51 పేజీలో..

తగలబడిపోయిన సన్నివేశాలు ఉన్నాయి. ఇంత జరిగినా ఓరుగల్లులో సాహిత్య చైతన్యం మాత్రం ఆగిపోలేదన్నారు. వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామం గురించి ఆయన ఉదహరించారు. నన్నయ కంటే ముందు కూడా తెలంగాణ ప్రాంతంలో కొన్ని పద్యాలు రచించినట్లు ఆధారాలు దొరికాయి అన్నారు. మహాభారతానికి ఉండే గౌరవం, ప్రాశస్త్యం ఉంటాయి కానీ స్వతంత్ర కావ్యం అని చెప్పాల్సి వచ్చినప్పుడు మనం పాల్కురికి సోమనాథుడి గురించి మరిచిపోకూడదన్నారు. ప్రతాపరుద్ర యశోభూషణం విద్యానాథుడు రచించాడన్నారు. పోతన కాలంలో కూడా ఇక్కడి సమాజం అల్లకల్లోలంగా ఉన్నా అనేక రచనలు వచ్చాయన్నారు. 1323 నుండి 1948 దాకా ఈ ప్రాంతంలో చీకట్లు కమ్ముకున్నాయి.. చీకట్లో కూడా మెరుపులు మెరిసాయి.. దీపాలు వెలిగాయి... కొంతమంది సాధువులు, సంతులు, భైరాగులు పాటలు పాడుతూ,




ప్రసంగిస్తున్న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

# అల్లకల్లోల పరిస్థితుల్లో కూడా ఓరుగల్లులో సాహిత్య వికాసం

తత్వాన్ని చెబుతూ సమాజాన్ని మేల్కొల్పారన్నారు. మట్టెవాడకు చెందిన లింగమూర్తి అనే కవి సీతారామాంజనేయ కావ్యాన్ని రాశారన్నారు. గార్లపాటి రాఘవరెడ్డి రుషితుల్యులని ఆయన పేర్కొన్నారు. ఎమర్జెన్సీ రోజుల్లో కాళోజీ నారాయణరావు నరసింహావతార కథ చెబుతూ ఆనాటి ఇబ్బందులను ప్రచారం చేశారన్నారు. రయ్యాల నరసింహాచార్యుల వారి సాహిత్యాన్ని ఓరుగల్లుకు చెందిన కవి పాతూరి రఘురామయ్య సేకరించి శుద్ధ ప్రతులు తయారు చేసి, వాటి మీద పరిశోధన చేశాడన్నారు. తవ్వుకుంటూ పోతే రత్నాల గనులు బయటపడతాయి. వీటిని, సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. అయితే ఓరుగల్లు మహాకవులను నేటితరం మరిచి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు." ఓరుగల్లు కీర్తి కిరీటాలు" అనే పేరు పెట్టి ఒక వెయ్యి మంది రచయితలు, కవులు, పండితుల గురించి... ఒక్కొక్కరి గురించి ఒక్కొక్క పేజీ రాసి వెయ్యి పేజీల గ్రంథాన్ని వెలువరించాలని, దానికి ఈ సభ నాంది కావాలి అని అనుకుంటున్నానని అన్నారు.



ఓరుగల్లు సాహితీ ఉత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులు

తాడిచెర్ల రవి, సహాయ కార్యదర్శి దేశిని శ్రీధర్ నిర్వహించారు.

చివరలో కవితా పఠనం చేసిన వారందరినీ ఓరుగల్లు ఉత్సవ సమితి సత్కరించింది. ఈ కవితా పోటీల్లో ప్రథమ బహుమతి పురస్కారం (2016/-) సంగారెడ్డికి చెందిన అవుసరం భానుప్రకాష్, ద్వితీయ బహుమతి పురస్కారం (1516/) వరంగల్‌కు చెందిన గన్నోజు ప్రసాద్, తృతీయ బహుమతి పురస్కారం (1116/-) వరంగల్‌కు చెందిన కోడం సురేందర్, ప్రోత్సాహక బహుమతులలో నగదు పురస్కారం 516/- ఒకటి కరీంనగర్‌కు చెందిన డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్‌కు, మరొక 516/- నగదు పురస్కారం హనుమకొండకు చెందిన దేశిని శ్రీధర్ గౌడ్ పొందారు.

వీరందరినీ ఓరుగల్లు ఉత్సవ సమితి గౌరవ సలహాదారులు ఆచార్య చిలుకుమారి సంజీవ, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు. ★

# ఎంత పని చేశావ్, పవార్!

గౌతమ్ అదానీ వ్యవహారం పేరుతో రోజుల తరబడి పార్లమెంటు పనిచేయకుండా చేశారు. ఆ వ్యవహారం మీద జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని ఇంటా బయటా నానాగోల చేశారు. దీనితో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ట పాతాళానికి నెట్టేశామని విపక్షాలు భావిస్తున్నారు. సరిగ్గా అదను చూసి కొట్టారు ఎన్‌సీపీ నేత శరద్ పవార్. గాలి మొత్తం తీసేశారు. హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో అదానీ మీద వచ్చిన ఆరోపణల మీద జేపీసీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఒట్టి చెత్త మాట అని శరద్ పవార్ ఒక్కసారిగా తేల్చిపారేశారు. అది కూడా తలాతోకా లేకుండా మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్న ఎన్‌డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో. ఇదంతా అదానీ లక్ష్యంగా చేస్తున్నట్టే కనిపిస్తున్నది అన్న శీర్షికతో ప్రసారమైన ఈ ఇంటర్వ్యూ విపక్షాల కూసాలు కదిలించేసింది. పవార్ ఏం పలికారో కూడా పరిశీలిద్దాం! అసలు అదానీ మీద ఆరోపణలు గుప్పించిన హిండెన్‌బర్గ్ నిజాయతీ నమ్మదగినదేనా అని కూడా అడిగారు. ఈ గోలంతా, దానితో సంభవించిన పరిణామాలతో ఎంత మూల్యం చెల్లించు కుందో చూడండని కూడా చెప్పారాయన. దీనిపై జేపీసీ వేయాలంటూ గోల చేయడం శుద్ధదండగ అని కూడా తేల్చారు. అసలు అంబానీ– అదానీ అంటూ గోలెందుకు అని మొదటి నుంచి ఆయన అంటున్నారు. ఈ కార్పొరేట్ దిగ్గజాలు పెట్రోకెమికల్, ఇంధన రంగాలకు అందిస్తున్న సేవలు గుర్తించరెందుకు? అని కూడా గతంలో ఆయన రాహుల్‌ని హెచ్చరించారు. తాజాగా హిందుత్వం మీద విమర్శలు, సావర్కర్ మీద విసుర్లు ఆపితే మంచిదని రాహుల్‌కి సలహా ఇచ్చినవారు కూడా పవారే కదా!

చిత్రం ఏమిటంటే ఇలాంటి జేపీసీ ఏర్పాటు చేయాలని విపక్షాలతో కలసి నిన్నటిదాకా పవార్ పార్టీ గొంతు కలిపింది. కానీ దీనితో టీఎంసీ నాయకురాలు, నిరంతరం మీడియా ముందు ఉంటూ సంచలనాలు లేవనెత్తాలని చూసే మహువా మొయిత్రా కంగుతిన్నారు. భారతీయ మీడియా ఒక ప్రత్యేక తెగ అంటూ నోరేళ్లబెట్టారు. ఆ సంగతి ఇన్నాళ్లకు తెలిసింది ఈ మహా మేధో మహువాకి. ఇలాంటి ఇంటర్వ్యూ ప్రసారం చేస్తారా అంటూ ఎన్‌డీటీవీతో పాటు మొత్తం మీడియాను తిట్టి

# న్యాయమూర్తులారా! మీ నాలుకలకి మీరే బాధ్యులు!



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంటే మజాకానా? న్యాయమూర్తులు 'నాలుక'లు అదుపులో పెట్టుకోవలసిందే మరి! తమిళనాడుకు చెందిన ఈ వీర కాంగ్రెస్ కార్యకర్త మాటలు వింటే విషయం అర్థమవుతుంది. తమ నాయకులకు ఏదైనా జరిగితే తట్టుకోలేక ఆత్మహత్యలకి పాల్పడే కార్యకర్తలుండే ఆ రాష్ట్రంలో ఇప్పుడు రొటీనుకు భిన్నంగా మాట్లాడాడు మణికంతన్. ఈయన దుండిగల్ జిల్లా ఎస్‌సీ/ఎస్టీ విభాగం నాయకుడు. తమ నాయకుడు రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్లు జైలు శిక్ష వేసినందుకు నిరసన తెలియచేస్తూ ఈ విభాగం ఆ మధ్య ఒక ప్రదర్శన నిర్వహించింది. ఆ సమయంలోనే ఈయన రెచ్చిపోయి మాట్లాడాడు. జస్టిస్ వర్మ నేనేం చెబుతున్నానో సరిగ్గా విను. ఇలాంటి తీర్పు ఇచ్చినందుకు నీ నాలుక తెగ్గోస్తాం అన్నాడు. అయితే ఒక వెసులుబాటు ఇచ్చాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే నాలుక కోసే పనికి ఉపక్రమిస్తాడట.

దీనితో దుండిగల్ పోలీసులు వెంటనే కేసు పెట్టేశారు. అలాగే దర్యాప్తునకు కూడా ఆదేశించారు.

ఏమైనా మణికంతన్ తమిళనాడు ప్రభుత్వాన్నీ, అన్ని విపక్షాలనీ, సొంత పార్టీనీ కూడా గొప్ప ఇరకాటంలోకి నెట్టేశాడు. మణికంతన్‌ని ఇలా వదిలేస్తే పాపం, ఎందరు న్యాయమూర్తుల నాలుకలు నోళ్లలో మిగిలి ఉంటాయో చెప్పండి! డీఎంకే ప్రభుత్వం ప్రస్తుతానికి కాంగ్రెస్‌ని అంటకాగుతోంది. అలాగే రాహుల్ శిక్ష విషయంలో ఇలా నాలుకలూ, ముక్కులూ కోస్తామని అనకపోయినా చాలామంది కోర్టు తీర్పుకు నిరసనగా ప్రదర్శనలు చేస్తున్నారు. అలాంటి వాతావరణంలో మణికంతన్ ఉదంతం జరిగింది. ఇదే కదా, కాంగ్రెస్, విపక్షాల వారి వ్యవస్థలను రక్షించే విధానం! ఏమైనా న్యాయమూర్తులు సాధ్యమైనంత వరకు తీర్పులు ఆపేస్తే మంచిదన్నమాట. ఒకవేళ అది వారి బాధ్యత కాబట్టి తీర్పులు ఇచ్చినా నాలుకలు భద్రంగా కాపాడుకోవాలి. వారి నాలుకలకు వారే బాధ్యులు. ★

చెవులు చిల్లులు పడేటట్టు డీజేలు పెట్టి గెంతే వారిని చూస్తే ఎక్కువ మందికి కడుపు రగిలిపోతూ ఉంటుంది. అలాంటి వారందరికీ చెవులలో అమృతం పోసినట్టు ఉండే వార్త. గుజరాత్‌లోని బనాస్కాంత ప్రాంతానికి చెందిన అంజనా చౌధురి సమాజం పెళ్లి వేడుకలలో డీజేలు పెట్టరాదని తీర్మానం చేసింది. పెళ్లిళ్లలో ఈ డీజేలు పెట్టి అతిథులని హింసించవద్దని ఆదేశించింది. నిజమే, ఆధునికత అంతా శిరోధార్యం కాదు. ప్రతీదీ సినిమా వాళ్లని చూసి అనుకరించక్కర లేదు. లేదా పక్కవాళ్లని చూసి వాతలు పెట్టుకోకూడదు. ఆ మధ్య ఢిల్లీలో పక్క అపార్ట్‌మెంట్‌లో కుర్రాళ్లు డీజే పెట్టి ప్రాణం తీశారని ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె గర్భిణి కూడా. మరునాడు ఆ డీజే గ్యాంగ్ వచ్చి ఆమెను చంపేశారు. ఇదొక కొత్త దురాచారం కాదా? అయితే అన్నిటికీ పోలీసులూ, చట్టాలూ అంటూ కూర్చోలేం. కాబట్టి ఎవరి సమాజాన్ని వారు సంస్కరించుకోవడం అత్యవసరం. ఇప్పుడు అంజనా చౌధురి వర్గం చేస్తున్న పని ఇదే.

'కొందరు ఐఐటీలో చదివి వచ్చినా నిరక్షరాస్యుల మాదిరిగానే ప్రవర్తిస్తూ ఉంటారు గుర్తుంచుకోండి!' అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా. ఈ వ్యాఖ్యలను ఎవరిని ఉద్దేశించి చేసినవో కూడా ఆయన బాహాటంగానే వెల్లడించారు. ఎవరైనా సరే, వాళ్లకి ఉన్న డిగ్రీలను చూసుకుని విరగబడిపోకూడదు. ఆ డిగ్రీల కంటే వాళ్ల జ్ఞానం, ప్రవర్తన ఎలా ఉన్నాయన్నదే అసలు విషయం అన్నారాయన. ఈ



పోశారామె. ఆత్మానుభవమైతే గానీ తత్త్వం బోధపడదంటే ఇదే మరి! కొంపతీసి ఇప్పుడు పవార్ కూడా పరివార్ మనిషేనని టీఎంసీ గడుగ్గాయిలంతా తీర్మానిస్తారా ఏమిటి? ★

# తల్లి చేలో మేస్తే...



తల్లి చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! అన్న సామెత ఉంది. మన విపక్ష నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ అంతు చూస్తామని, సమాధులు కట్టేస్తామని పేలుతూ ఉంటే అది కౌమారంలో ఉన్నవాళ్లకి ఆదర్శంగా మారిపోయింది. మోదీనీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను అంతం చేసేస్తానంటూ ఒక ఈమెయిల్ విడుదలైంది. మొదట దీనిని పంపిన వాడు ఎవడో తెలియక పోలీసులు 'గుర్తు తెలియని' వ్యక్తి మీద కేసు నమోదు చేశారు. తీరా తేలినదేమిటీ అంటే ఇదంతా 16 ఏళ్ల కుర్రాడి నిర్వాకమని నొయిడా పోలీసులు కనిపెట్టారు. ఏప్రిల్ 7వ తేదీన లక్నోలో అరెస్టు చేశారు. అసలు బిహార్ వాడట. సాదాసీదాగా తన మిత్రుల ముందు మాత్రమే తన వీరత్వాన్ని ప్రదర్శిస్తే ఉపయోగం ఉండదనుకున్నాడు కాబోలు. ఏకంగా తన ఈమెయిల్ రక్త సందేశాన్ని ఒక మీడియాసంస్థకే పంపాడు. వాళ్లు దీనిని పతాక శీర్షికగా ప్రచురిస్తారని ఆశపడి ఉంటాడు. ఏముంది? పోలీసులు వచ్చారు. రాజకీయ నాయకులు భావితరాలకు ఆదర్శంగా ఉండే విధంగా మాట్లాడాలి. ఘోరమైన నేరగాళ్లను తయారయ్యే విధంగా కాదు. ★

# ఎంత మంచి సంస్కరణ!

బనాస్కాంత్ ప్రాంతానికి చెందిన ఘనీరా తాలూకాలోని 54 గ్రామాల ప్రజలు ఒకచోట సమావేశమై తమ వర్గంలో అత్యవసరంగా రావలసిన సంస్కరణల గురించి ఏప్రిల్ మొదటివారంలో 21 తీర్మానాలు చేశారు. తమ వర్గంలోని వాళ్లు ఏం చేయవచ్చు, ఏం చేయకూడదు అనే అంశాల మీద చేసినవే అవన్నీ. ఇవన్నీ శిలాశాసనాల వంటివే అనుకోవాలి. ఇలా ఆ కమ్యూనిటీ దేశానికి ఒక దారి చూపించిందనే అనిపిస్తున్నది. మీరు ఇలా చేయకూడదు అని సుద్దులు చెప్పడంతో ఈ సమావేశం ఆగిపోలేదు. ఈ సమావేశం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా భారీ జరిమానా వడ్డించాలని కూడా నిర్ణయించుకున్నారు.

ఎవరైనా కన్నుమూస్తే 12, 13 రోజులలో లాంఛనాల పేరుతో విలాసవంతమైన విందులు ఇవ్వడాన్ని ఈ సమావేశం నిషేధించింది. పెళ్లిళ్లలో డీజేల నిషేధం, వేలాది రూపాయలతో శుభలేఖలు



అచ్చువేయించడంతో పాటు, వేలకు వేలు పోసి హోటళ్లలో పుట్టినరోజు వేడుకలు జరపడం కూడా ఆపాల్సిందేనని తమ వర్గాన్ని ఈ సమావేశం ఆదేశించింది.

ఇంకొక నిర్ణయం కూడా ఉంది. అదే– కుర్రాళ్లు గెడ్డాలు పెంచుకుని తిరగడం గురించి. ఈ విషయం మీద చాలా కఠినంగా వ్యవహరించదలిచినట్టే కనిపిస్తున్నది. ఇకపై తమ వర్గంలో ఏ కుర్రాడైనా గెడ్డం పెంచుకున్నాడా, రూ. 51,000 జరిమానా కట్టుకోవలసిందే. ఈ సమావేశంలోనే శికార్‌పురా నుంచి వచ్చిన గడిపతి దయారామ్‌జీ దీని గురించి, 'హిందూ ధర్మంలో రుషులు, తపోధనులు గెడ్డాలు పెంచుకోవడం రివాజు. అంతే తప్పితే ప్రతివాడు బవిరిగెడ్డం వేసుకుని తిరగడం ఏం బాగుందదు. చూడలేక చస్తున్నాం. అందులోను కుర్రాళ్లు అలా గెడ్డాలు బరుక్కుంటూ తిరుగుతూ ఉంటే వికారంగా ఉంది. కాబట్టి వాళ్లు గెడ్డాలు పెంచడానికి వీల్లేదు. ఏ కుర్రాడైనా గెడ్డంతో తిరిగాడు జరిమానా కట్టాల్సిందే' అన్నారు. ★

# ఎన్ని డిగ్రీలు అని కాదు జ్ఞానమెంత అన్నదే ముఖ్యం

మధ్య ప్రధాని నరేంద్ర మోదీ తన డిగ్రీ చూపించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏక గగ్గోలు పెడుతున్న సంగతి తెలిసిందే కదా! అన్నట్టు అన్ని తప్పుడు పనులు చేసి, జైలులో కూర్చుని కూడా ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి దేశానికి సుద్దులు చెప్పాడు. దేశానికి చదువుకున్న ప్రధాని లేకపోతే ఉపద్రవాలు వస్తాయట. సరిగ్గా ఆ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకునే సక్సేనా ఈ మాటలు అన్నారు. ప్రధాని తన డిగ్రీ సర్టిఫికెట్ చూపించాలని కేజ్రీవాల్ శాసనసభలో మాట్లాడుతూ కూడా అడిగారు. అంత మర్యాదస్తుడాయన. ఇలా చదువుకున్నామని, పొడవాటి డిగ్రీలు ఉన్నాయని కొందరు విరగబాటు చూపడం ఈ మధ్య గమనించాను. ఎవరైనా డిగ్రీలని చూసి పొంగిపోకూడదు. జ్ఞానం సంగతి చూసుకోవాలి అన్నారాయన. అన్నట్టు ఎన్సీపీ నాయకుడు శరద్ పవార్ కూడా ఈ డిగ్రీల రగడ ఏమిటి? అని గట్టిగానే మాట్లాడారు. ఆ వివాదం అంత అవసరమా అని విలేకరుల సమావేశంలోనే అనేశారు. రాష్ట్రీయ లోక్‌దళ్ నాయకుడు జయంత్ చౌదరి కూడా ఇదేమీ పనికొచ్చే ఉద్యమం కాదని కేజ్రీవాల్ కళ్లు తెరిపించే ప్రయత్నం చేశారు. ★

## కథ

టంగుటూరి ప్రకాశం పంతులు ఉన్నత పాఠశాల చాలా గంభీరంగా ఉంది. చెల్లూరి శ్రీనివాసరావు అందులో మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ రోజే ఆయన పదవీ విరమణ చేస్తున్నాడు. సరిగ్గా నాలుగు గంటలకు వీడ్కోలు సభ ప్రారంభమయింది. 'ఆకాశంలో వెలిగే ధృవనక్షత్రాలం మేమైతే.. ఆ వెలుగు వెనకనున్న తెర ఆకాశం మా మాష్టరు'. 'బ్రహ్మాస్త్రాన్ని సంధించే మహావీరులం మేమైతే.. ఆ అస్త్రాన్ని సంధించటానికి ఉపకరించే మంత్రమే మా మాష్టరు'. 'ఆరు అంతస్తుల అందమైన భవంతులం మేమైతే.. ఆ భవంతులకు ఆరంభంలో పునాది రాళ్లను పేర్చిన మేస్త్రీ మా మాష్టరు'... ఇలా విద్యార్థులు ఒక్కొక్కరు వచ్చి, పలుకుతున్న ప్రతి పలుకు దేవుడి పూజలో పునీతమవుతున్న పుష్పాల్లా మారిపోతున్నాయి. తోటి ఉపాధ్యాయులు, హెడ్ మాష్టరు గారు మాట్లాడిన తరువాత చివరగా శ్రీనివాసరావు వంతు వచ్చింది.

సాధారణంగా ఇలాంటి సందర్భాలలో పదవీవిరమణ చేస్తున్న వ్యక్తులు చాలా విచారంగా ఉంటారు. బాధను మోస్తూ, మాటలు రాక, కన్నీళ్లు తోడుగా కనిపిస్తారు. అందుకు భిన్నంగా ఉన్నాడు శ్రీనివాసరావు. మందహాసంతో మాట్లాడటం మొదలుపెట్టాడు. 'పదవీ విరమణ అన్నది జీవితానికి అంతిమ దశ ఏ మాత్రమూ కాదు. నవజీవనానికి ఆరంభ సమయమిది. నదిగా నా క్రొత్త జీవితం ఇప్పుడే, ఇక్కడే ప్రారంభమవుతోంది. ఆరంభించ బోయే నా సరిక్రొత్త విస్తారమైన జీవితానికి స్వాగతం పలికిన మీ చప్పట్లకు నా ధన్యవాదాలు. భగవంతుడు నాకిచ్చిన అద్భుతమైన వరాలలో మొదటిది నా విద్యార్థులు. ఈ రోజుతో ఆ సంబంధం ఆగిపోవటం లేదు. ఇంటివద్ద నుంచే ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఉచితంగా బోధనను కొనసాగిస్తాను. ఆఖరి శ్వాసలో సైతం ఉపాధ్యాయుడిగానే మరణించాలని నా ఆశయం' అన్నాడు. కరతాళ ధ్వనులతో పాఠశాల ప్రాంగణం మారుమ్రోగిపోయింది.

* * *

శ్రీనివాసరావు లాంటి మనుషులు చాలా అరుదుగా కనిపిస్తారు. రోజూచేసే పనుల్లో తనకు చాలా ఇష్టమైన పని పరోపకారం. ఎవరికైనా సహాయం చేయడమంటే ఎంత సంతోషమో శ్రీనివాసరావుకు! అందుకు రాత్రి, పగలు తేడా ఉండదు. ఎంత దూరమైనా వెళ్తాడు, ఎంత ఖర్చయినా భరిస్తాడు. ఆపదలో ఎంతమందిని ఆదుకున్నాడో లెక్కలు రాస్తే పెద్ద పద్దయిపోతుంది. మంచితనాన్ని రక్షకణంలా మార్చుకున్న శ్రీనివాస రావు జాలి, దయ గుణాలను ఎపుడూ వెంటపెట్టు కొని తిరుగుతూనే ఉంటాడు. చలికాలం వచ్చిందంటే చాలు, ఏ బస్టాండుకో, రైల్వేస్టేషన్కో వెళ్లి చలికి గజగజ వణికిపోతున్న అనాథులకు దుప్పట్లు పంచుతూ ఉంటాడు.

వీధుల్లో తిరుగుతున్న చాలామంది పిల్లలకు నచ్చజెప్పి, జీవితం మీద ఆశ కల్పించి, విద్యాబుద్ధులు నేర్పించే కేంద్రాలలో చేర్పిస్తాడు. అలా చేరిన వాళ్లకు శ్రీనివాసరావంటే దేవుడు. ఇక దీపావళి వచ్చిందంటే అందరికి టపాకాయలు తానే కొంటాడు. సంక్రాంతికి పదిరోజులు ముందే అనాథ పిల్లలందరికి కొత్త బట్టలు కుట్టిస్తాడు. పరీక్షలు పాస్కాలేక బాధ పడుతున్న పిల్లల్ని దగ్గరికి తీసుకొని ఓదార్చేవాడు. అలాంటి వాళ్లందరికి, ఇంటి దగ్గరే సాయంకాలం పాఠాలు ఉచితంగా బోధిస్తూ, అవసరమైతే పుస్తకాలు సైతం తానే కొంటూ ఉంటాడు.

ఈ పనులన్నీ తాను ఒక్కడే ఎప్పుడూ చేయడు. ఆయన వెంట ఎపుడూ ఆయన భార్య జానకమ్మ ఉంటూనే ఉంటుంది. శ్రీనివాసరావు మనసులోని ప్రతి ఆలోచనకు జీవంపోసే బాధ్యతను ఆమె ఎంతో సంతోషంగా స్వీకరిస్తుంది. ఆయన తన మెడలో తాళి కట్టినందుకు కాదు ఆమె మురిసిపోయేది. మానవత్వాన్ని ఇంత గొప్పగా నింపుకున్న భర్త తత్వానికి పొంగిపోతూ ఉంటుంది. 'జీవితంలో ఎవరికైనా నేను రుణపడి ఉన్నానంటే అది ఒక్క నా భార్యకే...' అంటూ శ్రీనివాసరావు పదే పదే అనటం వెనక ఆమె అందిస్తున్న సహకారం ఎంత అమూల్యమైనదో తెలుస్తుంది.

ఒకసారి జానకమ్మ స్నేహితురాలు సరోజ వచ్చి 'మీ ఆయన నిన్ను ఎలా చూసుకుంటారు?' అని అడిగింది. సమాధానం చెప్పేలోపలే భర్త అనురాగం గుర్తుకొచ్చి జానకమ్మకు ఆనంద బాష్పాలు రాలాయి. కన్నీళ్లు తుడుచుకుంటూ ఇప్పటికీ నన్ను దాదాపు ఒక చంటిబిడ్డలాగే చూసుకుంటు న్నారు. ఎంత ప్రేమో ఆయనది నేను మాటల్లో చెప్పలేను. 'ఒకసారి నా చేయి పట్టుకుని ఆయన ఏమన్నారో తెలుసా? నా అరచేతి పిడికిళ్ల లోపల ఆయన తన ఆయుష్షును భద్రపరచు కుంటారట. నాకయితే ఆ మాట విని ఎంత ఏడుపు వచ్చిందో చెప్పలేను. చెప్పలేనంత పిచ్చి ప్రేమ ఆయనిది.' అంది కన్నీళ్లను తుడుచు కుంటూ జానకమ్మ.

రోజూ ప్రొద్దుటే భార్యాభర్తలిద్దరు వాకింగ్కి వెళతారు. క్రమం తప్పకుండా యోగా చేయటం శ్రీనివాసరావుకు అలవాటు. ప్రత్యేకమైన జాగ్రత్తలు ఏమీ తీసుకోకపోయినా ఎపుడూ ఆరోగ్యంగానే ఉండేవాడు శ్రీనివాసరావు. ఏమయిందో ఏమో తెలియదు కానీ అర్ధరాత్రి లేచి దాహంగా ఉందని నీళ్ల కోసం నాలుగు అడుగులు వేశాడంతే. ఒక్క సారిగా మనిషి ఉన్నట్టుండి కుప్పకూలి పోయాడు. వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు.

పరిస్థితి చాలా విషమంగా ఉందని శ్రీనివాస రావుకు వెంటనే అత్యవసర చికిత్స మెదలుపెట్టారు. రాత్రంతా జానకమ్మ ఏడుస్తూనే ఉంది. ఏడ్చి, ఏడ్చి జానకమ్మ కళ్లల్లో నీళ్లు ఇంకి పోయాయి. తన భర్తకు ఏమీ కాకూడదని వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటూనే ఉంది. కళ్లు మూతలు పడటం లేదు. కనురెప్పల మధ్య భయం, ఆందోళన మహాభీకరంగా ఆమె మీద దండయాత్రలు చేస్తున్నాయి. తెల్లారింది. విషయం తెలిసి, తెలిసిన వారంతా వచ్చారు. ఎవర్ని లోపలికి వెళ్లనీయటం లేదు. మరో రెండు గంటలు దాటితేకానీ ఏం చెప్పలే మన్నారు డాక్టర్లు. అందరూ దిగులుగా కూర్చున్నారు. అందరిలోనూ భరించలేనంత మౌనం. దిక్కుతోచక అందరి మధ్య మాటలు కూడా కరువై పోయాయ్.

డాక్టర్లు చెప్పిన రెండు గంటలు దాటిపోయాయి.



# గురుసాక్షాత్

డాక్టర్ కేజీ వేణు



ఇంకా ఎవరూ బయటికి రాలేదు. జానకమ్మ చూపులు మూసిన తలుపుల మీదే అతుక్కుపోయి ఉన్నాయి. పైకి లేచి నిలబడింది. డాక్టర్లు చెప్పే మంచి వార్తకోసం మనసు ఆత్రుతపడుతోంది. 'ఆయనకేమీ కాదు. ఆయన నాకేమీ అన్యాయం చేయరు. ఆయనతో మాట్లాడాలి.. తనివితీరా మాట్లాడాలి.. ఒకవేళ ఆయన మాట్లాడలేకపోతే...' ఆ ఊహను భరించలేక పోయింది జానకమ్మ. ఒంట్లో ఉన్న సత్తువంతా శూన్యమైపోయి నిలబడలేక కన్నీళ్లతో క్రిందపడబోతూ కుర్చీని గట్టిగా పట్టుకుని కూర్చుండి పోయింది.

ఇంతలో డాక్టర్లు బయటికి వచ్చారు. అందరూ లేచి నిలబడ్డారు. రెండు చేతుల్తో దండం పెడుతూ నిలబడింది జానకమ్మ. ఎందుకో ఏడుపు వరదల్లా తన్నుకొస్తోంది... డాక్టర్లవైపు చూసింది, భోరుమని ఏడ్చింది. వచ్చిన జనమంతా డాక్టర్ల చుట్టూ చేరిపోయారు. అంతా నిశ్శబ్దం.. "చెప్పండి డాక్టర్... ఏమయింది' అంటూ కళ్లతోనే అర్థించింది జానకమ్మ. డాక్టర్ ఒక్క అడుగు ముందుకు వేసి 'సారీ మేడమ్.. మేం ఎన్నో ప్రయత్నాలు చేశాం. కానీ ఆయన మనకు దక్కలేదు.' అని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తరువాత జానకమ్మకు ఏమీ కనిపించలేదు, వినిపించలేదు. ప్రపంచమంతా శూన్యమైపోయింది. ఉన్నచోటే కూలబడి పోయింది. తన నుదుటి కుంకుమ రాలిపోయిన ఆ క్షణంలో 'అయింది ఆమె, వింతలా, వితంతువులా, తీగలు తెగిన వీణలా, ఎండిన మ్రానులా, మాటలు రాని రాయిలా, కదలలేని శిలలా.. కన్నీరు మాత్రమే తెలిసిన విషాదంలా...' చుట్టూ అందరిలోనూ కొలతలకు అందని విషాదం. ఫలితంగా ధారగా అందరిలోనూ కన్నీళ్లు.

'ఆసుపత్రిలో జరగవలసిన కార్యక్రమం పూర్తయింది. ఇక మీరు శవాన్ని ఇంటికి తీసికెళ్లి పోవచ్చు' చెప్పి వెళ్లిపోయారు ఆసుపత్రి సిబ్బంది. ఒక్కసారి జానక్మ.. ఆ పక్కనే నిలబడ్డ నారాయణరావు వైపు చూసింది. ఆయన ఇంట్లోనే తాము అద్దెకు ఉంటున్నారు. ఒకప్పుడు అప్పుల్లో కూరుకుపోయి, వత్తిళ్లు భరించలేక ఆత్మహత్యకు సిద్ధమైన నారాయణ రావుకు ధైర్యం చెప్పి, తాను దాచుకున్న డబ్బుతో అప్పులు తీర్చి నారాయణరావు పరువు కాపాడింది శ్రీనివాసరావే. ఏదో చెప్పాలని దగ్గరికి వచ్చి చెప్పలేక పోతున్న నారాయణరావు వైపు తిరిగి 'చెప్పండి' అంది జానకమ్మ.

'మరేంలేదమ్మా.. తప్పుగా మాట్లాడుతున్నానని అనుకోకపోతే ఒక చిన్నమాట. దయచేసి శవాన్ని మాత్రం ఇంటికి తీసుకురాకండి. ఆ ఇంట్లో శవ సంస్కారాలు జరిగి, శవం ఆ ఇంటి నుంచి వెళ్లిపోతే.. మీరు ఇల్లు ఖాళీ చేశాక ఆ ఇంట్లో మరెవరూ వెంటనే అద్దెకు దిగరు. నేను చాలా నష్టపోతాను. దయచేసి నా బాధను అర్థం చేసుకోండి. మీరు మరో ఏర్పాట్లు చేసుకోండమ్మా.. ఖర్చులకు కావాలంటే డబ్బు నేనిస్తాను. ఇలా అంటున్నానని మరోలా భావించకండి' అంటూ చెప్పి వెనక్కి వెళ్లి నిలబడ్డాడు.

తరువాత వెనక నిలబడ్డ హనుమంతరావు వంతు వచ్చింది. పెళ్లయిన ఆరునెలలకే తన కూతురు గాయత్రి ఇంటికి చేరింది. ససేమిరా తనకు ఈ పిల్ల అక్కరలేదన్నాడు అల్లుడు. తన జీవితం నాశనమయిందని గోడు గోడున ఏడుస్తూ కుమిలిపోయింది కూతురు. ఆ సమయంలో అబ్బాయిని, అమ్మాయిని తన ఇంట్లో కూర్చోపెట్టి దాంపత్య జీవితం గురించి, భార్యాభర్తల అనుబంధం గురించి, భారతీయ సంస్కృతిలో ఉన్నతంగా సాగిపోతున్న వివాహ విశిష్టత గురించి, పరస్పర అవగాహనతో, తెలుగు పద్యంలా సంసారం ఎలా సాగించుకోవాలో అర్థమయ్యేలా వివరించాడు శ్రీనివాసరావు. పాఠాల్ని బాగా విన్నారేమో మొత్తానికి అబ్బాయి, అమ్మాయి సర్దుబాటు పరీక్షలో పాసైపోయారు. ఇద్దరి మధ్య అవగాహన కుదిరింది. ఆ తరువాత గాయత్రి సంసారం వెన్నెల్లో గోదావరిలా సాగిపోయింది. శ్రీనివాసరావుగారి దయ వల్లే తన

కూతురు సంసారం నిలబడిందని ఆ రోజుల్లో ఊరందరితో చెప్పుకున్నాడు హనుమంతరావు.

ఎలా చెప్పాలో తెలియక చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు హనుమంతరావు. 'చెప్పండి..' అంది జానకమ్మ. 'మరేం లేదమ్మా.. మాష్టారు గారి శవాన్ని మా ఇంటికి తీసుకు వెళ్లాలనే ఉంది. తీసుకెళ్లి వైభవంగా శవ సంస్కారాలు చేయాలనే ఉంది. వచ్చిన ఆటంకం ఏమిటంటే.. మీ ఇద్దరి దయవల్ల నా కూతురు కాపురం నిలబడి ఇప్పుడు దాని కడుపున ఒక కాయ కాయబోతూ ఉంది. ప్రస్తుతం నెలలు నిండి ప్రసవానికి ఇంటికి వచ్చింది. నెలలు నిండిన బిడ్డను ఇంట్లో పెట్టుకుని శవాన్ని మా ఇంటికి తీసుకెళ్ల టమంటే...' నీళ్లు నమిలాడు హనుమంతరావు.

'దిగులు పడకండి ఆయన మీ ఇంటికి రారు...' అంది జానకమ్మ. నమస్కారం చేస్తూ వెనక్కి వెళ్లి నిలబడ్డాడు హనుమంతరావు. పిలవకుండానే వచ్చి నిలబడ్డాడు శివసుబ్రహ్మణ్యం... 'చెప్పండి..' అన్నట్లు చూసింది జానకమ్మ...'అమ్మా మీకు తెలియంది కాదు... ఈ మధ్యనే మా అమ్మగారు పోయారు. ఆ సమయంలో నా చేతిలో చిల్లిగవ్వ లేకపోతే శ్రీనివాసరావుగారే మొత్తం ఖర్చులు భరించి ఆ రోజు కార్యక్రమాన్ని పూర్తి చేయించారు. ఆ రుణం నేను తీర్చుకోలేను.. కాకపోతే మొన్ననే ఒక శవం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది.. ఇప్పుడు మళ్లీ మరో శవం అంటూ ఆగి మాటలు రాక నిలబడిపోయాడు శివసుబ్రహ్మణ్యం. సరే.. అన్నట్లు మౌనంగానే తల ఆడించింది జానకమ్మ..

ఇంతలో జానకమ్మ స్నేహితురాలు సరోజ వచ్చి దగ్గరగా కూర్చుని భుజం మీద చేయి వేసింది. స్నేహితురాలి స్పర్శతో ఏడుపు ఆపుకోలేక పోయింది జానకమ్మ. స్నేహితురాలిని గుండెలకు హత్తుకొని ఓదార్చింది సరోజ. ఇద్దరూ మంచి స్నేహితురాళ్లు.




**జానకమ్మ మెల్లగా పైకి లేచింది. అందర్ని ఒకసారి తేరిపార చూసింది. అందరూ తలవంచు కొని ఉన్నారు. మాట్లాడటం మొదలుపెట్టింది.. 'చూడండి నా భర్త బ్రతికుండగా తాను ఇబ్బందులు పడ్డారే కానీ, ఏనాడూ ఎవరికి ఏ విధమైన ఇబ్బంది కలిగించలేదు. ఇప్పుడు అంతే. చనిపోయిన తరువాత కూడా ఎవరికి ఏ రకమైన ఇబ్బంది కలిగించరు.**

ఒకరోజు రాత్రి సరోజ, ఆమె భర్త జగదీశ్వరరావు స్కూటర్ మీద వస్తూ ఉంటే మలుపు తిరిగేచోట వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఇద్దరూ చెల్లాచెదురుగా నేల మీద పడిపోతే జగదీశ్వరరావుకు కాలు విరిగినట్లుగా ఉంది. నొప్పి భరించలేక పోతున్నాడు. సరోజ దాదాపు స్పృహ తప్పిపోయి పడిపోయి ఉంది. జనమంతా గుమిగూడిపోయారు. దూరంగా ఉండి వింతగా చూస్తున్నారే తప్ప, ఆదుకోవటానికి ఎవరూ ముందుకు రావటం లేదు.

అనాథ పిల్లలకు నోటు పుస్తకాలు పంచి, ఇంటికి వస్తున్న శ్రీనివాసరావు దంపతులే ఆ ఇద్దర్ని ఆసుపత్రిలో చేర్చి సకాలంలో వైద్యం అందేలా చేశారు. అవసరమైన మందులన్నీ కొన్నారు. 'మాకు పునర్జన్మ శ్రీనివాసరావు గారి వల్లే వచ్చిందని వాళ్లు చెప్పుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. ఆ విధంగా రెండు కుటుంబాల మధ్య స్నేహం బలంగానే పెనవేసుకుంది.


సరోజ ఏం చెబుతుందా? అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఇంతలో సరోజ చెప్పటం మొదలు పెట్టింది. 'జానకీ నన్ను క్షమించమని అడగలేక పోతున్నాను. మీ ఇద్దరి దయవల్లే ఆ రోజు మేము ప్రమాదం నుంచి కోలుకున్నాం. ఇప్పుడు మీ పరిస్థితి అర్థమయింది. కాని కొన్ని ఇబ్బందుల వల్ల నేనేమీ చేయలేక పోతున్నాను. మా అమ్మాయిని చూసుకోవటానికి ఈ రోజు పెళ్లి సంబంధం వాళ్లు వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో..' చెప్పలేక ఆగిపోయింది సరోజ. సరే! అన్నట్లు చూసింది జానకమ్మ. ఇప్పుడు అందరి మధ్య గాఢమైన నిశ్శబ్దం చోటుచేసుకుంది.

అక్కడ నిలబడ్డ వాళ్లల్లో చాలామంది శ్రీనివాసరావు ఉపకారాన్ని అందుకున్నవాళ్లే. తమ, తమ కష్టాల్లో కన్నీళ్లు పెట్టుకొని శరణుకోరిన వాళ్లే.. ఎవరు ఏదడిగినా కాదనేవాడు కాదు శ్రీనివాసరావు.. మరి ఈ రోజు ఆయన శవం ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. సహాయం చేయటానికి ఎవరూ ముందుకు రావటం లేదు. ఇప్పుడు అందరిలోనూ ఒక్కటే ఆలోచన 'జానకమ్మ ఇపుడు శవాన్ని ఎక్కడికి తీసుకెళుతుంది. అసలు ఈ శవానికి సంస్కారం జరుగుతుందా లేదా? శవసంస్కారం జరగకుండానే దహన సంస్కారం జరుగుతుందా?

జానకమ్మ మెల్లగా పైకి లేచింది. అందర్ని ఒకసారి తేరిపార చూసింది. అందరూ తలవంచు కొని ఉన్నారు. మాట్లాడటం మొదలుపెట్టింది.. 'చూడండి నా భర్త బ్రతికుండగా తాను ఇబ్బందులు పడ్డారే కానీ, ఏనాడూ ఎవరికి ఏ విధమైన ఇబ్బంది కలిగించలేదు. ఇప్పుడు అంతే. చనిపోయిన తరువాత కూడా ఎవరికి ఏ రకమైన ఇబ్బంది కలిగించరు.

ఇక తన శరీరాన్ని శ్మశానంలో కాల్చటమో లేక పూడ్చటమో ఆయనకు ఇష్టం లేదు. 'బ్రతికుండగా పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు ఆయన. చనిపోయిన తరువాత కూడా పాఠాలు బోధించా లన్నది ఆయన ఆశయం. అందుకే తన మరణా నంతరం తన దేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయటానికి తన సమ్మతిని ఎప్పుడో తెలియజేశారు. అందుకు నాకూ కూడా ఎలాంటి అభ్యంతరం లేదు. అందువల్ల ఆయన శవం ఎవరి ఇంటికి వెళ్లదు. సరాసరి మెడికల్ కాలేజీకే వెళుతుంది..' అంది జానకమ్మ. ఆ మాటతో సిగ్గుపడిన తలలు తెగిన ఆకుల్లా నేల మీద రాలినట్టయింది. అప్రయత్నంగానే అందరూ నమస్కారం చేశారు.

ఇంతలో మెడికల్ కాలేజీ నుంచి వచ్చిన వ్యాన్ ఆసుపత్రి గేటు ముందు ఆగింది. శ్రీనివాసరావు పార్థివదేహాన్ని అందరూ కలిసి అందులోకి ఎక్కిస్తు న్నారు. 'గురుబ్రహ్మా గురుర్విష్ణుః, గురుర్దేవో మహే శ్వరః గురుః స్సాక్షాత్ పరబ్రహ్మా, తస్మైశ్రీ గురవే నమః..' శ్లోకం ఆకాశం నిండా ప్రతిధ్వనించింది. ★






# ఐపీఎల్-16లో అరుదైన రికార్డులు!

క్రికెట్ అభిమానుల వేసవి వినోదం ఐపీఎల్-16వ సీజన్ పోటీల ప్రారంభంలోనే రికార్డుల మోత మోగింది. 10 జట్ల రౌండ్ రాబిన్ లీగ్ సమరం మూడు మ్యాచ్‌లు, ఆరు రికార్డులు అన్న తీరుగా సాగిపోతూ అభిమానులను ఓలలాడిస్తోంది. ఈ సీజన్ గత 15 సీజన్లకు భిన్నంగా సాగిపోతోంది. దేశంలోని పలు నగరాలు వేదికలుగా సాగుతున్న 10 జట్లు, 70 మ్యాచ్‌ల ఈ లీగ్ పోరు మొదటి 14 రౌండ్లకే పలు అరుదైన రికార్డులు నమోదయ్యాయి. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్-చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన తొలిరౌండ్ మ్యాచ్ నుంచి.. హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా సన్ రైజర్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ముగిసిన 14వ మ్యాచ్ వరకూ రికార్డులు హోరెత్తాయి.

ఐపీఎల్‌లో రెండుసార్లు విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రస్తుత సీజన్లో సంచలనం వెంట సంచలనం సృష్టిస్తూ ప్రత్యర్థి జట్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. కోల్‌కతా జట్టులోని దేశవాళీ క్రికెటర్లు అంచనాలకు మించి రాణిస్తూ తమ జట్టుకు అపూర్వవిజయాలు అందించారు. ప్రారంభ మ్యాచ్‌లో పరాజయం పొందినా ఆ తర్వాతి రెండు రౌండ్లలో కోల్‌కతా తిరుగులేని విజయాలు సాధించింది. హోంగ్రౌండ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన పోరులో బెంగళూరు రాయల్ చాలెంజర్స్, అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదిక ముగిసిన మూడో రౌండ్ పోరులో గుజరాత్ టైటాన్స్ జట్లపై అనూహ్య విజయాలు సాధించింది. మొదటి 14 రౌండ్ల మ్యాచ్‌ల్లో అతిపెద్ద విజయం నమోదు చేసిన జట్టుగా కోల్‌కతా నైట్ రైడర్స్ నిలిచింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన రెండోరౌండ్ పోరులో కోల్‌కతా 81 పరుగులతో బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌ను చిత్తు చేసింది. అంతేకాదు, కోల్‌కతా పేస్ ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ తన ఐపీఎల్ కెరియర్‌లోనే తొలి హాఫ్ సెంచరీ నమోదు చేయడం ద్వారా జంట రికార్డులు నెలకొల్పాడు. 20 బంతుల్లోనే అర్ధశతకం బాదడం ద్వారా ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ హీరో జోస్ బట్లర్ రికార్డును సమం చేశాడు.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

### సూపర్ ఓపెనర్ శిఖర్ ధావన్

ప్రస్తుత సీజన్ మొదటి తొమ్మిది మ్యాచ్‌ల్లో బ్యాక్ టు బ్యాక్ హాఫ్ సెంచరీలతో చెన్నై సూపర్ కింగ్స్ ఓపెనర్ రుతురాజ్ గయక్వాడ్ టాపర్‌గా నిలిస్తే.. పంజాబ్ కెప్టెన్ శిఖర్ ధావన్ ..సన్ రైజర్స్ పైన 99 పరుగుల నాటౌట్ స్కోరు సాధించడం ద్వారా అగ్రస్థానంలో నిలిచాడు. మూడు ఇన్నింగ్స్‌లో 3 హాఫ్ సెంచరీలతో 225 పరుగులు చేయడం ద్వారా ఆరెంజ్ క్యాప్ అందుకోగలిగాడు.

### బౌలింగ్‌లో మార్క్‌వుడ్ టాప్

మొదటి తొమ్మిది రౌండ్ల మ్యాచ్‌ల్లో అత్యుత్తమ బౌలర్‌గా లక్నో సూపర్ జెయింట్స్ మెరుపు ఫాస్ట్ బౌలర్ మార్క్‌వుడ్ నిలిచాడు. రెండుమ్యాచ్‌ల్లో మార్క్‌వుడ్ 8 వికెట్లు పడగొట్టాడు. తొలిరౌండ్ మ్యాచ్‌లో 14 పరుగులకే 5 వికెట్లు సాధించడం ద్వారా అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన చేయగలిగాడు. రాజస్థాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చాహల్ రెండుమ్యాచ్‌ల్లో 5 వికెట్లు పడగొట్టడం ద్వారా ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక వికెట్లు సాధించిన భారత తొలిబౌలర్‌గా నిలిచాడు. చాహల్ తన కెరియర్‌లో 122 మ్యాచ్‌లు ఆడి 170 వికెట్లు పడగొట్టడం ద్వారా డ్వయన్ బ్రావో తర్వాతి స్థానంలో నిలిచాడు. అంతేకాదు, టీ-20 ఫార్మాట్లో 300 వికెట్ల మైలురాయిని సైతం చేరుకోగలిగాడు.

### రషీద్ ఖాన్ సీజన్ తొలి హ్యాట్రిక్

ప్రస్తుత సీజన్లో తొలి హ్యాట్రిక్ సాధించిన బౌలర్‌గా గుజరాత్ టైటాన్స్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నిలిచాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్ 17వ ఓవర్లో యాండ్రీ రస్సెల్, సునీల్ నరైన్, శార్దూల్ ఠాకూర్‌లను మూడు వరుస బంతుల్లో పడగొట్టడం ద్వారా హ్యాట్రిక్ హీరోగా నిలిచాడు.

### 50 హాఫ్ సెంచరీల కోహ్లీ

ముంబై ఇండియన్స్‌తో హోంగ్రౌండ్ బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా ముగిసిన తొలి రౌండ్ పోరులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మెరుపు హాఫ్ సెంచరీతో అజేయంగా నిలవడం ద్వారా ఓ సరికొత్త రికార్డు సాధించాడు. ఐపీఎల్‌లో ఇప్పటికే ఎన్నో అరుదైన రికార్డులు నెలకొల్పిన విరాట్.. సరికొత్తగా 50 హాఫ్ సెంచరీలు సాధించిన భారత తొలి బ్యాటర్‌గా నిలిచాడు. సహ ఓపెనర్ డూప్లెసీతో కలిసి మొదటి వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడం ద్వారా ముంబై బౌలర్లను ఓ ఆటాడుకొన్నాడు. విరాట్ కేవలం 49 బాల్స్ లోనే 82 పరుగులతో అజేయంగా నిలిచాడు.

### అశ్విన్ రికార్డు

ఐపీఎల్ చరిత్రలో బ్యాటింగ్ ఆర్డర్లోని అన్ని స్థానాలలోనూ బ్యాటర్‌గా దిగిన ఏకైక ఆటగాడిగా రాజస్తాన్ రాయల్స్ స్పిన్ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ నిలిచాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన పోరులో అశ్విన్ ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగడం ద్వారా ఈ ఘనత సాధించాడు. అశ్విన్ తన ఐపీఎల్ కెరియర్‌లో ఒకసారి ఓపెనర్‌గా, నాలుగుసార్లు వన్ డౌన్ బ్యాటర్‌గా, ఒకసారి రెండోడౌన్ లోనూ, రెండుసార్లు 5వ నంబర్ స్థానంలోనూ, ఆరుసార్లు 6వ డౌన్, 16సార్లు 7వ డౌన్, 32 సార్లు 8వ డౌన్, 11సార్లు 9వ డౌన్, 10సార్లు 10వ డౌన్ లోనూ బ్యాటింగ్‌కు దిగిన ఘనత అశ్విన్‌కు ఉంది. మొత్తం 70 మ్యాచ్‌ల ఐపీఎల్ రౌండ్ రాబిన్ లీగ్ మొదటి తొమ్మిది మ్యాచ్‌ల్లోనే ఇన్ని రికార్డులు నమోదైతే.. మిగిలిన 61 మ్యాచ్ ల్లో మరెన్ని సరికొత్త రికార్డులు వచ్చి చేరుతాయో మరి. ★

# జాగృతి వజ్రోత్సవాల సందర్భంగా కాకినాడలో మేధావుల సదస్సు





**కాకినాడ :** జాతీయ వారపత్రిక 'జాగృతి' చేసిన సేవలను కాకినాడలో జరిగిన మేధావుల సదస్సు కొనియాడింది. స్థానిక ఆర్.ఎస్.ఎస్.కార్యకర్తల ఆధ్వర్యంలో జెఎన్‌టియు సెనేట్‌హాల్‌లో ఏప్రిల్ 8న ఈ సమ్మేళనంజరిగింది. జాగృతివజ్రోత్సవాల(75 సం.లు) సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ డా।। జివిఆర్ ప్రసాదరాజు హాజరయ్యారు. అతిథులుగా డా।।కె.వి.రమణ (రెక్టర్), డా।।ఎల్.సుమలత (రిజిష్టర్), డా।।ఎమ్. హెచ్.ఎమ్. కృష్ణప్రసాద్(ప్రిన్సిపల్) పాల్గొన్నారు. ఆర్.ఎస్.ఎస్.ఆంధ్రప్రదేశ్ ప్రాంతకార్యకారిణి సదస్యులు తులసి సూర్యప్రకాశ్ ముఖ్యవక్తగా పాల్గొని జాగృతి పత్రిక విశిష్టతను వివరించారు.


# సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సమతామూర్తుల జయంత్యుత్సవాలు






**కాకినాడ :** సమతామూర్తుల జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 5 నుండి 14 వరకు ఆంధ్రప్రదేశ్ అంతటా జరిగాయి. అందులో భాగంగా కాకినాడలోని సత్కళావాహిని భవనంలో ఏప్రిల్ 9న జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్వజన సమాజ్ జాతీయ అధ్యక్షుడు డా।। రత్నాకర్, వక్తగా నవయుగభారతి ప్రచురణ సంస్థ సంపాదకులు డా।। వడ్డి విజయసారథి తదితరులు పాల్గొన్నారు.





**సామర్లకోట :** ఏప్రిల్ 5 న సామర్లకోటలో జరిగిన సమతామూర్తుల జయంతి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డా।। వడ్డి విజయసారథి

# మతం మారితే రిజర్వేషన్ రద్దు చేయాలి


## పాడేరులో గిరిజన సురక్షామంచ్ డిమాండ్





**పాడేరు :** మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, వారికి రిజర్వేషన్లు వర్తింపజేయవద్దని గిరిజనులు డిమాండ్ చేశారు. గిరిజన (జనజాతి) సురక్షామంచ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 9న పాడేరు పట్టణంలో తలార్‌సింగ్ గౌతమి పాఠశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సుంద్రుపుట్టు, మెయిన్‌బజార్, పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలవరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ పార్లమెంట్‌సభ్యులు సోయం బాబురావు హాజరయ్యారు. మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఢిల్లీ స్థాయిలో ఉద్యమం చేస్తామని ఆయన అన్నారు. బిర్సా ముండా, కొమురం భీం, మల్లుదొర, గంటదొర వంటి గిరిజన వీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని పోరాటాలు ఆయన పిలుపునిచ్చారు. మతంమారిన గిరిజనులకు రిజర్వేషన్లు వర్తింపజేయకుండా చట్టం తేవాలని దేశ ప్రధానికి ప్రతి గిరిజనుడు లేఖ రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక అఖిల భారత గౌరవ అధ్యక్షుడు కె.నాగు, గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు వివేక్ నాయక్, ఐక్యవేదిక సంఘటన మంత్రి సూర్యనారాయణ, సద్గురు సేవా ఆశ్రమం వ్యవస్థాపకుడు సాయిరాం స్వామీ, బలిఘట్టం ఉత్తరవాహిని ఆశ్రమం వ్యవస్థాపకుడు రామానంద స్వామి, గిరిజన సురక్షామంచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకూరు కరుణాకర్, గిరిజన సురక్షామంచ్ రాష్ట్ర కార్యదర్శి ఉబ్బేటి నాగశ్వరరావు, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిముడు దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏడువేలమంది గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## రైతుల ప్రాథమిక శిక్షావర్గ





**అనంతపురం:** రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్, అనంతపురం జిల్లా రైతుల ప్రాథమిక శిక్షావర్గ తాడిపత్రిలో ఏప్రిల్ 3 నుంచి 9వరకు జరిగింది. శిక్షార్థుల సంఖ్య:-51. ఏప్రిల్ 9న జరిగిన సమారోప్‌లో ముఖ్య అతిథిగా మట్టా లక్ష్మి నారాయణ రెడ్డి(JCDR agricultural college principal), ప్రధానవక్తగా విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ బలరామకృష్ణ పాల్గొన్నారు.

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## భ్రమరాంబ ఆలయం - బౌరాపూర్



తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, బౌరాపూర్‌లో ఈ ఆలయం కొలువుదీరింది. భ్రమరాంబ దేవి పేరుమీదుగా ఈ గ్రామానికి బౌరాపూర్ అనే పేరు వచ్చింది. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ వాస్తు శిల్పశైలిని, విగ్రహాలని బట్టి మలి చాళుక్యుల కాలం నుండి రేచర్ల పద్మనాయకుల కాలం వరకు దాదాపు వెయ్యేళ్లపాటు ఇది మనుగడలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయానికి దక్షిణాన చెరువుగట్టుపై భైరవుడి విగ్రహం ఉంది. వినాయకుడు, హనుమంతుడి ఆలయాలు కూడా ఈ గుడి ఆవరణలో ఉన్నాయి.

## కథ | పనికిరాని సాధనం



ఒక కుందేలు కొక్కిరాయి వద్దకు వచ్చి, 'నీవు కట్టుడుపళ్లు బాగా కడతావట. నాకు రెండు మంచి దంతాలు కట్టు.' అన్నది.

'నీ పళ్లన్నీ బాగానే ఉన్నాయే!' అన్నది కొక్కిరాయి.

'బాగా లేవని కాదు. నాకు ఇంకా పొడుగైన కోరలు – సింహం కోరల్లాంటివి కావాలి' అన్నది కుందేలు.

'దేనికి?' అని కొక్కిరాయి అడిగింది.

'నక్కను భయపెట్టడానికి. దానితో వేగలేకపోతున్నాను. దాన్ని చూసినప్పుడల్లా పారిపోవాల్సి వస్తోంది. ఈ దెబ్బతో అదే నన్ను చూసి పారిపోవాలి.' అన్నది కుందేలు.

కొక్కిరాయి తనలో తానే నవ్వుకొని కుందేలుకు రెండు భయంకరమైన కోరలు అమర్చింది.

కుందేలు అద్దంలో చూసుకొని 'అద్భుతం! ఇప్పుడు చెబుతాను నక్క పని..' అని నక్కను వెతుకుతూ బయల్దేరింది.

అది ఎంతో దూరం పోకుండానే ఒక

## పద్యం

**ఉరుకరుణాయుతుండు సమయోచిత మాత్మ దలంచి యుగ్రవా**
**కృరుషతజూపినన్నలముకల్గుట తథ్యముగాదె యంబురం**
**బురిమిన యంతనే కురియకుండునె వర్షము లోకరక్షణ**
**స్థిరతర పౌరుషంబున నశేషజనంబు లెఱుంగ భాస్కరా**

**భావం :** మేఘుడు ప్రాణంబున భయము గలుగునట్లు ఉరిమి వెంటనే జనులను రక్షించు పట్టుదలతో నానందము కలుగునట్లు వర్షించును. ఆ విధంగా మిక్కిలి దయగలవాడు సమయానుకూలంగా కఠిన వాక్యములు పల్కిననూ తదుపరి తప్పక మేలునే చేయును, కీడు మాత్రం చేయడు.

## సూక్తి రత్నం

**చోరాణాం అనృతం బలమ్**

**దుర్బలస్య బలం రాజా బాలానాం రోదనం బలమ్**
**బలం మూర్ఖస్య మౌనిత్వం చోరాణాం అనృతం బలమ్**

**భావం :** బలహీనులకు పాలకుల అండ బలం. పసివారికి ఏడుపు బలానిస్తుంది. మూర్ఖులు నోరు విప్పకపోవడం మంచిది. చోరులకు అసత్యాలే బలం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| సమరం | భూమి |
| పృథ్వి | ఉదయం |
| అంబరం | యుద్ధం |
| నిశీధిని | ఆకాశం |
| వేకువ | రాత్రి |

జవాబులు : సమరం–యుద్ధం, పృథ్వి–భూమి, అంబరం–ఆకాశం, నిశీధిని–రాత్రి, వేకువ–ఉదయం.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### తల్లాప్రగడ విశ్వసుందరమ్మ



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, రచయిత్రి. మార్చి 6, 1899న ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలోని ఉండి గ్రామంలో జన్మించారు. ఈమెకు తల్లాప్రగడ నరసింహశర్మతో వివాహం జరిగింది. 1921లో దంపతులిద్దరూ రాజకీయాల వైపు ఆకర్షితులై విజయవాడ కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యారు. శాసనోల్లంఘన, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుశిక్ష కూడా అనుభవించారు. విశ్వసుందరమ్మ ఆగస్ట్ 30, 1949న తుదిశ్వాస విడిచారు.



పొదచాటున తొంగి చూస్తున్న నక్క దానికి కనిపించింది.

కుందేలు శరవేగంతో కొక్కిరాయి వద్దకు తిరిగి వచ్చి, 'అన్నా ఈ కోరలు తీసేసి ఇంత కన్న భయంకరంగా ఉండేదేమైనా అమర్చగలవా?' అని అడిగింది.

'మార్చవలసినది నీ దంతాలు కావు. నీ పిరికి గుండె! దాన్ని తీసేసి గట్టి గుండె అమర్చినప్పుడు గాని నీ సమస్య తీరదు.' అన్నది కొక్కిరాయి. ★

## జనరల్ నాలెడ్జ్

1. ఇటీవలి ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుపొందిన నిఖత్ జరీన్ ఏ రాష్ట్రానికి చెందిన క్రీడాకారిణి?
2. అంతర్జాతీయ పుస్తక దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. ఐ.పి.ఎల్. ని విస్తరించండి?

సమాధానాలు : 1. తెలంగాణ; 2. ఏప్రిల్ 23; 3. ఇండియన్ ప్రీమియర్ లీగ్.

## మెదడుకు మేత

ఒకటి ఎత్తిపడితే రెండు ఉయ్యాల లూగుతాయి?

జవాబు : త్రాసు

## మంచిమాట

శరీరానికి వ్యాయామం అవసరమైనట్లే.. మెదడుకు పుస్తక పఠనం అవసరం



# వారఫలాలు

17-23 ఏప్రిల్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

భూవివాదాలు పరిష్కరించుకుంటారు. శ్రమకు తగిన ఫలితం. ఆదాయం పెరిగి సంతృప్తి నిస్తుంది. గృహం కొనుగోలు, నిర్మాణాలపై నిర్ణయం తీసుకుంటారు. వ్యాపారులు ఒడిదుడుకులు లేకుండా సాగుతారు. ఉద్యోగులకు చిక్కులు తొలగుతాయి. రాజకీయవేత్తలకు పదవులు దక్కవచ్చు. రచయితలు, క్రీడాకారులకు ఉత్సాహం. 22,23 తేదీల్లో వ్యయప్రయాసలు. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆదాయ ఆశాజనకంగా ఉంటుంది. వాహనాలు, భూముల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. కీలక నిర్ణయాలకు తగిన సమయం. వివాహ యత్నాలు సఫలం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు జరిగే వీలుంది. వ్యవసాయదారులు, వైద్యులకు సంతోషకరమైన సమా చారం. 20, 21 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో సమస్యలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అనుకున్న పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. కొన్ని సమస్యలు తీరతాయి. ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఆదాయ పరిస్థితి మెరుగు పడుతుంది. భూములకు సంబంధించి ఒప్పందాలు చేసు కుంటారు. ఉద్యోగయత్నాలు సఫలీకృతం. వాహన సౌఖ్యం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు మార్పు లపై ఆశ్చర్యపడతారు. 17, 18 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబసభ్యులతో తగాదాలు. గణేశుణ్ణి పూజించండి..

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

వాహనాలు, భూములు కొంటారు. రాబడి మెరుగుపడుతుంది. ఆరోగ్యంపై కొంత శ్రద్ధ చూపండి. వ్యాపారులకు క్రమేపీ లాభిస్తుంది. ఉ ద్యోగులు బాధ్యతలపై రాజీపడక పూర్తి చేస్తారు. రాజకీయవేత్తలకు శుభవార్తలు అందుతాయి. క్రీడాకారులు, వైద్యుల సేవలకు తగిన గుర్తింపు లభిస్తుంది. 18,19 తేదీల్లో కష్టానికి ఫలితం శూన్యం. స్నేహితులతో మనస్పర్థలు. కనకధారా స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొత్త వ్యూహాలతో ముందడుగు వేసి విజయాలు సాధిస్తారు. విలువైన సమాచారం అందుతుంది. ఆదాయానికి లోటుండదు. భూములు, వాహనాలు కొంటారు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. కళాకారుల యత్నాలు అనుకూలిస్తాయి. 20,21 తేదీల్లో అదనపుఖర్చులు. బంధువిరోధాలు. మానసిక ఆందోళన. శ్రీనృసింహ స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

అవసరాలకు సొమ్ము సమకూరుతుంది. విద్యార్థుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. స్థిరాస్తి వివాదాల నుంచి గట్టెక్కుతారు. విద్యార్థులకు నూత నోత్సాహం. వాహనయోగం. ఉద్యోగుల అంచనాలు నిజమవుతాయి. రచయితలు, క్రీడాకారులకు శు భవార్తా శ్రవణం. 19,20 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. కొన్ని విమర్శలు ఎదురవుతాయి. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆర్థిక వ్యవహారాలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. అయితే అవసరాలకు లోటు రాదు. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఉద్యోగాలలో మార్పులు అనివార్యం. కళారంగం వారికి ఒత్తిడులు తొలగు తాయి. 22,23 తేదీల్లో అనుకోని ధనవ్యయం. బంధువిరోధాలు. గులాబీ, పసుపు రంగులు, దక్షిణ దిశ ప్రయాణాలు అనుకూలం. విష్ణుధ్యానం చేయండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

అనుకున్న కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. విద్యార్థులకు అనుకూల పరిస్థితులు. విదేశీ విద్యావకాశాలు దక్కే సూచనలు. పాతబాకీలు వసూలవుతాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు ఈతిబాధల నుండి బయటపడతారు. రాజకీయవేత్తల శ్రమఫలిస్తుంది. రచయితలు, క్రీడాకారులకు నూత నోత్సాహం. 21, 22 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. మానసిక అశాంతి. దేవీఖడ్గమాల పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆస్తుల వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. రావలసిన బాకీలు అందుతాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు. తీర్థయాత్రలుచేస్తారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధుల్లో ఆటంకాలు అధిగ మిస్తారు. పారిశ్రామికవేత్తలకు శుభవార్తలు. రచ యి తలు, క్రీడాకారులకు సంతోషకరమైన సమాచారం. 18,19 తేదీల్లో కుటుంబంలో చికాకులు. అనారోగ్యం. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆరోగ్యపరమైన చికాకులు ఎదురవుతాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగులకు కొంత నిరాశ తప్పదు. వాహనాలు నడిపే వారు అప్రమత్తంగా మెలగాలి. ఉద్యోగులకు పనిఒత్తిడులు పెరుగుతాయి. కళాకారులకు ప్రయత్నాలలో ఆటంకాలు. క్రీడా కారులు, వైద్యులకు కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. 18,19 తేదీల్లో విందు వినోదాలు. చర్చలు సఫలం. గణేశాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

రాబడి విషయంలో ఇబ్బందులు తీరతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. భూములకు సంబం ధించిన కొన్ని అగ్రిమెంట్లు పూర్తిచేస్తారు. విద్యార్థులకు అనూహ్యమైన ఫలితాలు. వ్యాపారులు లావాదేవీలను పురోగతిలో నడిపిస్తారు. ఉద్యోగులకు సమస్యలు తీర తాయి. రాజకీయవేత్తలి ప్రయత్నాలు సఫలం. 22, 23 తేదీల్లో ఆరోగ్యభంగం. శ్రమాధిక్యం. స్నేహి తులతో విరోధాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. ముఖ్య మైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలనుంచి బయటపడతారు. ఆలయాలు సంద ర్శిస్తారు. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. గృహ నిర్మాణాలు చేపడతారు. వ్యాపారులకు నూత నోత్సాహం. ఉద్యోగులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. 17,18 తేదీల్లో కొన్ని వ్యవహారాలలో రాజీపడాల్సిన పరిస్థితి. కుటుంబంలో కొత్త సమస్యలు ఎదురుకావచ్చు. ఆంజనేయ దండకం పఠించండి.

# పదరసం-411

### ఆధారాలు

**అడ్డం**

1. శివాజీ మహారాజు బిరుదు (4)
3. మార్పు, ఉన్నస్థితి నుండి మరో స్థితి (4)
6. లక్ష్మి, పెట్టతామర (2)
8. చెరకోల (3)
9. పోకిరి వంటివాడే, పనీ పాటా లేక (3)
11. తట్టవంటిదే! (2)
12. వేదాలలో రెండోది (4)
13. వానతుంపర (2)
14. అర్ధభాగం (3)
16. వ్రతము వంటిదే (2)
19. గ్రామము (2)
21. వాన ముంచెత్తితే తర్వాత ఇదే! (3)
22. బోడిమిద్దె (2)
24. పులి విసిరేది (2)
25. నాకము (2)
26. పెద్ద అల, కెరటం (3)
27. ఒక రకం చేప (3)
29. సమూహము (2)
31. మోము, బంధనాలు విడుట (3)
32. క్షమించదగినది (4)

**నిలువు**

1. కపట సన్న్యాసి (5)
2. చదువతగినది అనే! (5)
4. రీతి తోడిది (3)
5. సుగృహము (4)
7.... పశుర్వేత్తి వేత్తి గానరస ఫణిః ఆరుభం (4)
10. వట్టివేరు, నానబియ్యము (3)
15. డగ్గుత్తిక, బొంగురుగొంతు (6)
16. ఆస్యగహ్వరము (2)
17. గర్భస్రావము నొందిన స్త్రీ (4)
18. పైజమా లేక లంగా బొందు (2)
20. ముస్లిం పర్వం (3)
23. పిల్లల మొదటివాచకము (4)
28. స్వర్గము (2)
30. ముఖం (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | ✠ |

**పదరసం - 411**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మే 09 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

### పదరసం - 407 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 స | రు | 2 కు | ✠ | 3 గో | పు | ✠ | 4 పా | వి | 5 త్రి |
| వ | ✠ | 6 వ | ల | పు | ✠ | 7 ఆ | సు | ✠ | శూ |
| రం | ✠ | ల | ✠ | 8 రం | 9 గ | స్థ | లం | ✠ | లం |
| ✠ | 10 ని | యం | 11 త | ✠ | డ | ✠ | 12 హ | 13 లం | ✠ |
| 14 కాం | తం | ✠ | 15 తి | 16 రు | ప | 17 తి | ✠ | 18 క | 19 ల |
| 20 త | బ | 21 లా | ✠ | మ | ✠ | న్నె | ✠ | ✠ | జ్జ |
| ✠ | 22 ము | భ | 23 శు | ✠ | ✠ | ✠ | 24 తా | 25 ర | ✠ |
| 26 త్ర | ✠ | 27 ము | న | ✠ | 28 కో | 29 పం | ✠ | 30 పం | 31 త |
| 32 ధా | 33 ర | ✠ | 34 కం | 35 చం | ✠ | 36 కం | 37 పం | ✠ | ను |
| 38 ని | మ | గ్న | ✠ | 39 క | న్న | ✠ | 40 బ | రు | వు |

**విజేతలు:** ఎ.నాగశశాంక్, భానువిజయ, మత్స్యరాజ విజయలక్ష్మి, జి.రవీంద్ర,ఎ.ప్రదీప్‌కుమార్, కె.వి.ఎస్.ఎన్. గణేశ్, డా.శివరామయ్య, వెల్లాల ఉమామహేశ్వరరావు, వారణాసి సరస్వతి, జైన ప్రభాకర్, సోమశ్రీవిష్ణు, రాయవరపు శేషు, మణిమాల గిరిప్రభు, ఏ.సాకేత్ రెడ్డి, టి.వి.సూర్యం, రుద్రభట్ల సుగుణ, వి.ఆర్.రావు, కె.సత్యనారాయణ, చింతకుంట దేవలక్ష్మి, టిఎస్ఆర్ ఆంజనేయులు, బావండ్ల అంజయ్య, ఎ.ఆర్.హెచ్. ప్రసాద్, కె.వి.ఎస్.ఆర్.మూర్తి, సి.గిరిజాశంకర్‌రావు, ఆర్.అంజనీదేవి, ప్రదీప్‌కుమార్, వి.పద్మారంగనాథ్, గుమ్మల సుధారాణి, వనమాల రామలింగాచారి, కల్లూరి వెంకటరమణ,

**బహుమతి పొందిన విజేత : వి. అరుంధతి,హైదరాబాద్**

చూస్తుండగానే కొత్త సంవత్సరంలో మూడు మాసాలు గడిచిపోయాయి. సంక్రాంతికి పెద్ద హీరోల సినిమాలు థియేటర్లలో సందడి చేయడంతో తెలుగు చిత్రసీమలో కోలాహలం నెలకొంది. ఈ యేడాది మొదటి మూడు నెలల్లో అనువాద చిత్రాలతో కలిపి ఏకంగా 71 సినిమాలు జనం ముందుకు వచ్చాయి. అందులో 16 అనువాద చిత్రాలు. వీటిలో విజయం సాధించిన సినిమాల తీరు గమనిస్తే కొంతలో కొంత ఆనందం కలుగుతుంది. కమర్షియాలిటీకి ప్రాధాన్యమిచ్చిన చిత్రాలలోనూ అంతర్లీనంగా అనుబంధాలు, ఆత్మీయతలకు దర్శకులు పెద్ద పీట వేశారు. వాటిని జనం మెచ్చి విజయ తీరాలకు చేర్చారు.

# అనుబంధాలు, ఆత్మీయతలకే పెద్దపీట!




జనవరి మాసంలో మామూలుగానే సినిమాలు బాగా విడుదల అవుతాయి. సంక్రాంతి సీజన్‌లో పెద్ద సినిమాలు మూడు నాలుగు వచ్చినా దానికి ముందు వెనుక వారాలలో చిన్న సినిమాలు సందడి చేయడం సహజం. కానీ ఈ యేడాది జనవరిలో స్ట్రయిట్ సినిమాలు పది, అనువాద చిత్రాలు ఐదు మాత్రమే విడుదలయ్యాయి. అందులో అగ్ర కథానాయకులు చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ నటించిన 'వీరసింహారెడ్డి' భారీ విజయాన్ని మూట కట్టుకున్నాయి. చిరంజీవి సినిమా బ్రదర్ సెంటిమెంట్ ప్రధానంగా సాగితే, బాలకృష్ణ మూవీ సిస్టర్ సెంటిమెంట్‌తో అభిమానులను రంజింపచేసింది. సంక్రాంతికే బరిలో దిగిన తమిళ డబ్బింగ్ సినిమా 'వారసుడు' మదర్ సెంటిమెంట్‌తో ఫర్వాలేదనిపించుకుంది. అదే నెలలో వచ్చిన షారుఖ్‌ఖాన్ 'పఠాన్' ఉత్తరాది వారిని ఆకట్టుకున్నా దక్షిణాదిలో చేతులెత్తేసింది. అలానే మలయాళ అనువాద చిత్రం 'మాలికాపురం' తెలుగులో ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. మలయాళ చిత్రం 'ముంబై పోలీస్' రీమేక్ అయిన 'హంట్' చిత్రం జనాలకు చుక్కలు చూపించింది.

ఫిబ్రవరి మాసంలో 19 స్ట్రయిట్ సినిమాలు విడుదల కాగా, అనువాద చిత్రాలు మూడు మాత్రమే వచ్చాయి. సుహాస్ హీరోగా నటించిన 'రైటర్ పద్మభూషణ్' సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఈ సినిమాలో మదర్ సెంటిమెంట్‌ను కొత్త దర్శకుడు షణ్ముఖ్ ప్రశాంత్ బాగానే దట్టించాడు. ఆ వెనుకే వచ్చిన మరో మలయాళ రీమేక్ 'బుట్టబొమ్మ' తెలుగువారిని మెప్పించలేకపోయింది. ఇక గత యేడాది 'బింబిసార'తో ప్రేక్షకులను మెప్పించిన నందమూరి కల్యాణ్ రామ్ త్రిపాత్రాభినయం చేసిన 'అమిగోస్' తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇదే సమయంలో ధనుష్ హీరోగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్' గౌరవప్రదమైన విజయాన్ని అందుకుంది. మూడున్నర దశాబ్దాల క్రితం ప్రైవేట్ విద్యా సంస్థల అరాచకం ఎలా మొదలైందో ఈ సినిమాలో దర్శకుడు వెంకీ అట్లూరి చూపించాడు. దీని వెనుకే వచ్చిన మరో ఆసక్తికరమైన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. వరుస పరాజయాలతో సాగుతున్న కిరణ్ అబ్బవరంను కాస్తంత ఊపిరి పీల్చుకునేలా చేసిందీ సినిమా. దీనితో మురళీ కిశోర్ అబ్బూరు దర్శకుడిగా పరిచయం అయ్యాడు.

మార్చిలో ఏకంగా 34 సినిమాలు విడుదల అయ్యాయి. అంటే సగటున రోజుకు ఒకటి కంటే ఎక్కువ. ఇందులో అనువాద చిత్రాలు ఎనిమిది ఉన్నాయి. ఈ నెలలో హాస్యనటుడు వేణు తొలిసారి దర్శకత్వం వహించిన 'బలగం' సినిమా చెప్పుకోదగ్గది. తెలంగాణ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో ఫ్యామిలీ సెంటిమెంట్‌కు వేణు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఒకే తల్లి కడుపున పుట్టిన పిల్లలు అహంతోనూ, ఆర్థిక కారణాలతోనూ విడిపోతే... ఉన్న ఊరిలోనూ, అయిన వారి మధ్యన ఆ కుటుంబం ఎంత పలచనైపోతుందో వేణు కళ్లకు కట్టినట్టు చూపాడు. ఈ నెలలోనే వచ్చిన విశ్వక్ సేన్ 'దాస్ కా ధమ్కీ' ప్రేక్షకులను నిరాశ పర్చింది. దీనికి అతనే దర్శకుడు, నిర్మాత కూడా! పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అయిన 'ధమ్కీ' ఎక్కడా తన ప్రభావాన్ని చూపించలేకపోయింది. మార్చి నెలాఖరులో వచ్చిన నాని 'దసరా' అతని విజయ దాహార్తిని తీర్చింది. కొన్నేళ్లుగా సరైన సక్సెస్ లేక నాని డీలా పడిపోయాడు. 'దసరా' కథలో దమ్ములేకపోయినా తెలంగాణ నేపథ్యంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తీసిన పద్ధతికి, నటీనటుల నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. దాంతో ఈ సినిమా ఏకంగా ఐదు రోజుల్లోనే వంద కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. దీంతో తొలి మూడు మాసాల్లో తెలుగులో మూడు సినిమాలు వందకోట్ల గ్రాస్‌ను అందుకున్నాయి. మార్చిలో వచ్చిన కృష్ణవంశీ 'రంగమార్తాండ'లోనూ కుటుంబ విలువలనే ప్రధానాంశంగా తీసుకున్నారు. బిడ్డల ఆదరణ కరువైన తల్లిదండ్రుల పరిస్థితి చివరి రోజుల్లో ఎంత దయనీయంగా ఉంటుందో కృష్ణవంశీ చూపించాడు. మరాఠీ చిత్రం 'నటసమ్రాట్'తో పోల్చి కొందరు పెదవి విరిచినా ఈ సినిమా చూసిన వాళ్లు మాత్రం బాగానే ఉందంటూ కితాబిచ్చారు. కానీ థియేటర్లకు ప్రేక్షకులను రప్పించడంలో 'రంగమార్తాండ' విఫలమయ్యింది. మరో తమాషా ఏమంటే.. ఈ మూడు నెలల్లోనూ సీనియర్ దర్శకులు మరో ముగ్గురి సినిమాలు కొన్నేళ్ల తర్వాత జనం ముందుకు వచ్చాయి. ఎస్వీ కృష్ణారెడ్డి 'ఆర్గానిక్ మామ-హైబ్రీడ్ అల్లుడు', రేలంగి నరసింహారావు 'ఊ అంటావా మావ ఉ ఊ అంటావా మావ', శివ నాగేశ్వరరావు 'దోచేవారెవరురా' బాక్సాఫీస్ బరిలో పేలవమైన ప్రదర్శన కనబరిచాయి. ఈ మూడు నెలల్లో విజయం సాధించిన చిత్రాలలో అత్యధిక భాగం సెంటిమెంట్ ప్రధానమైనవి కావడం విశేషం. ఇక ఏప్రిల్ మొదటి వారంలో వచ్చిన రవితేజ 'రావణాసుర', కిరణ్ అబ్బవరం 'మీటర్' చిత్రాల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఇదే నెలలో తెలుగు నుండి రాబోతున్న పాన్ ఇండియా మూవీస్ 'శాకుంతలం, విరూపాక్ష, ఏజెంట్' ఎలాంటి విజయాలను నమోదు చేసుకుంటాయో చూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్







కాచం రమేశ్ ద్వారా ప్రొ.రమణరావుకు, ప్రొ. కసిరెడ్డికి ప్రొ. దామోదర్ ద్వారా, కాచం రమేశ్‌కు ప్రొ. రమణమూర్తి ద్వారా జ్ఞాపికలు




కవయిత్రికి ప్రశంసాపత్రం.





వరిగొండ ద్వారా మనోహర్‌బాబుకు, డా. ఎన్‌వీఎన్ చారికి డాక్టర్ సంజీవ ద్వారా జ్ఞాపికలు



ఓరుగల్లు సాహితీ ఉత్సవానికి హాజరైన సాహిత్య, చరిత్ర అభిమానులు

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 26

*With best compliments from:*

Estd : 1994-95

# G.PULLA REDDY COLLEGE OF PHARMACY

**Affiliated to Osmania University and Approved by PCI & AICTE**
**Accredited by NAAC, ISO 9001-2015 Certification**
**G.Pulla Reddy Educational Campus, Mehdipatnam, Hyderabad-500028**
**Phone : 040-23517222, +91 8297511177**
**Email: gprcphyd@gmail.com I website : gprcp.ac.in**

**EAMCET Code : GPRP** **PGECET Code : GPRP1**



## COURSES OFFERED

**B.Pharm**

**M.Pharm**

1. M.Pharm (Pharma. Chemistry)
2. M.Pharm (Pharmaceutics)
3. M.Pharm (Pharmacology)
4. M.Pharm (Pharma. Analysis)
5. M.Pharm (Pharma. Regulatory Affairs)

**Pharm D**

Founder Chairman
**Late G. Pulla Reddy**

Chairman
**P.Subba Reddy**

Managing Trustee
**G.Raghava Reddy**